PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 42 సంచిక : 334 | విజయవాడ, బుధవారం 5 జులై 2023 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 5 July 2023 | Rs



380 గ్రామాలు, నదీనదాలు, కొండకోనలు దాటి 400 కిలోమీటర్లు నడిచి విజయవాడ చేరుకున్న మహా పాదయాత్ర



మహా ధర్నా సభలో ప్రసంగిస్తున్న బివి రాఘవులు, వేదికపై వి శ్రీనివాసరావు, వడ్డే శోభానాద్రీశ్వరరావు, కె రామకృష్ణ, కెఎస్ లక్ష్మణరావు, వామపక్షాలు, ప్రజాసంఘాల నాయకులు

ప్రభుత్వాలు స్పందించకుంటే

ఉద్యమం ఉధృతం

- పౌర సమాజం మద్దతివ్వాలి
- బిజెపి విద్రోహంపై నిలదీయాలి

'పోలవరం నిర్వాసితుల పోరు కేక' పాదయాత్ర ముగింపు ధర్నాలో వక్తలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

'పోలవరం నిర్వాసితుల పోరు కేక' పేరిట అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక నుంచి ప్రారంభమైన మహా పాదయాత్ర మంగళవారం నాడు విజయవాడకు చేరింది. జూన్ 20న ఐదొందల మందికిపైగా వలంటీర్లతో ప్రారంభమైన పాదయాత్ర 380 గ్రామాలను సందర్శిస్తూ 400 కిలోమీటర్లు పదిహేను రోజులు సాగింది. మంగళవారం ఉదయం విజయవాడ సింగ్‌నగర్ దాబాకొట్ల సెంటర్ నుంచి మొదలై ధర్నాచౌక్ చేరుకుంది. విప్లవ కిశోరం అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా మార్గంమధ్యలో బుడమేరు వంతెన వద్ద గల అల్లూరి విగ్రహానికి పాదయాత్ర రథసారథి, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు పూలమాల వేసి నివాళులర్పించారు. విజయవాడ నగరంలో పుర ప్రజలు అడుగడుగునా పూలు చల్లి పాదయాత్రకు ఘనంగా స్వాగతం పలికారు. నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని పెద్ద పెట్టున నినదించారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా ధర్నాచౌక్‌లో మహా ధర్నా జరిగింది.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారం అధ్యక్షత వహించిన సభలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు ప్రసంగిస్తూ... అకుంఠిత దీక్షతో నిర్వాసితులు చేసిన పాదయాత్ర వృథా కాదు. వారి పట్టుదల, శ్రమ సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయి. జలయజ్ఞంలో భాగంగా పోలవరం ప్రారంభ సమయంలో ఐదేళ్లల్లో ప్రాజెక్టు పూర్తి చేస్తామన్నారు అప్పటి సిఎం రాజశేఖర్‌రెడ్డి. 30 ఏళ్లయినా పూర్తి కాదన్నాం. 16 వేల కోట్లు కాదు 50 వేల కోట్లు కావాలన్నాం. అదే జరిగింది. ఆలస్యానికి కారకులెవరు? సర్వం త్యాగం చేసిన నిర్వాసితులా? జాతీయ ప్రాజెక్టు అన్న బిజెపినా? బిజెపి పంచన చేరి కాలక్షేపం చేసిన టిడిపి కారణమా? బిజెపి అడుగులకు మడుగులొత్తుతున్న వైసిపినా? సమాధానం చెప్పాలి. నిర్వాసితులు కారణమని పాలకపార్టీలు ప్రచారం చేస్తున్నాయి. ప్రాజెక్టులో ఎవరికి ముందు ప్రాధాన్యమివ్వాలి? భూములు, ఇళ్లు త్యాగం చేసిన లక్ష కుటుంబాలకు కాదా? వాళ్ల రక్తాన్ని, ప్రాణాలను, బతుకులను చిదిమేసి అభివృద్ధిని మనం ఆస్వాదిద్దామా? పోలవరం వలన అయ్యే సశ్యశ్యామలంలో నిర్వాసితులకు భాగస్వామ్యం వద్దా? నిర్వాసితుల సమస్య రాష్ట్రానిది, మనది, ప్రజలందరిది. సమాజమంతా అండగా నిలబడి వారికి మద్దతివ్వాలి. ఏం జరిగినా తలొంచుకొని పోతారులే అనుకుంటే తిరుగుబాటు చేస్తారు. అలాంటి తిరుగుబాట్లు కోరుకుందామా? కోరుకోకూడదు. ప్రభుత్వం బాధ్యతగా సమస్యలు పరిష్కరించాలి. ఈసారి వరదలొస్తే కొండలెక్కరు. సిఎం ఇల్లెక్కుతారు. తాత్కాలిక చర్యలపై సర్కారు మిగతా 2లో

మూతబడిన చిత్తూరు డెయిరీకి అమూల్‌తో జీవం

- శంకుస్థాపన సభలో సిఎం జగన్

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

'టిడిపి హయాంలో విజయా డెయిరీని భూస్థాపితం చేశారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా రెండు దశాబ్దాలుగా మూతబడి ఉన్న ఈ డెయిరీ రూ.182 కోట్ల అప్పులను తీర్చి, అమూల్ సంస్థతో ఒప్పందం చేసుకుని మరలా జీవం పోశాం' అని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. జగనన్న పాలవెల్లువ పథకంలో ఇది మరో విప్లవాత్మక అడుగని, చిత్తూరు విజయ డెయిరీ పునరుద్ధరణ జరిగిందని ఉద్ఘాటించారు. వివిధ అభివృద్ధి పనులకు ఆయన చిత్తూరులో మంగళవారం భూమిపూజ చేశారు. అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగించారు. ఏనాడో మూతబడిన అతి పెద్ద డెయిరీని తెరిపించేందుకు నాంది పలికామన్నారు. దేశంలోనే టాప్ త్రీ మెడికల్ కాలేజీల్లో ఒకటైన వెల్లూరు సిఎంసి ఏర్పాటుకు చీలాపల్లి వద్ద పునాది రాయి వేస్తున్నానని తెలిపారు. దీంతో, చిత్తూరులో మెడికల్ కాలేజీ కల నిజం కాబోతుందని పేర్కొన్నారు. చిత్తూరు డెయిరీని 2002లో కుట్రపూరితంగా మూసేశారని, 1992లో హెరిటేజ్ వచ్చే సమయానికి 2.50 లక్షల నుంచి మూడు లక్షల లీటర్ల వరకు పాల సేకరిస్తున్న అతి పెద్ద సహకార డెయిరీని కావాలనే నష్టాల్లోకి నెట్టి మూసేశారని, తన సొంత సంస్థ హెరిటేజ్ కోసం చిత్తూరు రైతులను చంద్రబాబు ముంచేశారని విమర్శించారు. పాదయాత్ర సందర్భంగా తాను ఇచ్చిన మాట ప్రకారం అమూల్‌ను తీసుకురావడమే కాకుండా రూ.385 కోట్ల పెట్టుబడి చిత్తూరు డెయిరీలో పెడుతున్నామని తెలిపారు. సహకార రంగంలోని డెయిరీలకు పాలు పోస్తున్న రైతులకు ప్రతి ఆరు నెలలకొకసారి బోనస్ ఇచ్చి లాభాలను పంచి పెడుతున్నామన్నారు. రాబోయే 5 నుంచి 8 ఏళ్ల కాలంలో పది లక్షల లీటర్ల సేకరణ స్థాయికి వెళతామన్నారు. దీనిద్వారా ఐదు వేల మందికి ప్రత్యక్షంగా ఉద్యోగాలు వస్తాయని, రెండు లక్షల మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుందని తెలిపారు.



అమూల్ సంస్థకు, ప్రభుత్వానికి జరిగిన ఒప్పంద పత్రాలను మార్చుకుంటున్న జగన్ మోహన్‌రెడ్డి, అమూల్ సంస్థ ప్రతినిధులు

'చంద్రబాబు' అన్యాయాలు కోకొల్లలు

చిత్తూరు జిల్లాకు చంద్రబాబు చేసిన అన్యాయాలు కోకొల్లలని, చేసిన మంచి ఒక్కటీ లేదని జగన్‌మోహన్‌రెడ్డి విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా చంద్రబాబు హయాంలో సహకార రంగంలోని 54 సంస్థలను మూసేశారని, రైతులకు బకాయిలు చెల్లించలేదని తెలిపారు. 'ప్రయివేటైజేషన్ ఎ సక్సెస్ స్టోరీ ఇన్ ఆంధ్రప్రదేశ్' అనే పుస్తకాన్ని ఆవిష్కరించిన చంద్రబాబు, ఎన్నికలు వస్తే మాత్రం మోసం చేయడానికి విశాఖపట్నం పోయి స్టీల్‌ప్లాంట్ ముందు ధర్నా చేస్తానంటున్నాడని, ఆ మనిషి మనస్తత్వం ఎలాంటిదో ఆలోచన చేయాలని అన్నారు. చంద్రబాబు, దత్తపుత్రుడు ఇద్దరూ నాన్‌రెసిడెంట్ నాయకులని విమర్శించారు. తాను అబద్ధాలు చెప్పలేనని, మోసాలు చేయలేనని, దేవుడిని, ప్రజలను మాత్రమే మిగతా 2లో

ఉగ్రవాదం ప్రపంచ శాంతికే ముప్పు

- షాంఘై సదస్సు ప్రారంభిస్తూ మోడీ
- ఐక్యత, సమన్వయంతో ముందుకు సాగాలి: జిన్‌పింగ్
- సంపన్న దేశాల బాధ్యతారహిత విధానాల వల్లే ఉద్రిక్తతలు: పుతిన్

7

మళ్లీ పెరిగిన వాణిజ్య గ్యాస్ ధర

న్యూఢిల్లీ : వాణిజ్య ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల ధరలను కేంద్ర ప్రభుత్వం మళ్లీ పెంచింది. సిలిండర్‌కు రూ.7 పెంచినట్లు ప్రభుత్వ రంగ మార్కెటింగ్ సంస్థలు మంగళవారం తెలిపాయి. పెరిగిన ధరతో న్యూఢిల్లీలో 19 కేజీల వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.1,780కు చేరుకుంది. చెన్నైలో రూ.1,952కు చేరుకుంది. వాణిజ్య గ్యాస్ ధరలను మే, జూన్‌లో తగ్గించిన ప్రభుత్వం జులైలో మళ్లీ పెంచింది. వాణిజ్య, గృహ ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల ధరలను ప్రతి నెలా 1వ తేదీన మార్కెటింగ్ సంస్థలు సమీక్షిస్తుంటాయన్న సంగతి తెలిసిందే.



అల్లూరి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

పీడిత వర్గాల పక్షాన పోరాడాలి

- మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాలి
- అల్లూరి 125వ జయంతి ముగింపు వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలిగా పురందేశ్వరి

- ఎగ్జిక్యూటివ్ కమిటీలోకి కిరణ్‌కుమార్‌రెడ్డి
- తెలంగాణ అధ్యక్షులుగా కిషన్‌రెడ్డి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర మాజీ మంత్రి డి.పురందేశ్వరి బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమితులయ్యారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్.కిరణ్ కుమార్ రెడ్డి ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడి బాధ్యతలు నిర్వహించనున్నారు. పార్టీ తెలంగాణ అధ్యక్షులుగా జి.కిషన్‌రెడ్డి, ఎన్నికల నిర్వహణ కమిటీ ఛైర్మన్‌గా ఈటల రాజేందర్ నియమితులయ్యారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అధ్యక్షులు సోము వీర్రాజు, బండి సంజయ్‌లకు ఉద్వాసన పలికారు. ఈ మేరకు బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా నిర్ణయం తీసుకున్నారని, ఈ నిర్ణయం తక్షణం అమలులోకి వస్తుందని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆరుణ్ సింగ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జార్ఖండ్ అధ్యక్షునిగా దీపక్ ప్రకాష్ స్థానంలో మాజీ సిఎం జాబూలాల్ మరాండీని, పంజాబ్ అధ్యక్షుడిగా అహ్వానీ శర్మ స్థానంలో గతంలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేసిన సునీల్ జక్కర్‌ను నియమించినట్లు ఆ ప్రకటనలో తెలిపారు. జార్ఖండ్ వికాస్ మోర్చా (జెవిఎం) అధ్యక్షుడిగా ఉన్న బాబూలాల్ మరాండీ తన పార్టీని 2020 ఫిబ్రవరిలో విలీనం చేయడంతో ఆయనకు బిజెపి జార్ఖండ్ అధ్యక్ష పదవి దక్కింది.

ఈ నెల 7న బిజెపి రాష్ట్ర అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌లందరితో ఆ పార్టీ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా, జాతీయ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ అధ్యక్షత వహిస్తారు.



నేపథ్యం

దగ్గుబాటి పురందేశ్వరి 1959 ఏప్రిల్ 22న జన్మించారు. కాంగ్రెస్ పార్టీ తరపున 2004లో బాపట్ల నుంచి, 2009లో విశాఖపట్నం నుంచి గెలిచారు. కేంద్రమంత్రిగానూ పనిచేశారు. రాష్ట్ర విభజన తరువాత 2014లో పురందేశ్వరి బిజెపిలో చేరారు. ఆ పార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలిగా పనిచేశారు. ప్రస్తుతం బిజెపి ఒరిస్సా రాష్ట్ర ఇన్‌ఛార్జిగా ఉన్న ఆమెను రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించారు.

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన కిషన్ రెడ్డి 2010-14 మధ్య ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు, 2014-16 మధ్య తెలంగాణకు బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా పనిచేశారు. 2016-18 మధ్య శాసన సభాపక్ష నేతగా వ్యవహరించారు. 2019 ఎన్నికల్లో సికింద్రబాద్ ఎంపిగా గెలిచిన ఆయన ప్రస్తుతం కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రిగా కొనసాగుతున్నారు.

5 విభాగాల్లో నంది నాటక అవార్డులు

- పోసాని కృష్ణమురళి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఐదు విభాగాల్లో నంది నాటక అవార్డులు ఇవ్వనున్నట్లు రాష్ట్ర ఫిల్మ్, టివి, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. మంగళవారం సచివాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తొలుత పద్య, సాంఘిక, బాలలు, యువజన నాటకాలతోపాటు సాంఘిక నాటిక అనే ఐదు విభాగాల్లో ఉత్తమ కళాకారులకు నంది నాటక అవార్డులు ఇచ్చేందుకు నిర్ణయించామని తెలిపారు. ఎపిలో ఉచితంగా షూటింగులు జరుపుకునేందుకు ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఫిల్మ్, టివి, థియేటర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎమ్‌డి టి విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ఈ ఏడాది మొత్తం 73 అవార్డులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. బుధవారం నోటిఫికేషన్ జారీ చేస్తామన్నారు. దరఖాస్తుల కోసం అఫిషియల్ వెబ్‌సైట్ కూడా ఉందని తెలిపారు. ప్రదర్శన చోటుకే జ్యూరీ సభ్యులు వెళ్తారన్నారు. ప్రాథమిక స్థాయిలో ఎంపికైన బృందాలను రాష్ట్ర స్థాయిలో నిర్వహించే తుది పోటీలకు అనుమతించనున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన కేంద్రంలో ఆరు రోజులపాటు పోటీలు నిర్వహించి ఏడోరోజు నంది అవార్డుల ప్రదానోత్సవం జరుగుతుందని తెలిపారు.

ఉద్యోగాల్లో క్రీడా కోటా రద్దు ?

మెడలిస్టులకు ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయమే

2023-2028 క్రీడా పాలసీలో కసరత్తు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఉద్యోగాల భర్తీలో ఇప్పటివరకు అమలు చేస్తున్న క్రీడల కోటాను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయనున్నట్లు తెలిసింది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. దీనివల్ల ఎంతోమంది ఆటగాళ్లు పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా, అధికారులుగా పనిచేస్తున్నారు. ఇకపై ఆ విధానం రద్దు కానుంది.

ఇప్పుడున్న క్రీడా విధానాన్ని మార్పులు చేసి కొత్తగా 2023-28 విధానాన్ని ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై ఇప్పటికే పలువురు అధికారులు, క్రీడా నిపుణులతో కూడా ప్రభుత్వం చర్చలు నిర్వహించింది. ఇదే సమయంలో ఆటగాళ్లకు ఉద్యోగావకాశాలపై కూడా అధికారులు లాంఛనంగా కీలక నిర్ణయం తీసుకున్నారు. మెడల్స్ సాధించిన వారికి ఇకపై ఉద్యోగాలు ఇవ్వడం అనే విధానానికి స్వస్తి చెప్పాలని నిర్ణయించారు. రానున్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి కేవలం ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం మాత్రమే అందించాలని నిర్ణయించడం గమనార్హం.



ఇప్పటివరకు మెడల్స్ సాధించిన వారికి అనేక రాష్ట్రాల్లో గౌరవ సూచికంగా ఉద్యోగాలు ఇస్తున్నారు. ఎక్కువగా పోలీస్, రెవెన్యూ శాఖల్లో వారికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుంటారు. కేంద్ర ప్రభుత్వం కూడా గణనీయంగా రాణించిన వారికి సర్వీసెస్, రైల్వే, పోర్టులు వంటి వాటిల్లో ఉద్యోగాలు కల్పిస్తోంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోటాలో ఉద్యోగాలు రద్దు చేయడానికి అడుగులు వేస్తోంది. తాజాగా ఆడుదాం ఆంధ్రా నిర్వహణ నేపథ్యంలో ఉన్నతాధికారుల కమిటీ నిర్వహిస్తున్న భేటీల్లో స్పోర్ట్స్ పాలసీపై కొంతమంది మాజీ సీనియర్ ఆటగాళ్లు, క్రీడా నిపుణుల నుంచి సూచనలు వచ్చినట్లు సమాచారం.

ప్రతి గ్రామంలోనూ క్రీడా క్లబ్

కొత్తగా తీసుకొస్తున్న క్రీడా పాలసీపైనా కీలకంగా చర్చ జరుగుతోంది. దీనిపై అధ్యయనం కోసం ఒక బృందాన్ని ఇతర రాష్ట్రాలకు కూడా పంపించనున్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో అధ్యయనం కూడా పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. ఈ కొత్త పాలసీలో గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిర్వహించే క్రీడా పోటీలను, ప్రతి గ్రామంలో ఒక స్పోర్ట్స్ క్లబ్‌ను ఏర్పాటుచేసే అంశాలను కూడా పాలసీలో పొందుపరచనున్నారు. అలాగే ప్రతియేటా ఆడుదాం ఆంధ్రాతోపాటు, పాఠశాల క్రీడలను కూడా నిర్వహించేలా పాలసీలో పొందుపరచనున్నారు.

బిజెపితో వేదికను పంచుకోలేం

- సిపిఎం రాష్ట్ర కమిటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సభలో బిజెపితో తాము వేదికను పంచుకోలేమని సిపిఎం రాష్ట్ర కమిటీ పేర్కొంది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సభకు జి రఘురామరాజు తమను ఆహ్వానించినందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజుకు జోహార్లు అర్పించారు. భారత స్వాతంత్ర్యం కోసం పోరాడిన యోధుడు అల్లూరి సీతారామరాజు అని పేర్కొన్నారు. అదే గిరిజనులు వీధుల్లో పడి పునరావాసం కోసం పోరాడుతున్నారన్నారు. అల్లూరి స్ఫూర్తితో పోరాటం కొనసాగుతుందని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమానికి వెన్నుపోటు పొడిచి, గాంధీజీ హంతకులు గాడ్సేలను దేశభక్తులుగా కీర్తిస్తున్న బిజెపి నాయకులను ఈ సభకు పిలవడం ఆమోదయోగ్యం కాదన్నారు. త్యాగధనులను స్మరించేటప్పుడు ద్రోహులను పిలవడం అంటే అల్లూరి సీతారామరాజు త్యాగాలను అవమానించటమేనని పేర్కొన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

ఎబి పిటిషన్ డిస్మిస్

ప్రజాశక్తి-అమరావతి

ఆర్జిత సెలవులపై విదేశాలకు వెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ సీనియర్ ఐపిఎస్ అధికారి ఎబి వెంకటేశ్వరరావు దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. విదేశీ పర్యటనకు వెళ్లేందుకు అనుమతి నిరాకరిస్తూ సిఎస్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని అనుబంధ పిటిషన్‌లో కోరకుండా విదేశాలకు వెళ్లేందుకు అనుమతివ్వాలని కోరడాన్ని తప్పుపట్టింది. సిఎస్ ఉత్తర్వులను సవాల్ చేయకుండా విదేశాలకు వెళ్లేందుకు అనుమతి కోరేందుకు వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ జి రామకృష్ణ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనుబంధ పిటిషన్‌లోని పొరపాటును గుర్తించామని, తిరిగి అనుబంధ పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతివ్వాలని ఎబి తరపున న్యాయవాది కోరడంతో హైకోర్టు అనుమతించింది. విచారణను ఈ నెల 7కు వాయిదా వేసింది. ఇదిలా ఉండగా సిఎస్ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎబి అనుబంధ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు బుధవారం విచారణ చేయనుంది.

నూతన సర్వీస్ రూల్స్ కొత్త జిల్లాల ప్రాతిపదికన ఇవ్వాలి

- మంత్రి బొత్సకు నోబుల్ టీచర్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

నూతన సర్వీస్ రూల్స్ కొత్త జిల్లాల ప్రాతిపదికన ఇవ్వాలని, పట్టణ, నగర పరిధిలోని ఎంఇఒ-2 పోస్టులకు ఆయా పట్టణ, నగర పరిధిలోని సీనియర్ హెడ్‌మాస్టర్లు/సీనియర్ స్కూల్ అసిస్టెంట్లకు ఇవ్వాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు అసోసియేషన్ అధ్యక్షులు మూకల అప్పారావు, ప్రధాన కార్యదర్శి నడిపినేని వెంకటరావు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సర్వీస్ రూల్స్ 2016 ప్రకారం అవసరమైతే మార్పులు చేసి తక్షణమే బదిలీలు, పదోన్నతులు కల్పించాలని కోరారు. జిఒ 84 ప్రకారం పర్యవేక్షణ అధికారాలు బదలాయింపుపై పున:పరిశీలన చేయాలన్నారు.

ప్రభుత్వాలు స్పందించకుంటే

ఉద్యమం ఉధృతం

(మొదటి పేజీ తరువాయి)

అఖిలపక్షం వేసి గిరిజన సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించాలి. కేంద్రం నిధులివ్వమంటే అప్పటి రేట్లు ఇప్పటి రేట్లనడానికి ఇదేమన్నా కూరగాయల బేరమా? ఎంతైతే అంతా ఇవ్వాలి. తొలిదశకు 12 వేల కోట్లని ఎన్నికల గిమ్మిక్కు చేస్తోంది బిజెపి. తరచు ఢిల్లీ వెళుతున్న సి.ఎం. ఎందుకు కేంద్రాన్ని నిధులు అడగట్లేదు. ఎందు కోసం మీ ములాఖత్‌లు, దండాలు దస్కాలు? సిఎంకు సిమెంట్, స్టీలు, ఇసుక మీద ప్రేమ. కమీషన్లొస్తాయని కాంట్రాక్టర్లపై ప్రేమ. మనుషులను పట్టించుకొనే పరిస్థితి లేదు. రాష్ట్రంలో ప్రజలకు సమస్యొస్తే తీర్చాల్సింది రాష్ట్ర ప్రభుత్వమే. ఈమధ్య సిఎం తాను ప్రజల పక్షం అంటున్నారు. ప్రజలపక్షమో కాంట్రాక్టర్ల పక్షమో తేల్చుకోవాలి. పాదయాత్ర ప్రభుత్వాలకు కంటి పరీక్ష. చూడకపోతే పోరాటం ఉధృతం చేసి ఎన్నికల్లో వారిని గద్దె దించుతారు.



విజయవాడ చేరుకున్న మహాపాదయాత్ర అగ్రభాగాన జివి రాఘవులు, శ్రీనివాసరావు, చలసాని, కెఎస్ లక్ష్మణరావు, సిహెచ్ బాబూరావు తదితరులు

పాలనను స్తంభింపజేస్తాం

పోలవరం నిర్వాసితుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం దిగిరాకపోతే ప్రతి గ్రామాన్నీ రణ క్షేత్రం చేస్తామని, పాలనను స్తంభింపజేస్తామని, సచివాలయాలను నడవనీయమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు హెచ్చరించారు. పాదయాత్ర తరువాత పది పదిహేను రోజులు చూస్తాం. ప్రభుత్వం స్పందించకపోతే విశాల మద్దతుతో ఐక్య పోరాటాన్ని ఉధృతం చేసేందుకు కార్యాచరణ రూపొందిస్తాం. పోరాటం చివరికంటా సాగుతుంది. ముందు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించమంటే ప్రభుత్వం ముందు డ్యామేనంటోంది. నిరుడు జులైలో వచ్చిన వరద నిర్వాసితులకు పీడకలగా మారింది. వరదంటే ఉలిక్కిపడుతున్నారు. ఈ వరదలు ప్రభుత్వ సృష్టి. నదికి అడ్డంగా కట్ట కట్టడం వలన వరదలొస్తున్నాయి. పాదయాత్రలో తెలియని నిర్వాసితుల బాధలు అనేకం తెలిసొచ్చాయి. పట్టాలు, మందులు, మంచినీళ్లు సైతం అందించకుండా నిరుడు వరద సహాయ చర్యలపై ప్రభుత్వం చేతులెత్తేసింది. ఈ యేడు కూడా ముందస్తుగా ఏమీ సిద్ధం చేయలేదు. ఈసారి వరదొస్తే తాడేపల్లి ప్యాలెస్ ఎక్కుతారు. అశాస్త్రీయ కాంటూరు లెక్కలతో మభ్యపెట్టి మోసం చేస్తోంది సర్కారు. నిరుడు వరదలకు మునిగిన అన్ని గ్రామాలనూ ముంపు గ్రామాలుగా ప్రకటించి ఆర్ అండ్ ఆర్ అమలు చేయాలి. సిఎం ఎందుకు ఢిల్లీ వెళుతున్నారు. కేంద్రం కాళ్లు పట్టుకుంటారో కాలర్ పట్టుకుంటారో పోలవరం నిర్వాసితుల గురించి చర్చించి నిధులు తీసుకురండి. తీసుకురాలేకపోతే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నుంచి ఇవ్వండి. లేదంటే మీ స్వంత ఆస్తులమ్మి ఇవ్వండి. చిన్న సమస్యలపై రీజాయిండర్లు, ఫ్యాక్ట్ చెక్ అనే మీరు పోలవరం నిర్వాసితులపై ఎందుకు సమాధానం చెప్పట్లేదు?...

మీ వెంటే రాష్ట్రం

పోలవరం నిర్వాసితుల పోరాటం వెనుక ఈ రాష్ట్రం, కోట్లాది మంది ప్రజలు ఉన్నారని మాజీ మంత్రి, రైతు నాయకులు వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. మహాధర్నాకు ఆయన సంఘీభావం, పాదయాత్రికులకు అభినందనలు తెలియజేశారు. మీ ఆవేదనను, కష్టాలను ప్రభుత్వం దృష్టికి తీసుకొస్తున్నారు. ఉత్తరాంధ్ర, రాయలసీమకు కూడా ఇరిగేషన్ సదుపాయం కల్పించాలంటే పోలవరం అవసరం. అందుకే ప్రజలు బయటికి రాకపోయినా వ్యాదయాంతరాల్లో నిర్వాసితులకు మద్దతిస్తున్నారు.



వడ్డే శోభనాద్రీశ్వరరావ

మీకు వ్యతిరేకం చేస్తే ప్రభుత్వానికి బుద్ధి చెపుతారు. అమాయకులులే ఏం చేసినా ఊరుకుంటారనుకుంటే పొరపాటు. జార్ఖండ్‌లో మోడీ సర్కారు అదానీకి వేల ఎకరాలు కట్టబెట్టచూస్తే రైతులు ఎదురుతిరిగారు. చివరికి ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పారు. నిర్వాసితుల సమస్య ఆషామాషీగా తీసుకుంటే ఇక్కడా అటువంటి గుణపాఠం తప్పదు. ధర్నాలో ఇంకా ఇతర వామపక్ష పార్టీల నాయకులు, సంఘాల నేతలు ప్రసంగించారు. తొలుత ఆహ్వానితులను సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు స్వాగతం పలికారు.

యాజమాన్య నిర్లక్ష్యం వల్లే సాహితీ ఫార్మాలో ప్రమాదం

- లోపించిన పిసిబి, పరిశ్రమల తనిఖీ అధికారుల పర్యవేక్షణ
- మృతుల కుటుంబాలకు రూ.50 లక్షలు చెల్లించాలి
- 'ప్రజల కోసం శాస్త్రవేత్తల బృందం' డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం డి నోటిఫై ప్రాంతంలోని సాహితీ ఫార్మాలో జూన్ 30న జరిగిన ప్రమాదానికి యాజమాన్య నిర్లక్ష్యం, కాలుష్య నియంత్రణ మండలి, పరిశ్రమల తనిఖీ అధికారుల పర్యవేక్షణలేమి కారణమని 'ప్రజల కోసం శాస్త్రవేత్తల బృందం' పేర్కొంది. 2020 జులై 13న సాల్వెంట్ పరిశ్రమలో జరిగిన ప్రమాదం, జూన్ 30న జరిగిన ప్రమాదానికీ తేడాలేదని తెలిపింది. ఈ మేరకు మంగళవారం శాస్త్రవేత్తల బృందం ప్రతినిధులు డాక్టర్ కె.బాబూరావు, డాక్టర్ కె.వెంకటరెడ్డి, డాక్టర్ సివిఎస్ మూర్తి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

"2020లో విశాఖ సాల్వెంట్‌లో జరిగిన ప్రమాదం తరువాత తనిఖీలు నిర్వహించి లోపాలు సరిదిద్దగలిగి ఉంటే సాహితీ ఫార్మాలో మరో ప్రమాదం జరిగి ఉండేదికాదు. యాజమాన్యం, అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతోనే సాహితీలో ప్రమాదం జరిగింది. పరిశ్రమలో సాల్వెంట్ నిల్వకు అనుమతి ఎవరిచ్చారు? అనుమతులివ్వకుండా భారీ పరిమాణంలో నిల్వ ఉంచిన యాజమాన్యంపై ఎందుకు చట్టపరమైన చర్యలు తీసుకోలేదు? కాలుష్యనియంత్రణ మండలి, పరిశ్రమల తనిఖీ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగింది. కంపెనీలను రక్షించే ప్రయత్నంలో వాస్తవాలు దాస్తున్నారు. పరిశ్రమల ప్రమాద వివరాలను బహిర్గతం చేయాలి. ప్రమాదంపై విచారణ పూర్తి చేసి మీడియాకు వెల్లడించాలి. పరిశ్రమలు అంతర్జాతీయ నియమాలు పాటించాలి. అమలు చేసేలా ప్రభుత్వం బాధ్యత వహించాలి. మంటలు రావడానికి కారణమేంటి? విద్యుత్ వల్ల మంటలు వ్యాపించాయనడంలో నిజంలేదు. ఫ్లేమ్ ప్రూఫ్ వైరింగ్ ఉంటే మంటలు రావు. ఈ వైరింగ్ లేకుండా ఉత్పత్తికి అనుమతులెలా ఇచ్చారు? ఫ్లేమ్ ప్రూఫ్ వైరింగ్ ఎన్ఒసి ఉందా? లేదా? అని పరిశీలించాలి' అని పేర్కొన్నారు. యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా జరిగిన ఈ ప్రమాదంలో చనిపోయిన కార్మిక కుటుంబాలకు రూ.50 లక్షలు చొప్పున చెల్లించాలని డిమాండ్ చేశారు.

దొంగ నోట్ల చలామణి ముఠాలు అరెస్ట్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

దొంగనోట్లను చలామణి చేస్తున్న రెండు ముఠాలను మంగళవారం కర్నూలు పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.తొమ్మిది వేల ఒరిజినల్ నోట్లు, రూ.1.8 కోట్ల దొంగ కరెన్సీ, మూడు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల మేరకు.. రెండో గ్రూపు రూ.30,000 ఒరిజనల్ నోట్లు ఇచ్చేలా...మొదటి గ్రూపు రూ.90 లక్షలు ఫేక్ కరెన్సీ ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నాయి. కర్నూలు మండలం పసుపుల గ్రామ పరిధిలోని పుల్లయ్య ఇంజనీరింగ్ కళాశాలకు సమీపంలో ఓ ప్రయివేటు వెంచర్‌లో డబ్బులు మార్చుకుంటుండగా పోలీసులు పట్టుకున్నారు. మొదటి గ్రూపులో కర్నూలు జిల్లా ఆలూరు ఎస్‌సి కాలనీకి చెందిన కరిడికొండ గంగాధర్, కర్నూలు నగరం ధర్మపేటకు చెందిన ఆరే కళ్ళు కుమార్, కృష్ణగిరి మండలానికి చెందిన ఈడిగ జయన్న, కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన బోయ బంగి పరశురాముడు, రెండో గ్రూపులో తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం క్యాతూరుకు చెందిన జనంపల్లి చంద్రశేఖర్ రెడ్డి, బింగు పోగు చిన్ననాగన్న, చాకలి బ్రహ్మ, కర్నూలు జిల్లా కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన కమ్మరి వీరేశ్ ఆచారి ఉన్నారు. వీరిని పోలీసులు అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

అమరావతిలో అల్లూరి మెమోరియల్

- భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు
- టిడిపి అధినేత చంద్రబాబు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అమరావతిలో అల్లూరి మెమోరియల్ ఏర్పాటు చేస్తామని, భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెడతామని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడ ఎ కన్వెన్షన్‌లో మంగళవారం అల్లూరి సీతారామరాజు 125వ జయంత్యుత్సవాల ముగింపు వేడుకల్లో చంద్రబాబు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వందేళ్ల క్రితం 27 ఏళ్ల వయసులో చనిపోయిన వ్యక్తి అల్లూరి అని, అలాంటి వ్యక్తిని ఇప్పటికీ సమాజం గుర్తుపెట్టుకుందంటే అది అతని గొప్పతనమని అన్నారు. చిన్న వయసులోనే ప్రజల కోసం పోరాటం చేయాలనే ఆలోచన చేసిన వ్యక్తి అల్లూరి సీతారామరాజు అని, నాటి మద్రాసు ప్రభుత్వం మన్యంలో అమలు చేసే చట్టాలు, గిరిజన ప్రాంతాల్లో అఘాయిత్యాలు చూసిన తర్వాత ప్రజలకు అండగా నిలబడాలని అల్లూరి ముందడుగు వేశారన్నారు. గాంధీ అహింసతో స్వాతంత్ర్య ఉద్యమం చేస్తే అల్లూరి, భగత్‌సింగ్, నేతాజీ సాయుధ పోరాటం ద్వారా ఉద్యమాలు చేశారని చంద్రబాబు పేర్కొన్నారు. అల్లూరి జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని 2014లో జిఒ ఇచ్చామని, బాలయోగి స్పీకరుగా ఉన్న సమయంలో ఎన్‌టిఆర్, అల్లూరి విగ్రహాలు పార్లమెంటులో ఉండాలని నాడు లేఖ రాశామని, ఎర్రన్నాయుడు హౌస్ కమిటీలో ఉండి ఆమోదం తెచ్చారన్నారు. రాష్ట్రంలో అల్లూరి కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించలేదన్నారు.

గత నెల 3నే అవినాష్ రెడ్డి అరెస్ట్, విడుదల

లోక్‌సభ సచివాలయం వెల్లడి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

వైఎస్ వివేకానంద హత్య కేసులో కడప ఎంపి వైఎస్ అవినాష్ రెడ్డి అరెస్ట్‌పై లోక్‌సభ సచివాలయం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు మంగళవారం లోక్‌సభ సచివాలయం బులెటిన్ విడుదల చేసింది. అవినాష్ అరెస్ట్ నిజమేనని ఇటీవలే సచివాలయానికి రాసిన లేఖలో సిబిఐ ధ్రువీకరించింది. దీంతో అధికారికంగా ప్రకటన వచ్చేసింది. అరెస్ట్‌కు సంబంధించిన సమాచారం సోమవారం నాడు అందినట్లు సచివాలయం బులెటిన్‌లో పేర్కొంది. అవినాష్‌ను జూన్-03న అరెస్ట్ చేసి వెంటనే విడుదల చేసినట్లు సిబిఐ లేఖలో పేర్కొందని బులెటిన్‌లో లోక్‌సభ సచివాలయం పేర్కొంది. క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ 1973లోని సెక్షన్లు 36, 41 కింద 3 జూన్ 2023న 12:15 గంటలకు కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్ రెడ్డిని అధికారికంగా అరెస్టు చేసినట్లు సిబిఐ తెలిపిందని లోక్‌సభ సచివాలయం తెలిపింది. అంతకుముందు తెలంగాణ హైకోర్టు 31 మే 2023 నాటి ఉత్తర్వుల ప్రకారం ముందస్తు బెయిల్ మంజూరు చేసిందని, అరెస్టు చేసినట్లయితే, రూ.5 లక్షల బాండు, వ్యక్తిగత పూచీకత్తుతో బెయిల్‌పై విడుదల చేయాలని ఆదేశించిందని సిబిఐ తెలిపినట్లు పేర్కొంది. తదనుగుణంగా 03 జూన్ 2023న అరెస్టు చేసిన తరువాత, హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా అవినాష్ రెడ్డి వెంటనే అదే రోజు బెయిల్‌పై విడుదలయ్యారని సిబిఐ పేర్కొందని లోక్‌సభ సచివాలయం బులెటిన్ లో పేర్కొంది.

సహకార రంగాన్ని దెబ్బతీస్తున్నారు : పాడిరైతుల సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సహకార రంగాన్ని దెబ్బతీయడంలో భాగంగానే చిత్తూరు డెయిరీని అమూల్‌కు ముఖ్యమంత్రి ధారాదత్తం చేశారని ఆంధ్రప్రదేశ్ పాడి రైతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కె అజయ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. నేటికి రూ.1000 కోట్ల ఆస్తులు కలిగిన డెయిరీని గుజరాత్ కంపెనీకి కేవలం కోటి రూపాయలకు 99 సంవత్సరాలకు లీజుకు ఇవ్వడం సరికాదని అన్నారు. ఇప్పటికీ 90 వేల లీటర్ల నుంచి మూడు లక్షల లీటర్ల వరకూ పాల సేకరణతోపాటు నెయ్యి తయారీలో రాష్ట్రం దేశంలో రెండోస్థానంలో ఉందని అన్నారు. భారత సైన్యానికి, ఇతర రాష్ట్రాలకు 500 టన్నుల పాలపొడి సరఫరా, హైదరాబాద్ ప్రజలకు పాలు అందిస్తోందని పేర్కొన్నారు. ఢిల్లీ, కోల్‌కతా నగరాలకు పెరుగు ఇస్తోందని వివరించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డెయిరీ మూతపడిందని తెలిపారు. సహకార రంగాన్ని ఆదుకుంటానని అధికారంలోకి వచ్చిన సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు క్రమంగా దెబ్బతీస్తున్నారని పేర్కొన్నారు. అమూల్‌కు రూ.3000 కోట్లు రుణాన్ని ఇప్పించడంతోపాటు రూ.500 కోట్లు వడ్డీ ప్రభుత్వమే చెల్లించేందుకు సిద్ధపడటం అంటే పాడి రైతులను మోసం చేయడమేనని విమర్శించారు. గుంటూరు సంఘం డెయిరీని కంపెనీ యాక్టు రద్దు చేసి, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరపాలని కోరారు. మిగిలిన డెయిరీలను తెరిపించి సహకార రంగాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం సహకార రంగంలో ఉన్న రూ.18.5 లక్షల కోట్ల విలువైన ఆస్తులపై కన్నేసి వాటిని స్వాధీనం చేసుకునే దిశగా వెళుతోందని విమర్శించారు. దీనిపై రైతులు ఉద్యమించి ప్రభుత్వాలకు తగిన బుద్ధిచెప్పాలని కోరారు.

రేపు ఆర్థిక కార్యదర్శుల భేటీ

- ఆరు కీలక అంశాలపై చర్చ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రాల ఆర్థికశాఖ కార్యదర్శుల భేటీ గురువారం జరగనుంది. ముంబయిలోని ఒక హోటల్‌లో ఈ భేటీ నిర్వహించనున్నారు. రిజర్వ్‌బ్యాంకు ఆధ్వర్యాన జరిగే ఈ భేటీలో ఆరు అంశాలపై కీలకంగా చర్చించనున్నారు. కన్సాలిడేటెట్ సింకింగ్ ఫండ్, గ్యారంటీ రిడెంప్షన్ ఫండ్‌లపై వర్కింగ్ కమిటీ ఇచ్చిన సిఫార్సులపై చర్చించనున్నారు. అలాగే వేస్ అండ్ మీన్స్, ఓవర్‌డ్రాఫ్ట్ విధానాలు, గతేడాది జులైలో నిర్వహించిన కార్యదర్శుల భేటీలో తీసుకున్న నిర్ణయాలపైనా, కిసాన్ క్రెడిట్ కార్డులపై, రాష్ట్ర ప్రభుత్వాల రుణ నిర్వహణ, చెల్లింపు సామర్థ్యం, గ్యారంటీలపై వర్కింగ్ కమిటీ చేసిన సిఫార్సులు, బహిరంగ మార్కెట్ రుణాల పరిస్థితిపై ఈ భేటీలో చర్చించనున్నారు.

'ఉక్కు' పోరాటాన్ని ప్రభుత్వాలు ఆపలేవు

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి-ఉక్కునగరం, విశాఖ



కేంద్ర ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా పోరాటాన్ని ఆపలేదని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ స్పష్టం చేసింది. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యాన కూర్మన్నపాలెంలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చ్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 873వ రోజుకు చేరాయి. దీక్షలో స్టీల్‌ప్లాంట్ టిపిపి, ఆర్ఇడి, పిఇఎం, స్టోర్స్ ఎస్ఎండి విభాగాల కార్మికులు కూర్చున్నారు. దీక్షలనుద్దేశించి పోరాట కమిటీ నాయకులు ఆదినారాయణ, జె.రామకృష్ణ మాట్లాడుతూ.. విశాఖ ఉక్కుపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలు మారకపోతే ఈ పోరాటం మరింత ఉధృతం అవుతుందని స్పష్టం చేశారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు ఇవ్వకుండా, కార్మికులకు వేతనాలు పెంచకుండా, సామర్థ్యానికి తగ్గ ఉత్పత్తిని తీయకుండా రకరకాల ఇబ్బందులకు గురిచేసి ప్లాంట్‌ను నిర్వీర్యం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ప్రాంతీయ పార్టీలు సైతం తమ వైఖరి మార్చుకోవాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు చిత్తశుద్ధితో కృషి చేయాలని కోరారు.

28 నుంచి ఐద్వా జీపు జాతాలు

- హిందూపురం, ఉత్తరాంధ్ర నుంచి ప్రారంభం : రమాదేవి

ప్రజాశక్తి-నెల్లూరు

మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఐద్వా వ్యవస్థాపకులు సూర్యావతి స్ఫూర్తితో ఈ నెల 28 నుంచి ఆగస్టు 9వ వరకు జీపు జాతాలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి రమాదేవి తెలిపారు. 28న హిందూపురం నుంచి ఒకటి, ఉత్తరాంధ్ర నుంచి మరొక జాతా ప్రారంభమవుతుందని, ఈ రెండు జాతాలు తొమ్మిదిన విజయవాడకు చేరుకుంటాయన్నారు. నెల్లూరులోని డాక్టర్ రామచంద్రారెడ్డి భవన్‌లో సూర్యావతి 30వ వర్ధంతి సభను మంగళవారం నిర్వహించారు. ముందుగా సూర్యావతి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రమాదేవి మీడియాతో మాట్లాడుతూ.. ఏ స్వాతంత్ర్యం కోసం పోరాటాలు చేశారో అటువంటి స్వేచ్ఛ, స్వాతంత్ర్యం స్త్రీలకు రాలేదని తెలిపారు. మూఢాచారాలు, కాలం చెల్లిన సంప్రదాయాలను అమలు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోందన్నారు. సతీసహగమనం అనేది పుణ్యకార్యమని, ఒక పవిత్రమైనటువంటిదని ఇటీవల పార్లమెంట్‌లో ఓ బిజెపి ఎంపి మాట్లాడటం శోచనీయమన్నారు. అటువంటి వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. లైంగిక వేధింపులు ఎదురవుతున్నాయని, న్యాయం చేయాలని రెజ్లర్లు రోడ్కెకాల్సి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు టి.శివకుమారి మహిళలు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు సిద్ధమా?

- మాజీ మంత్రి అనిల్‌కుమార్‌కు లోకేష్ సవాల్

ప్రజాశక్తి-నెల్లూరు ప్రతినిధి



నెల్లూరు విఆర్‌సి సెంటర్‌లో మాట్లాడుతున్న లోకేష్

నెల్లూరులో అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అంటూ టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్‌కు సవాల్ విసిరారు. లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర మంగళవారం నెల్లూరు నగరానికి చేరుకుంది. స్థానిక విఆర్‌సి సెంటర్‌లో జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. అనిల్‌కుమార్ అవినీతి, అరాచకాలకు పాల్పడ్డారని విమర్శించారు. వ్యాపారులను, ఆస్పత్రుల యజమానులను, జ్యూవెలరీ షాపుల వారిని బెదిరించి కోట్లు కొట్టేశాడని ఆరోపించారు. నాలుగేళ్ల పాలనలో నెల్లూరులో అభివృద్ధి శూన్యమని అన్నారు. రాష్ట్రంలో వైసిపి నేతలకు దోచుకోవడమే తప్ప.. ప్రజల సమస్యలపై శ్రద్ధలేదని విమర్శించారు. టిడిపి అధికారంలోకి వచ్చాక నెల్లూరును అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్రలో టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, నెల్లూరు నగర ఇన్‌ఛార్జ్ పి.నారాయణ, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పాశం సునీల్‌కుమార్, పరసా రత్నం, కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

ధరలను నియంత్రించాలని ధర్నా

ప్రజాశక్తి-నెల్లూరు

పెరిగిన కూరగాయలు, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో నెల్లూరులో మంగళవారం ధర్నా జరిగింది. తొలుత నెల్లూరు బాలాజీ నగర్‌లోని సిపిఎం కార్యాలయం నుంచి మినీ బైపాస్ జ్యోతిరావు పూలే విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ మాట్లాడుతూ కూరగాయలు, నిత్యావసర వస్తువల ధరలు ఆకాశాన్నంటుతున్నాయని తెలిపారు. టమోటా కిలో రూ.120, వంకాయలు రూ.90, పచ్చిమిర్చి రూ.150లకు పెరిగాయన్నారు. దీంతో, కొని, తినలేని పరిస్థితుల్లో సామాన్య ప్రజలు ఉన్నారని తెలిపారు. పెరిగిన ధరలను అదుపు చేయాలని, కూరగాయలను రైతు బజార్ల ద్వారా, నిత్యావసర సరుకులను రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు జి.నాగేశ్వరరావు, పి సూర్యనారాయణ, ఐద్వా జిల్లా కార్యదర్శి షేక్ మస్తాన్‌బీ, నగర అధ్యక్ష కార్యదర్శులు ఎన్‌వి సుబ్బమ్మ, కత్తి పద్మ, పాల్గొన్నారు.

మూతబడిన చిత్తూరు డెయిరీకి అమూల్‌తో జీవం

(మొదటి పేజీ తరువాయి)

నమ్ముకున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సిఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కె రోజా, వి.రజని, అప్పలరాజు, ఎంపి రెడ్డెప్ప, జడ్‌పి చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, కలెక్టర్ సగిలి షణ్మోహన్ పాల్గొన్నారు.

వామపక్ష నేతల అరెస్ట్

సిఎం పర్యటన ముందు రోజు సోమవారం నుండే సిపిఎం జిల్లా కార్యదర్శి వి.గంగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజులను పోలీసులు గృహనిర్బంధం చేశారు. పోలీసుల కళ్లుగప్పి వీరు గాంధీ విగ్రహం వద్దకు చేరుకొని నిరసన తెలిపేందుకు మంగళవారం ఉదయం ప్రయత్నించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిఎం పర్యటన అనంతరం వారిని విడుదల చేశారు

అధికార పార్టీ నేతల వేధింపులు!

- పోలీస్‌స్టేషన్ ఎదుట మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-అద్దంకి (బాపట్ల జిల్లా)

అధికార పార్టీ నాయకుల వేధింపులు, పోలీసుల నిర్బంధం భరించలేక ఓ మహిళ పోలీస్‌స్టేషన్ ఎదుటే ఆత్మహత్యకు యత్నించిన ఘటన బాపట్ల జిల్లా అద్దంకిలో మంగళవారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం ప్రకారం.. అద్దంకి మండలం చక్రాయపాలెం గ్రామానికి చెందిన వెంకాయమ్మ కుటుంబం తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులుగా ఉంది. రహదారి విస్తరణ పేరుతో గ్రామానికి చెందిన స్థానిక వైసిపి నేతలు గతంలోనే వెంకాయమ్మ కుటుంబానికి చెందిన ఇంటి ముందు భాగాన్ని తొలగించారు. మొత్తం స్థలంపై కన్నేసిన వైసిపి నేతలు పోలీసులు, రెవెన్యూ అధికారుల ద్వారా సదరు స్థలం ఖాళీ చేయించే ప్రయత్నాలు చేశారు. ఈ విషయమై వెంకాయమ్మ కుటుంబంపై స్థానిక నేతలు దౌర్జన్యం చేయడంతో వారు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి వెంకాయమ్మ కుటుంబసభ్యులు న్యాయం కోసం రెవెన్యూ అధికారులు, పోలీసుస్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారు. వెంకాయమ్మ కుటుంబసభ్యులందరినీ మంగళవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి ఉదయం నుంచి సాయంత్రం వరకు అక్కడే నిర్బంధించారు. వీరు స్టేషన్‌లో ఉన్న సమయంలో వెంకాయమ్మ ఇంటిని, గేదెలపాక, గడ్డివాములను ప్రొక్లయినర్‌తో తొలగించారు. స్థలాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న వెంకాయమ్మ మనస్తాపంతో పోలీస్‌స్టేషన్ ఎదుటే పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. అధికార పార్టీ నాయకులు, పోలీసులు వేధింపులు తట్టుకోలేకే తన తల్లి పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించినట్లు ఆమె కుమార్తె తెలిపారు. బాధితురాలి పరిస్థితి విషమంగా ఉండటంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

సాంకేతికతతో ముందడుగు

- ప్రధాని నరేంద్ర మోడీ
- పుట్టపర్తిలో వర్చువల్ విధానం ద్వారా సాయి హీరా గ్లోబల్ కన్వెన్షన్ సెంటర్ ప్రారంభం
- హాజరైన రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శాస్త్ర సాంకేతికను వినియోగించుకుని మరింత ముందుకు వెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోడీ కోరారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో నెలకొల్పిన సాయి గ్లోబల్ కన్వెన్షన్ కేంద్రాన్ని వర్చువల్ విధానంలో మంగళవారం ఆయన ప్రారంభించారు. ప్రశాంతి నిలయంలో 1500 మంది కూర్చునే విధంగా అత్యాధునిక వసతులతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా సత్యసాయి నిలయం నుంచి పాల్గొన్నారు. ఈయనతో పాటు సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్, సత్యసాయి యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ చక్రవర్తి, ట్రస్టు సభ్యులు నాగానంద్, జాతీయ సత్యసాయి సేవాదళ్ అధ్యక్షులు నిమిష్ పాండే తదితరులు హాజరయ్యారు. ప్రారంభోత్సవం అనంతరం ప్రధాని మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. గతంలో గుజరాత్ రాష్ట్రంలో భూకంపం వచ్చినప్పుడు సత్యసాయిబాబా అందించిన సేవలు తనకు ఎంతో స్ఫూర్తిని కలిగించా యన్నారు. విద్యార్థులకు పౌష్టిక ఆహారాన్ని అందించడంలో భాగంగా సత్యసాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లో రాగిజావా అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో ఈ పథకాన్ని మరిన్ని రాష్ట్రాల్లో అమలు చేయాలని ఆశిస్తున్నామన్నారు. సత్యసాయి పేరిట ఏర్పడిన నూతన పుట్టపర్తి జిల్లాను డిజిటలైజేషన్ చేసేందుకు తగిన సాంకేతిక సేవలు అందించడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. పర్యావరణ పరిరక్షణకు జపాన్‌లో చిన్నచిన్న అడవులను సృష్టిస్తున్నారని ఇలాంటి అడవులను హీరా, సత్యసాయి ట్రస్ట్ సంయుక్తంగా సృష్టించాలని కోరారు. త్వరలోనే పుట్టపర్తికి వచ్చి బాబా సమాధిని దర్శించుకుంటానని తెలిపారు. ప్రశాంతి నిలయంలోని సత్యసాయి మహాసమాధిని గవర్నర్ సందర్శించారు. అంతకుముందు గవర్నర్‌కు కలెక్టర్ అరుణ్‌బాబు స్వాగతం పలికారు.



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రసంగిస్తున్న ప్రధాని

విలేకరులకు నో ఎంట్రీ

ఈ కార్యక్రమానికి స్థానిక మీడియాకు అనుమతి నిరాకరించారు. కార్యక్రమం కవరేజ్‌కు వెళ్లిన విలేకరులను లోపలికి అనుమతించలేదు. సత్యసాయి ట్రస్టు తీసుకున్న నిర్ణయంపై పలువురు పాత్రికేయులు అసహనం వ్యక్తం చేశారు.

ప్రజలను ముంచేసి బంగారం పండిస్తామంటే ఊరుకోం

'పోలవరం పోరుకేక మహా పాదయాత్ర' ముగింపు సభలో నేతలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో



నిర్వాసితులను ముంచేసి ఆ నీటితో వ్యవసాయం చేసి బంగారం పండిస్తామంటే ఊరుకునేది లేదని, వారి జీవితాల్లో వెలుగులు ఆర్పేసి తయారుచేసే విద్యుత్‌తో మన ఇళ్లలో దీపాలు తెచ్చుకోవడం సరికాదని ప్రత్యేక హోదా సాధన సమితి నాయకులు చలసాని శ్రీనివాసరావు అన్నారు. విజయవాడ ధర్నా చౌక్‌లో మంగళవారం జరిగిన పోలవరం పోరుకేక పాదయాత్ర ముగింపు సభలో ఆయన ప్రసంగించారు. రోజుకు 40 లక్షలు ఖర్చుపెట్టి ఉదయం సాయంత్రం నాలుగు గంటలు తిరిగే యాత్రలు చూస్తున్నానని, కానీ నిజాయతీ, నిబద్ధతతో నిర్వాసితుల కోసం అనుక్షణం తపిస్తూ సాగిన యాత్ర ఇదేనని, యాత్రలో పాల్గొన్న వారందరికీ పాదాభినందనాలు చేస్తున్నానని తెలిపారు. అడవి తల్లిని నమ్ముకున్న వారిని రోడ్డున పడేస్తే ఊరుకునేది లేదని అన్నారు. నిర్వాసితుల పోరాటంలో న్యాయం ఉందని, అదే సమయంలో పోలవరం కట్టాలని పునరావాస ప్యాకేజీలు పూర్తిచేసి హామీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. పునరావాస కాలనీలు కూడా ముంపునకు గురయ్యే దౌర్భాగ్య పరిస్థితి పోలవరం ప్రాంతంలో సృష్టించారని పేర్కొన్నారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై పౌర సమాజం మొత్తం వచ్చి పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం తెలుగు ప్రజలపై పగ తీర్చుకున్నట్లు ఉందని అన్నారు. దీనిపై పార్లమెంటు ముందు ధర్నా చేసినా కేంద్రంలో చలనం లేదని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో బిజెపికి బానిసలుగా ఉండేవారిని రాష్ట్రంలో ఓడించాలన్నారు. లేకపోతే భవిష్యత్తు లేదన్నారు.

రాజకీయ పిలుపునకు శ్రీకారం చుట్టడం మంచి పరిణామం : ఎన్ మూర్తి



అల్లూరి సీతారామరాజు 125వ జయంతి సందర్భంగా పోలవరం పాదయాత్ర 400 కిలోమీటర్ల ముగింపు సభ రాజకీయ పిలుపునకు శ్రీకారం చుట్టడం మంచి పరిణామమని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి ఎన్ మూర్తి అన్నారు. పోలవరంపై పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోందని, చంద్రబాబు అధికారంలో ఉండగా పోలవరాన్ని సందర్శించాలంటూ బస్సులు వేసి నడిపించారని, అదొక విహార కేంద్రంగా మార్చారని, నేడు జగన్ హయాంలో పోలవరం భవిష్యత్ ఏమిటనే విషయాన్ని చూస్తున్నామన్నారు. నిర్వాసితులను నీట ముంచి పునరావాసాన్ని ఆలోచించకుండా మోడీ, జగన్ ప్రభుత్వాలు పక్కన పెట్టాయన్నారు.

గిరిజనులు ఏం పాపం చేశారు

● కె రామకృష్ణ



గిరిజన ప్రజలు ఏం పాపం చేశారని వరదల్లో ముంచారో చెప్పాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. ప్రాజెక్టు కడితే ఎవరు మునిగిపోతారో తెలుసని, అయినా ఎందుకు పట్టించుకోవడం లేదో తెలపాలని అన్నారు. చిన్నచిన్న విమర్శలకే పెద్దఎత్తున స్పందించే వైసిపి నాయకులు ఇంత పెద్దఎత్తున పాదయాత్ర చేస్తున్నా ఎందుకు స్పందించడం లేదని అన్నారు. పోలవరం ముంపుపై జగన్మోహన్‌రెడ్డి ఒక్క మాట కూడా మాట్లాడడని, ఢిల్లీ వెళితే అవినాష్‌రెడ్డి కేసుకోసం తప్ప మరొకదాని కోసం కాదని తెలిపారు. అక్కడకు వెళ్లి మోడీ కాళ్లపై పడటం తప్ప నిలదీసింది లేదు, నిగ్గదీసింది లేదని అన్నారు. పోలవరం ప్రాజెక్టు దెబ్బతిందంటే దానికి వైసిపి ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు.

గిరిజనులకు అన్యాయం : కె పోలారి



గిరిజనులకు న్యాయం చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని, నిర్వాసితులకు 20 శాతం కూడా ఖర్చు పెట్టడం లేదని సిపిఐ (ఎంఎల్) న్యూ డెమొక్రసీ నాయకులు కె పోలారి పేర్కొన్నారు. గిరిజనుల మధ్య చిచ్చు పెట్టేలా బిజెపి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. నిర్వాసితులను ముంపులో వదిలేయడం సరికాదన్నారు. వారికి పునరావాసం కల్పించిన అనంతరమే ప్రాజెక్టు పనులు చేపట్టాలని తెలిపారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలవి సంకుచిత రాజకీయాలు : బిఎస్ అమర్‌నాథ్

నిర్వాసితుల హక్కులు, డిమాండ్లను నెరవేర్చేందుకు సిపిఎం చేపట్టిన పాదయాత్రకు తాము సంపూర్ణ మద్దతునిస్తున్నట్లు ఎస్‌యుసిఐ(సి) నాయకులు బిఎస్ అమర్‌నాథ్ వెల్లడించారు. ప్రభుత్వాలు సంకుచిత రాజకీయాలు చేస్తున్నాయే తప్ప, నిర్వాసితులను నిర్లక్ష్యానికి గురిచేయడాన్ని తాము తప్పుపడు తున్నామన్నారు. టిడిపి, వైసిపి, జనసేన పార్టీలు కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోడీ వద్ద సాగిలం పడుతుండటం వల్లే ఈ సమస్య వచ్చిందన్నారు.



నిర్వాసితుల సమస్యలను మండలిలో ప్రస్తావిస్తాం : కెఎస్ లక్ష్మణరావు




పోలవరం నిర్వాసితుల సమస్యలను ఈ నెలలో జరగనున్న శాసన మండలి సమావేశాల్లో తప్పకుండా ప్రస్తావిస్తామని, వారికి న్యాయం జరిగే వరకు తమ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణ రావు పేర్కొన్నారు. విభజన చట్టంలో పోలవరం జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించారని, నిర్మాణంతో సహా పునరావాసం, పర్యావరణ అనుమతులు బాధ్యత కేంద్రాని దేనన్నారు. పునరావాసం తమకు సంబంధం లేదని మోడీ ప్రభుత్వం చేతులు దులుపు కుంటోందని, మొదటి ముద్దాయి మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వమేనన్నారు. టిడిపి, వైసిపి పోలవరం విషయంలో ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. పునరావాసం పూర్తి చేయకుండా ప్రాజెక్టు ఎలా పూర్తవుతుందన్నారు. 1.05 లక్షల కుటుంబాలు, 373 గ్రామాలు, మూడు లక్షల మంది ప్రజలు ముంపునకు గురవుతారన్నారు. ప్రాజెక్టు వ్యయం రూ.55 వేలకోట్లు అని అంచనా వేయగా, అందులో పునరావాసం కింద రూ.33 వేలకోట్లు అని పేర్కొన్నారు. ఇప్పటికీ ఖర్చు చేసింది కేవలం రూ.7 వేలకోట్లు మాత్రమేనన్నారు. గిరిజనులకు జరుగుతున్న అన్యాయంపై పౌర సమాజం ముందుకు రావాలన్నారు.

ఈ ప్రభుత్వాన్ని నిర్వాసితులు గోదాట్లో ముంచుతారు : ఎ. రవి

పోలవరం ముంపు బాధితులను ఇబ్బందులు, కష్టాలు పెట్టే ప్రభుత్వాన్ని గోదాట్లో ముంచుతారని నిర్వాసితుల నాయకులు ఎ. రవి హెచ్చరించారు. పాదయాత్రకు అన్ని పార్టీల నాయకులూ మద్దతు తెలిపారని అన్నారు. పాదయాత్రకు వచ్చిన స్పందన చూసి వైసిపి నాయకులు దళితుడిని హత్య చేసిన నేరగాడు అనంతబాబు ఈ నెల 9న ముంపు ప్రాంతాల్లో నిర్వాసితుల సమస్యలపై మాట్లాడతారని ప్రచారం చేస్తున్నారని అన్నారు. వైసిపి నుంచి బహిష్కరించిన వ్యక్తితో పార్టీ తరఫున ఎలా మాట్లాడిస్తారని ప్రశ్నించారు. ముంపు ప్రాంతాల నియోజకవర్గాల నుండే వైసిపి పతనం ప్రారంభమవుతుందని హెచ్చరించారు.



పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు : మంతెన సీతారాం




పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన పోలవరం పోరుకేక పాదయాత్రకు ముంపు గ్రామాలతో పాటు మైదాన ప్రాంతంలో ప్రజలు బ్రహ్మరథం పట్టారని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పేర్కొన్నారు. పాదయాత్ర ద్వారా ప్రజల్లో పోలవరం పట్ల చైతన్యం తీసుకొచ్చే ప్రయత్నం చేశామన్నారు. వామపక్ష ఉద్యమంలో పోలవరం పోరుకేక పాదయాత్ర ఓ అధ్యాయమన్నారు. పాదయాత్రలో భాగంగా 26 నిర్వాసిత గ్రామాలను సందర్శించామన్నారు.

మృతిచెందితే పూడ్చే స్థలం కూడా లేకుండా చేశారు : మొడియం నాగమణి



పోలవరం నిర్వాసిత కాలనీలు దేనికీ పనికి రావని, వర్షం వస్తే ఇంట్లో ఉన్నా.. బయట ఉన్నా ఒకటేనని, గోదావరి వరదలో ఆ కాలనీలు మునిగిపోతున్నాయని గిరిజన మహిళా నాయకులు మొడియం నాగమణి అన్నారు. పునరావాస కాలనీల్లో మనిషి చనిపోతే పూడ్చేందుకు స్థలం కూడా లేని విధంగా కాలనీలు తయారు చేశారని, ఇంతకంటే అన్యాయం మరొకటి లేదని పేర్కొన్నారు. సర్వస్వం కోల్పోయిన బాధితులు న్యాయం కోసం ఏదైతే చిరునవ్వుతో పాదయాత్ర ప్రారంభించారో అదే చిరునవ్వుతో ముగించారని, ఇదే పోరాట స్ఫూర్తికి నిదర్శమని అన్నారు.



అల్లూరి సీతారామరాజు, దొడ్డి కొమరయ్య చిత్ర పటాలకు పూలదండలు వేసి నివాళులర్పిస్తున్న బివి రాఘవులు, వడ్డే శోభనాద్రీశ్వరరావు, చలసాని శ్రీనివాస్, కెఎస్ లక్ష్మణరావు, వి శ్రీనివాసరావు, కె రామకృష్ణ, వి వెంకటేశ్వర్లు, కాటం నాగభూషణం

మోడీకి జోడిగా ఉండే పార్టీలను గోదావరిలో ముంచుతాం : వి వెంకటేశ్వర్లు



పోలవరం నిర్వాసితుల పోరుకేక పాదయాత్ర ఈ రాష్ట్రంలో పూర్వ వైభవాన్ని ఎర్రజెండా తీసుకొస్తుందనే నమ్మకం తమకు కలిగిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. రాష్ట్ర కార్యదర్శి నుంచి వాలంటీర్ వరకు కటిక నేలపై పడుకున్నారని, అది ఉద్యమ స్ఫూర్తి అని అన్నారు. కొరుటూరు నిర్వాసితుల కాలనీలోని వెయ్యి కుటుంబాలకు చెందిన వారు ఒక్కో కుటుంబానికి రూ.100 వేసుకుని పాదయాత్రకు ఆహారం ఏర్పాటు చేశారన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో పాదయాత్ర చేస్తున్న వారి కాళ్లకు నీళ్లు పోసి స్వాగతించారన్నారు. 15 రోజుల్లో సమస్యను పరిష్కరించకపోతే భవిష్యత్‌లో పెద్దఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడతామన్నారు. కొందరు పాదయాత్ర సిఎం, పిఎం పదవుల కోసం చేస్తున్నారని అన్నారని, తాము పోలవరం నిర్వాసితులకు అండగా ఎర్రటి ఎండలో పాదయాత్ర చేశామని అన్నారు.

అమరావతి రైతు జెఎసి నాయకులు పువ్వాడ సుధాకర్ మాట్లాడుతూ నిర్వాసితులైన గిరిపుత్రులు నిర్వహించిన యాత్ర చరిత్రలో లిఖించదగినదని తెలిపారు. అమరావతికి మద్దతు కూడా ఇవ్వాలని కోరారు. ప్రొఫెషనల్ ఫోరం నాయకులు నేతి మహేశ్వరరావు మాట్లాడుతూ.. బడ్జెట్లో నిధుల కేటాయింపులు చూస్తుంటే ఈ ప్రాజెక్టు ఈ శతాబ్దంలో పూర్తవుతుందా లేదా అనే అనుమానం వ్యక్తమవుతోందని తెలిపారు. రాష్ట్రానికి అభివృద్ధి ముఖ్యమని, అది పేదలను పణంగా పెడితే మంచిది కాదని, కేంద్రం బిల్లులు ఇస్తే కాంట్రాక్టరుకు ఇస్తున్నారని, పేదలను పట్టించుకోవడం లేదని తెలిపారు. అందరికీ ఆమోదయోగ్యమైన అభివృద్ధి కావాలని దాన్ని కమ్యూనిస్టులు కోరుకుంటున్నారని వివరించారు. పేదల తరఫున నిలబడేది కూడా వారేనని, వారెవరూ అభివృద్ధికి వ్యతిరేకం కాదని, సమగ్రాభివృద్ధి కోసమే వారి పోరాటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు తరఫున పాదయాత్రకు సేకరించిన ఫండ్ రూ.5 లక్షల చెక్కును అందించారు. ఆశా వర్కర్లు రూ.25 వేలు, సివిల్ సప్లయి హమాలీలు రూ.20 వేలు, పంచాయతీ ఉద్యోగులు రూ.15 వేలు, రజక వృత్తిదారులు రూ.3 వేలు నాయకులకు అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై వెంకటేశ్వరరావు, బి తులసీదాస్, కె ప్రభాకరరెడ్డి, వి వెంకటేశ్వర్లు, వి ఉమామహేశ్వరరావు. కె సుబ్బరావమ్మ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు బి రవి వందన సమర్పణ చేశారు. అనంతరం పాదయాత్రలో చురుకుగా పాల్గొన్న వారికి మెమోంటోలు అందజేశారు. యాత్రకు నాయకత్వం వహించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావుకు వామపక్ష పార్టీల నాయకులు మెమోంటో ఇచ్చి అభినందనలు తెలిపారు.



పోలవరం పోరుకేక మహాపాదయాత్ర విజయవాడ చేరుకున్న అనంతరం గిరిజనులతో కలిసి ఆడిపాడుతున్న బివి రాఘవులు, శ్రీనివాసరావు తదితరులు

కదంతొక్కిన ఎర్రసైన్యం

ప్రజాశక్తి- కృష్ణా ప్రతినిధి, విజయవాడ

'పోలవరం నిర్వాసితుల పోరుకేక' రాష్ట్ర రాజధాని ప్రాంతం విజయవాడలో హోరెత్తింది. నగరంలో ఎర్ర సైన్యం కదం తొక్కింది. ఎర్ర చొక్కాలు, ఎర్ర చీరలు, ఎర్ర జెండాలు, మెడలో ఎరుపు, ఆకుపచ్చ కండువాలతో మంగళవారం సాగిన ప్రదర్శన ఆకట్టుకుంది. తలపై కొమ్ములు, చేతిలో డోలు వాయిద్యాలు, ఆదివాసీల తలపాగాలతో గిరిజన సంస్కృతి ఉట్టిపడేలా చేసిన నృత్యాలతో ముందుకు సాగింది. సోమవారం సాయంత్రం విజయవాడ సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్‌కు చేరుకున్న పోలవరం నిర్వాసితుల పోరుకేక మహా పాదయాత్ర 15వ రోజు మంగళవారం విజయవాడ ధర్నా చౌక్‌లో ముగిసింది. తొలుత పాదయాత్ర బృందంలోని 351 మందికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి.కృష్ణ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, సెంట్రల్ సిటీ కార్యదర్శి బి.రమణారావు కండువాలను కప్పి పాదయాత్రను ప్రారంభించారు. విజయవాడ నగరంతోపాటు ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాల నుండి సిపిఎం, సిఐటియు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున డాబాకొట్ల సెంటర్‌కు చేరుకుని ఈ యాత్రకు స్వాగతం పలికాయి. మెడలో ఎర్ర, పచ్చ కండువాలు ధరించి, చేతిలో పార్టీ జెండాలు చేబూని ఎంతో క్రమశిక్షణాయుతంగా సాగింది. యాత్ర అగ్రభాగాన యాత్ర రథసారథి వి.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వర్లు, మంతెన సీతారామ్, సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ, కార్యదర్శివర్గ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి తదితర నేతలు ఉన్నారు. నేతలను వందలాది మంది బృందం సభ్యులు, పార్టీ శ్రేణులు అనుసరించారు. పోలవరం వల్ల సర్వం కోల్పోతున్న గిరిజనుల బాధలు, పాలకుల విధానాలు తెలిపే పాటలతోపాటు ప్రజానాట్య మండలి కళాకారులు యాత్రకు ఊపునిచ్చేలా డిజె సౌండ్‌తో వివిధ రకాల పాటలను పాడుతూ ముందుకు సాగారు. ఎర్ర జెండా రెపరెపలతో యాత్ర సాగింది. ఈ యాత్ర డాబాకొట్లు సెంటరు, సింగ్‌నగర్ ఫ్లై ఓవర్, బుడమేరు వంతెన, ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్, సత్యనారాయణపురం భగత్‌సింగ్ రోడ్డు, ఫుడ్ జంక్షన్, ఘంటసాల సంగీత కళాశాల, దుర్గాపురం, సాంబమూర్తి రోడ్, డిమార్ట్ మీదుగా సభాస్థలి అయిన అలంకార్ సెంటరులోని ధర్నా చౌక్‌కు చేరింది. బుడమేరు వంతెన వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి వి.శ్రీనివాసరావు, ఎపి విభజన హామీల సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్ తదితర నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఫుడ్ జంక్షన్ సెంటర్లో రేలా రేలా అంటూ ఆదివాసీ గిరిజన మహిళలతో కలిసి సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఎంఎల్‌సి కె.ఎస్.లక్ష్మణరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు తలపై కొమ్ములు ధరించి చేసిన నృత్యాన్ని ప్రజలు ఆసక్తిగా తిలకించారు. నగరంలో మొత్తం 4.5 కిలోమీటర్లు సాగిన ఈ యాత్ర ఆద్యంతం ఎంతో ఉత్సాహంగా కదలింది. ఎక్కడికక్కడే ఘన స్వాగతం లభించింది. ఎక్కడా ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా దారి పొడవునా రోప్‌వే ద్వారా పాదయాత్ర సాగినంత దూరం పార్టీ నాయకులు, కార్యకర్తల జాగ్రత్తలు తీసుకున్నారు. ఇటీవల కాలంలో ఇటువంటి మహా పాదయాత్ర చూడలేదని నగర వాసులు వ్యాఖ్యానించడం కనిపించింది.

ఆద్యంతం ఆకట్టుకున్న నేతల ప్రసంగాలు

విజయవాడ నగరంలోని ధర్నా చౌక్‌లో మంగళవారం పోలవరం నిర్వాసితుల పోరు కేక మహాపాదయాత్ర ముగింపు సందర్భంగా భారీ బహిరంగ సభ జరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన సభ 3 మూడు గంటల వరకూ సాగింది. నేతల ప్రసంగాలు ఆద్యంతం అకట్టుకున్నాయి.

భారీగా తరలి వచ్చిన ప్రజానీకం

బహిరంగ సభకు ఎన్‌టిఆర్, కృష్ణా, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, గుంటూరు జిల్లాల నుంచి సిపిఎం, ప్రజా, కార్మిక, ఉద్యోగ, యువజన, విద్యార్థి, మహిళా సంఘాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు. గిరిజనులు తరలివచ్చారు. ద్విచక్ర వాహనాలు, మినీ వ్యాన్‌లు, లారీలు, ఆటోల్లో తరలి వచ్చిన వేలాది ప్రజలతో ధర్నా చౌక్ రోడ్డు కిక్కిరిసిపోయింది.

కొత్త ఫీచర్లతో కియా సెల్టోస్ వచ్చేసింది..

న్యూఢిల్లీ : కియా ఇండియా మార్కెట్లోకి సరికొత్త ఫీచర్లతో కియా సెల్టోస్‌ను విడుదల చేసింది. దీనికి జులై14 నుంచి బుకింగ్స్‌ను తెరుస్తున్నట్లు వెల్లడించింది. మంగళవారం నూతన సెల్టోస్‌ను కియా ఇండియా ఎండి, సిఇఒ టాక్ జిన్ పార్క్, చీఫ్ సేల్స్ అండ్ బిజినెస్ ఆఫీసర్ మ్యుంగ్ సిక్ సోన్ లాంచనంగా ఆవిష్కరించారు. ఎనిమిది రంగుల్లో దీన్ని విడుదల చేసింది. ఫేస్ లిఫ్ట్ న్యూ 1.5-లీటర్ల టర్బో పెట్రోల్ ఇంజిన్‌తో అందుబాటులోకి తెస్తోంది.



కెనడాలో మచిలీపట్నం విద్యార్థి మృతి

ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్

కెనడాలో చదువుకుంటున్న కృష్ణా జిల్లా మచిలీపట్నం నగరం చింతకుంటపాలేనికి చెందిన నాగ కుమార్ (23) ఈత కొలనులో సోమవారం మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు... పోలుకొండ శ్రీనివాస్ మొదటి కుమారుడు నాగ కుమార్ 2021లో లేక్ హెడ్ యూనివర్సిటీలో ఎంఎస్ చదువు నిమిత్తం కెనడా వెళ్లారు. తండ్రి శ్రీనివాస్ ట్రెజరీలో సాధారణ ఉద్యోగి. తల్లి మీనా కుమారీ ఇంటి వద్దే బ్యూటీ పార్లర్ నడుపుతున్నారు. నాగ కుమార్ స్నేహితులతో కలిసి కెనడాలో సిల్వర్ ఫాల్స్ ఈత కొలనకు వెళ్లాడు. ఈత కొట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కొలను లో మునిగి మృతి చెందారు. నాగ కుమార్ మతదేహాన్ని ఇండియాకు రప్పించేందుకు కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జయశంకర్‌తో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ నాన్ రెసిడెంట్ సొసైటీ (ఎపిఎన్‌టి) ప్రెసిడెంట్ వెంకట్ మేడపాటి ఇప్పటికే కెనడాలోని ప్రతినిధులతో ఇప్పటికే సంప్రదింపులు జరిపారు.



నాగ కుమార్

వ్యవసాయ కనెక్షన్‌కు లంచం

● రైతు వద్ద రూ.60 వేలు తీసుకుంటూ పట్టుబడ్డ జెఇ

ప్రజాశక్తి - వినుకొండ (పల్నాడు జిల్లా)

వ్యవసాయ విద్యుత్ కనెక్షన్, ట్రాన్స్‌ఫారం మంజూరు కోసం రూ.60 వేలు లంచం తీసుకుంటూ విద్యుత్ సబ్‌స్టేషన్ జూనియర్ ఇంజనీర్ (జెఇ) మంగళవారం ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. ఎసిబి అడిషనల్ ఎస్‌పి మహేంద్ర ముత్తె తెలిపిన వివరాల ప్రకారం... పల్నాడు జిల్లా వినుకొండ మండలం అందుగుల కొత్తపాలేనికి చెందిన రైతు అలిపి కోటేశ్వరరావు వ్యవసాయ విద్యుత్తు కనెక్షన్, ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం ఇటీవల దరఖాస్తు చేసుకున్నారు. వీటి మంజూరు కు రూ.90 వేలు లంచం ఇవ్వాలని జెఇ బాణావత్ రామాంజనేయులు నాయక్ డిమాండ్ చేశారు. అంత ఇవ్వలేనని రైతు ప్రాథేయపడడంతో రూ.5 వేలు తగ్గించి రూ.85 వేలు ఇవ్వాల్సిందేనని తెగేసి చెప్పారు. ఈ ఒత్తిడిని భరించలేని రైతు కోటేశ్వరరావు ఎసిబి అధికారులను ఆదేశించారు. ఈ క్రమంలో ఎసిబి బృందం రంగంలోకి దిగింది. రైతు నుండి 60 వేల రూపాయలను చీకటిగల పాలెం సబ్ స్టేషన్ వద్ద జెఇ తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. దాడుల్లో డిఎస్‌పిలు సత్యానందం, ప్రతాప్, సిఐలు మన్మథరావు, రవిబాబు, సురేష్, నాగరాజు, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనిల్ అంబానీకి స్విస్‌లో నిధులు..!

● పన్ను చెల్లింపుల్లో ఎగవేత
● ఫెమా నిబంధనల ఉల్లంఘన
● ఇడి అధికారుల విచారణ



ముంబయి : రిలయన్స్ ఎడిఎ గ్రూపు అధినేత అనిల్ అంబానీ అక్రమంగా స్విస్ బ్యాంక్‌ల్లో సొమ్ము దాచుకున్నట్లు ఆరోపణలు వస్తోన్నాయి. ఈ నేపథ్యంలోనే సోమవారం ఇడి అధికారుల ముందు అనిల్ అంబానీ హాజరు కాగా.. మంగళవారం ఆయన సతీమణి భార్య టీనా అంబానీని అధికారులు విచారించారు. విదేశీ మారకపు చట్టాల (ఫెమా) ఉల్లంఘన ఆరోపణలపై వారిని ప్రశ్నించినట్లు ఇడి అధికారులు తెలిపారు. స్విస్ బ్యాంక్ ఖాతాల్లో రూ.814 కోట్లు ఉండగా.. వాటికి రూ.420 కోట్లు పన్ను చెల్లించలేదంటూ 2021లో అదాయపు పన్ను అధికారులు నోటీసులు జారీ చేశారు. ఐటి అధికారులు జారీ చేసిన నోటీసులను సవాలు చేస్తూ అనిల్ అంబానీ బాంబే హైకోర్టును ఆశ్రయించగా.. అనిల్ అంబానీకి ఊరట కల్పిస్తూ ఎటువంటి బలవంతపు చర్య తీసుకోవద్దని ఆదాయపు పన్ను శాఖను ఆదేశించింది. తాజాగా, ఈ కేసులకు సంబంధించి అనిల్ అంబానీ, భార్య టీనా అంబానీలు ఇడి విచారణకు హాజరయ్యారు. ఇరువురిని వేరువేరుగా ముంబయిలోని బల్లార్డ్ ఎస్టేట్ ఏరియాలో ఉన్న ఇడి ఆఫీసు బల్లార్డ్ ఎస్టేట్ ఏరియాలో ఉన్న ఇడి కార్యాలయం విచారించింది. ఇద్దరి వాంగ్మూలాన్ని రికార్డ్ చేశారు. అనిల్‌పై ఫెమా చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారని సమాచారం. ఈ వారంలో మరోమారు వారి ఇరువురు విచారణకు హాజరు కావాలని ఇడి నోటీసులు జారీ చేసింది. 2020లో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అనిల్ అంబానీతో పాటు యస్ బ్యాంక్ ప్రమోటర్ రాణా కపూర్‌లపై మనీ ల్యాండరింగ్ కేసు నమోదు చేశారు. తాజాగా ఈ కేసులో భాగంగా విచారణకు హాజరైన ఆయనను ఇడి ప్రశ్నలు కురిపించగా.. అనిల్ అంబానీ దంపతులపై ఇడి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోనున్నారే వేచి చూడాలి.

సంపాదకీయం

మరో మతతత్వ అజెండా


మతతత్వాన్ని ప్రధాన అజెండాగా తెరమీదకు తెచ్చేందుకు, మత వైషమ్యాలను రగిల్చేందుకు ఉమ్మడి పౌరస్మృతి (యూనిఫామ్ సివిల్ కోడ్-యుసిసి)ని కాషాయ పార్టీ ముందుకుతేవడం అవాంఛనీయం. ఉమ్మడి పౌరస్మృతిని అమలు చేస్తామని ప్రధాని నరేంద్రమోడీ ఇటీవల చేసిన ప్రకటన ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మతపరంగా మైనారిటీ వ్యతిరేక భావాలను రగిలించడం ద్వారా మెజారిటీ ఓట్లను కొల్లగొట్టాలనే ఉద్దేశంతో చేసిందే. రెండు నెలలుగా మంటల్లో మాడిపోతున్న మణిపూర్‌పై నోరుమెదపని ప్రధాని యుసిసిపై మాట్లాడటం పథకం ప్రకారం జరుగుతున్నదే. ఆర్‌ఎస్‌ఎస్ - బిజెపి అజెండాలో ప్రధాన అంశాలు రామజన్మభూమి, 370వ అధికరణ రద్దు, ఉమ్మడి పౌరస్మృతి. 'ఉమ్మడి పౌరస్మృతి ఈ దశలో అవసరమూకాదు.. వాంఛనీయమూ కాదని' 2018 ఆగస్టులో 21వ లా కమిషన్ విడుదల చేసిన సంప్రదింపుల పత్రంలో స్పష్టంగా పేర్కొన్నది. అయినప్పటికీ, తాజాగా 22వ లా కమిషన్ మళ్లీ దాన్ని తెరపైకి తెచ్చింది. మోడీ ప్రభుత్వ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే ప్రస్తుత కమిషన్ ఉమ్మడి సివిల్‌కోడ్‌పై అభిప్రాయ సేకరణ తంతు చేపట్టింది.

ఆదేశిక సూత్రాల్లోని ఉమ్మడి పౌరస్మృతి అమలుకు అడుగులు వేస్తుంటే ఎందుకు అడ్డుపడుతున్నారని కాషాయ సమర్థకులు ప్రశ్నిస్తున్నారు. ఆదేశిక సూత్రాల్లోని సార్వత్రిక విద్య, పని, నిరుద్యోగ భృతి వంటి హక్కులను అమలులోకి తీసుకొస్తే కరోనా కాలంలో అనేక మంది వలస కార్మికులు ప్రాణాలు కోల్పోయే వారే కాదు. కర్ణాటకలో అధిక సంఖ్యాకులైన లింగాయతులు తమను ప్రత్యేక మతంగా పరిగణించాలని డిమాండ్ చేస్తున్నారు. శైవులు, వైష్ణవులతోపాటు కులాలవారీగా భిన్న ఆచారాలు, ఎన్నో విభిన్నతలు ఉన్నాయి. ఆదివాసీలకు ప్రత్యేక సాంప్రదాయాలున్నాయి. పంజాబ్‌లో వారసత్వ హక్కులు సిక్కులకు ఒక విధంగా, హిందువులకు మరో విధంగా ఉన్నాయి. వాటన్నింటిలో ప్రభుత్వం జోక్యం చేసుకోవాలా? యుసిసిని ఒక ఎన్నికల ప్రచార అస్త్రంగా, ముస్లిముల మీద విద్వేషాలను, వ్యతిరేకతను రెచ్చగొట్టి మెజారిటీ ఓటుబ్యాంకును సంస్థాగతం చేసుకోవడమే లక్ష్యంగా బిజెపి ముందుకెళ్తోంది. ఒకే దేశం, ఒకే జాతి, ఒకే సంస్కృతి పేరుతో దేశంలో బహుళత్వాన్ని నాశనం చేసేందుకు ప్రయత్నిస్తోంది. కర్ణాటకలో ఓటమి, మణిపూర్ హింసాకాండ, రెజ్లర్ల నిరసన, విపరీతంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, రైతుల ఆందోళనలు... బిజెపి సర్కారుపై కొన్ని సెక్షన్లలో ఉన్న భ్రమలను దూరం చేశాయి. జాతీయ స్థాయిలో ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి సమావేశం తర్వాత మోడీ సర్కారుకు బెంగపెరిగింది.

భిన్నత్వంలో ఏకత్వం భారత దేశ సంస్కృతి. అనేక సంఘాలు, సంస్కృతుల మిశ్రమంగా ఉన్న దేశంలో, వివిధ వర్గాల వ్యక్తులు వారి స్వంత ఆచారాలు, మతపరమైన నియమాలను అనుసరిస్తారు. దీన్ని మార్చి ఒకే సివిల్ కోడ్ అమలు చేయాలన్న ఎత్తుగడ రాజ్యాంగ సారాంశానికి విరుద్ధం. ప్రత్యేక వ్యక్తిగత చట్టం ముస్లిములకే పరిమితం కాదు. మిగిలిన మతాల్లోనూ అనేక ప్రత్యేక అంశాలున్నాయి. గిరిజన తెగల్లోనూ రకరకాల ఆచారాలు, సాంప్రదాయాలు ఉన్నాయి. ఏకరూపత పేరుతో సాంస్కృతిక వైవిద్యాన్ని నాశనం చేయడం జాతి సమైక్యతకే ప్రమాదం. రాజ్యాంగ విరుద్ధం. హిందూ మతానికి వస్తే నిచ్చెనమెట్ల కులవ్యవస్త, దుర్మార్గమైన కులవివక్ష నెలకొన్నాయి. భారతీయ సమాజంలో లింగవివక్ష మరో ప్రధానమైన సమస్య.

మహిళా రిజర్వేషన్ల బిల్లును పాలకులు దశాబ్దాల తరబడి కోల్డ్ స్టోరేజిలో పెట్టారు. విధానపరంగా ప్రధాన పార్టీలు దాన్ని వ్యతిరేకించడం లేదు కాని బిల్లు మాత్రం ఆమోదం పొందదు. మోడీ సర్కారుకు ఏమాత్రం ఇంగితం ఉన్నా రానున్న పార్లమెంటు సమావేశాల్లో మహిళా బిల్లును ఆమోదింపజేయాలి. మోడీ సర్కారు ముందుకుతెస్తున్న ఏకరూపత అంటే సమానత్వం కాదు. అన్ని కమ్యూనిటీలకు చెందిన మహిళలకు సమాన హక్కు ముందుగా కల్పించాలి. అన్ని కమ్యూనిటీలకు సంబంధించిన పర్సనల్ చట్టాలు లేదా సాంప్రదాయ చట్టాలను సంస్కరించడం ద్వారానే అది సాధ్యం. ముందుగా అందరితో చర్చించి, ఏకాభిప్రాయానికి రావాలి. అన్ని కమ్యూనిటీల్లో స్త్రీ, పురుషులందరి ప్రజాస్వామిక భాగస్వామ్యంతో ముందుకు సాగాలి.

మహనీయుల మాట



ఈనాడు విజ్ఞానంగా భావిస్తున్నదంతా
గతంలో కొంత మంది
గొప్ప వ్యక్తుల శ్రమ ఫలమే.

- హెచ్‌డబ్ల్యు లాంగ్‌ఫెలో,
అమెరికన్ కవి, విద్యావేత్త.

అంతర్జాతీయం

పోలీసు దురాగతం : ఫ్రెంచి నిరసనలు !

అల్జీరియా-మొరాకో సంతతికి చెందిన 17 సంవత్సరాల నహేల్ అనే కుర్రవాడు ట్రాఫిక్ సిగ్నల్ నిబంధనలను ఉల్లంఘించాడంటూ పోలీసులు గుండెల మీద కాల్చి చంపిన దురంతం ప్రస్తుతం ఫ్రాన్స్‌ను ఊపివేస్తున్నది. జూన్ 27న పారిస్ శివార్లలోని నాన్‌తెరేలో ఈ దారుణం జరిగింది. ఇరవై తొమ్మిదవ తేదీన అంత్యక్రియల సందర్భంగా దేశమంతటా ఆగ్రహించినవారి తీవ్ర నిరసనలు, దాడులు కొనసాగుతున్నాయి. మధ్యేవాద, వామపక్ష పార్టీలు, శక్తులు ఈ ఉదంతాన్ని ఖండించాయి, నిరసనలో పాల్గొన్నాయి. ఒక మేయరు ఇంటి మీద తగులబడుతున్న కారును తోలి దాడికి పాల్పడ్డారంటే జాతి వివక్ష ఎలాంటి పరిస్థితికి దారి తీస్తుందో వెల్లడించింది. మైనారిటీల పట్ల దేశంలో ఉన్న జాతివివక్ష గురించి మరోసారి పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ఆందోళన రెండో వారంలోకి ప్రవేశించింది.

ఉదయం ఎనిమిది గంటలపుడు మెర్సిడెజ్ కారు నడుపుతున్న నహేల్ ఒక స్టాప్ వద్ద ఉన్న ఇద్దరు పోలీసుల మీద దురుసుగా కారును పోనిచ్చేందుకు చూశాడనే కథనాలు వెలువడ్డాయి. అది వాస్తవం కాదని, వారిద్దరూ కారు పక్కనే ఉన్నట్లు, కారు కదలక ముందే ఒక పోలీసు కారులో ఉన్న నహేల్ మీద తుపాకి గురిపెట్టినట్లు కొన్ని వీడియోలు సామాజిక మాధ్యమంలో దర్శనమిచ్చాయి. కాల్పులు జరిపిన తరువాత అదుపుతప్పిన కారు సమీపంలోని ఒక స్థంభాన్ని ఢీకొట్టి ఆగింది. 'నీ తలలో బుల్లెట్ దిగుతోంది' అన్న మాటలు వినిపించినట్లు ఒక టీవీ ఛానల్ పేర్కొన్నది. కాల్పులు జరిపినపుడు నహేల్‌తో పాటు కారులో మరో ఇద్దరు ఉన్నారని వారిలో ఒకడు పోలీసులతో మాట్లాడినట్లు, మరొకడు కారు దిగి పారిపోయినట్లు చూసిన వారు చెబుతున్నారు. కాల్పులు జరపటానికి ముందు బస్సులు వెళ్లే మార్గంలో పోతున్న కారును ఇద్దరు పోలీసులు మోటారు సైకిళ్ల మీద వెంబడించి ఆపేందుకు చూడగా నహేల్ కారును ఆపలేదు, కొంత దూరం వెళ్లిన తరువాత ట్రాఫిక్ కారణంగా నిలపాల్సి వచ్చింది. వెనుకనే వచ్చిన పోలీసుల్లో ఒకడు కారు పక్కకు వచ్చి కాల్పులు జరిపాడు. ఈ తీరుతో జనంలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. చైనా పర్యాటకులు వెళుతున్న బస్‌పై జరిగిన దాడి తరువాత అనేక దేశాలు తమ పౌరులను హెచ్చరిస్తూ ఫ్రాన్స్ వెళ్లవద్దని సలహా ఇచ్చాయి.



ఎం. కోటేశ్వరరావు

గత వారం రోజులుగా దేశమంతటా వేలాది మంది సాయుధ పోలీసులను మోహరించి హింసాకాండను ఆపేందుకు పూనుకున్నారు. వేలాది మందిని అరెస్టు చేశారు. హింసాకాండకు పాల్పడుతున్న వారు తన మనవడి మరణాన్ని సాకుగా చూపుతున్నారని అమ్మమ్మ నాదియా ఒక టీవీలో చెప్పింది. ఆందోళనలు విరమించాలని కోరింది. నహేల్ ఉదంతం ఇలాంటి పరిస్థితిని ఎందుకు సృష్టించిందన్నది ప్రశ్న. 2020లో అమెరికాలోని మినియాపోలిస్ పట్టణంలో పోలీసులు జార్జి ఫ్లాయిడ్ అనే నల్లజాతి యువకుడిని ఊపిరాడకుండా చేసి చంపిన తీరును చుట్టుపక్కల ఉన్నవారు తీసిన వీడియో సంచలనంగా మారి ఆందోళనకు దారితీసింది. నహేల్‌ను కాల్చి చంపుతున్న వీడియో కూడా అలాంటి ప్రతిస్పందననే కలిగించింది. 2005లో పోలీసులు వెంటాడినపుడు ప్రమాదానికి గురై ఇద్దరు మరణించినపుడు దేశమంతటా మూడు వారాల పాటు తీవ్ర ఆందోళనలు జరిగాయి. ఆ తరువాత ఇప్పుడు అదే మాదిరి ఫ్రాన్సులోని మైనారిటీలు ఆందోళనకు పూనుకున్నారు. ఫ్రెంచి పోలీసుల దుర్మార్గపూరిత వైఖరి, జాతి వివక్ష తీరుతెన్నులకు ఈ ఉదంతాలు నిదర్శనం.



పశ్చిమ దేశాలలో అమెరికా తరువాత ఫ్రాన్స్‌లోనే పోలీసుల చేతుల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారు. ఉక్రెయిన్ సంక్షోభం, ఆర్థిక దిగజారుడు పరిణామాలు, వలసదారుల అంశాల మీద ఐరోపా దేశాల్లో పరిస్థితి దిగజారుతోంది. ఇటువంటి స్థితిలో జనంలో ఉన్న అసంతృప్తి... ఇలాంటి ఉదంతాలు జరిగినపుడు ఊహించని రీతిలో వెల్లడౌతుంది. ఫ్రాన్స్ ఆందోళనకు పూర్వరంగమిదే. నహేల్ హత్య ఊహించని ఉదంతమైనా దానికి ప్రతికూల స్పందన గూడు కట్టుకున్న అసంతృప్తికి నిదర్శనం.

నెలల తరబడి సాగిన పెన్షన్ సమ్మెలు, ఇతర ఆందోళనలతో అట్టుడికిన ఫ్రాన్స్‌లో అధికారాన్ని నెట్టుకువస్తున్న మాక్రాన్ ప్రభుత్వానికి తాజా ఆందోళనతో ఎదురైన సవాలు అత్యంత తీవ్రమైనది. అందుకే బ్రసెల్స్‌లో జరుగుతున్న ఒక సమావేశం నుంచి మాక్రాన్ ముందుగానే స్వదేశానికి చేరుకున్నారు. అంతేగాక, జర్మనీ పర్యటన వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. పెన్షన్ సంస్కరణలకు పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్న సమయంలో బ్రిటన్ రాజు చార్లెస్ కూడా ఈ ఏడాది ప్రారంభంలో ఫ్రెంచి టూర్‌ను వాయిదా వేసుకోవాల్సి వచ్చింది. మన దేశంలోని మణిపూర్‌లో పరిస్థితి ఎంతగా దిగజారిందో తెలిసిందే. శాంతిగా ఉండాలని కనీసం ప్రధాని నరేంద్ర మోడీ నోటి వెంట ఒక్క ముక్క రాలేదు, స్వయంగా పరిస్థితిని తెలుసుకొనేందుకు అక్కడకు వెళ్లలేదు. తమ రాష్ట్రంలో శాంతి నెలకాల్పాలని కోరుతూ ఢిల్లీ వచ్చిన ఆ రాష్ట్రానికి చెందిన వివిధ పార్టీల ప్రతినిధులను కూడా కలుసుకొనేందుకు అవకాశం ఇవ్వలేదు. అమెరికా, ఈజిప్టు వెళ్లి సుభాషితాలు చెప్పి వచ్చారు. సాధారణ పరిస్థితులను నెలకొల్పేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించేందుకు ఫ్రెంచి అధ్యక్షుడు మాక్రాన్ మంగళవారం నాడు దేశంలోని 220 మంది మేయర్లతో (స్థానిక సంస్థల అధిపతులు) సమావేశం కానున్నట్లు వార్తలు వచ్చాయి.

అల్జీరియా ఫ్రెంచి వలసగా ఉన్న కాలంలో ఫ్రెంచి దళాలు జరిపిన దారుణ మారణకాండలు ఇప్పటికీ గుర్తుకు వస్తాయి. అనేక మంది అల్జీరియన్లు ఫ్రాన్స్‌లో స్థిరపడ్డారు. అలాంటి కుటుంబానికి చెందిన వాడే గత నెలలో పోలీసుల చేతిలో మరణించిన నహేల్. వలస వచ్చిన ఆఫ్రికా అరబ్బులు, ఇతరులు అంటే ఫ్రెంచి అధికార యంత్రాంగానికి చిన్న చూపు, నేరగాళ్లుగా చూస్తారు. వారితో మమేకం కావటానికి బదులు దమనకాండ ప్రదర్శిస్తారు. అందుకే వారు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో తరచూ వివాదాలు జరుగుతుంటాయి. పశ్చిమ దేశాలలో అమెరికా తరువాత ఫ్రాన్స్‌లోనే పోలీసుల చేతుల్లో ఎక్కువ మంది మరణిస్తున్నారు. ఉక్రెయిన్ సంక్షోభం, ఆర్థిక దిగజారుడు పరిణామాలు, వలసదారుల అంశాల మీద ఐరోపా దేశాల్లో పరిస్థితి దిగజారుతోంది. ఇటువంటి స్థితిలో జనంలో ఉన్న అసంతృప్తి ఇలాంటి ఉదంతాలు జరిగినపుడు ఊహించని రీతిలో వెల్లడౌతుంది. ఫ్రాన్స్ ఆందోళనకు పూర్వరంగమిదే. నహేల్ హత్య ఊహించని ఉదంతమైనా దానికి ప్రతికూల స్పందన గూడు కట్టుకున్న అసంతృప్తికి నిదర్శనం. ఇటీవలి కాలంలో ఫ్రెంచి అధినేత మాక్రాన్ తమకు మరింత వ్యూహాత్మక స్వయం నిర్ణయాధికారం ఉండాలని, ప్రపంచ వ్యవస్థలో బహుళ నాయకత్వం ఉండాలని గట్టిగా చెబుతున్నారు. ఇది అమెరికా గురించే అన్నది స్పష్టం. మాక్రాన్‌ను దారిలోకి తెచ్చుకొనేందుకు పెత్తందారీ ఏకఛత్రాధిపత్యం చెలాయించాలని చూస్తున్న శక్తుల హస్తం కూడా తాజా కొట్లాటల వెనుక ఉండవచ్చని కొందరు అనుమానిస్తున్నారు. అమెరికాకు నచ్చని వైఖరిని తీసుకున్నపుడల్లా ఫ్రాన్స్‌లో కొట్లాటలు జరగటాన్ని బట్టి ఇలా అనుమానించాల్సి వస్తోందని చెబుతున్నారు. అందువలన ఇది ఒక్క ఫ్రాన్స్‌కే కాదు, ఐరోపా సమాఖ్యకు, దేశాలకు ఒక హెచ్చరిక అని చెప్పవచ్చు.

ఐరోపాలో ఇటీవలి కాలంలో ముస్లిం వ్యతిరేక వైఖరితో ఉన్న పచ్చిమితవాద శక్తులు రెచ్చిపోతున్నాయి. ఫ్రాన్స్ కొట్లాటల్లో పాల్గొన్నది వలస వచ్చిన లేదా ఎప్పటి నుంచో అక్కడ స్థిరపడిన ముస్లింలు, అరబిక్ లేదా ఆఫ్రికన్ దేశాల నుంచి వలస వచ్చిన వారని చెబుతున్నారు. తాజా పరిణామాల గురించి మీడియాలో చర్చ జరుగుతున్నది. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే పోలీసులకు మరింత శిక్షణ అవసరమని, జాతి వివక్ష అంశాన్ని పరిష్కరించాలని, పేదలు-ధనికుల మధ్య పెరిగిన అంతరాన్ని తగ్గించాలని, నిరుద్యోగం పెరుగుదల గురించి సూచనలు చేస్తున్నారు. నిజానికి ఇవి కొత్తవి కాదు. ఎప్పటి నుంచో ఉన్నవే. ప్రపంచీకరణ తెచ్చిన సంక్లిష్ట సమస్యలు ఏడాదికేడాది పెరుగుతున్నాయి. అమెరికా, ఐరోపా ధనిక దేశాలు ప్రపంచీకరణ క్రమంలో ఉత్పత్తి ఖర్చు అధికంగా ఉందనే కారణంతో ఇతర దేశాల నుంచి పారిశ్రామిక వస్తువులను దిగుమతి చేసుకొని సేవారంగం మీద కేంద్రీకరించాయి. ఈ విధానంతో నిరంతర వృద్ధి సాగదని తేలింది. ప్రపంచ అభివృద్ధిలో అసమతూకానికి దారి తీసింది, ప్రపంచీకరణకు వ్యతిరేకతను పెంచింది. కరోనా, ఉక్రెయిన్ సంక్షోభం సమస్యల తీవ్రతను వేగతరం కావించింది. ఆర్థిక మందగమన ప్రతికూల పర్యవసానాలు పేద, మధ్య తరగతి మీద భారాలను మోపుతున్నాయి. స్థిరమైన ఉపాధి, అవసరాలకు అనుగుణంగా పెరిగే రాబడి, కుటుంబ జీవనం సంతోషంగా ఉంటుందనే అంశాల మీద ఆశలను తుంచివేస్తున్నది. వీటికి జాత్యహంకారం కూడా తోడైతే ఇక చెప్పనవసరం లేదు. గడచిన ఐదు దశాబ్దాల్లో ప్రపంచీకరణ తెచ్చిన మార్పు ఫ్రాన్సులోనూ ఇతర పశ్చిమ దేశాల్లోనూ అనేక పరిణామాలు, ఉద్యమాలు, ఆందోళనలకు దారి తీసింది. పెట్టుబడిదారీ విధానం విఫలమైందనే అభిప్రాయం రోజురోజుకూ బలపడటానికి దారితీస్తోంది. గత రెండు దశాబ్దాల్లో ఏ నేతా ఎదుర్కోనటువంటి తీవ్ర సవాలును మాక్రాన్ ఎదుర్కొంటున్నట్లు కొందరు విశ్లేషించారు. పార్లమెంటు లోని 577 స్థానాలకు గాను మాక్రాన్ నాయకత్వంలోని రినైజాన్స్ పార్టీకి 251 సీట్లే ఉన్నాయి. రెండవ సారి ఎన్నికైనపుడు సంపూర్ణ మెజారిటీ రాకపోవటంతో ద్వితీయ రౌండ్‌లో మితవాది మారినే లీపెన్ మీద 58 శాతం ఓట్లతో గెలిచాడు. మరో నాలుగు సంవత్సరాలు అధికారంలో కొనసాగేందుకు పార్లమెంటులో ప్రతిపక్షాల సహకారంతోనే గట్టెక్కే అవకాశం ఉంది. వచ్చే ఏడాది జరగనున్న పారిస్ ఒలింపిక్స్ సందర్భంగా శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా మాక్రాన్ ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది.


★

సమస్య

హెల్త్ మిషన్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వ వివక్ష

ఆంధ్రప్రదేశ్‌లో వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ విభాగంలో 189 క్యాడర్లలో 22 వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు సేవలందిస్తున్నారు. దాదాపు 16 సంవత్సరాలుగా వీరిలో ఎక్కువ మంది రాష్ట్ర ప్రజానీకానికి సేవలందిస్తున్నారు. కాని రాష్ట్ర ప్రభుత్వం, వైద్య శాఖ అధికారులు వీరిపై వివక్ష చూపుతున్నారు. ఈ వివక్షకు వ్యతిరేకంగా నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు ఆందోళనల బాట పట్టారు. తమకు కూడా రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులకు అమలుచేస్తున్న విధంగా మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చెయ్యాలని కేంద్ర మార్గదర్శకాల ప్రకారం హ్యూమన్ రిసోర్స్ సెల్‌ను ఏర్పాటు చేసి హెచ్.ఆర్ పాలసీని అమలు చెయ్యాలని, ఒకే క్యాడర్ ఒకే వేతనం అమలు చెయ్యాలని, పంజాబ్, హర్యానా, ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్‌లలో వలే రెగ్యులరైజ్ చెయ్యాలని కోరుతూ ఆందోళనలు చేస్తున్నారు.

2005 ఏప్రిల్ 12న కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో నివసించే ప్రజలకు ఆరోగ్య సేవలను విస్తరించే క్రమంలో మాతా శిశు సంరక్షణ కోసం, నియోనేటల్, మెటర్నటీ మోర్టాలిటీ రేటు తగ్గించటానికి, మురికి వాడల్లో నివసించే ప్రజలకు నాణ్యమైన ఆరోగ్యసేవలను అందించటానికి నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌ను, 2013 మే 1న పట్టణ ప్రాంతంలోని పేదలకు సేవలందించటానికి నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌ను ప్రారంభించారు. అనంతరం దీనిని నేషనల్ హెల్త్ మిషన్‌గా మార్చారు. ఈ నేపథ్యంలో భారతదేశం లోని అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు కేంద్రం నుంచి వచ్చే నిధులను వినియోగించుకుంటూ లక్షలాది మంది ఉద్యోగులను వైద్య, ఆరోగ్య శాఖలో నియమించుకొని ప్రజలకు సేవలందిస్తున్నాయి. కాని మన రాష్ట్రంలో కేంద్ర నిధులను వివిధ వైద్య, ఆరోగ్య పథకాలకు వాడుకుంటూ ఎన్‌హెచ్ఎం ఉద్యోగులకు కేంద్ర మార్గదర్శకాల ప్రకారం అమలు చెయ్యాల్సిన హెచ్.ఆర్ పాలసీకి తిలోదకాలు ఇచ్చింది. సిఎఫ్‌డబ్ల్యు పరిధిలో ఉన్న రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సెలవులను ఎన్‌హెచ్ఎంలో కూడా అమలు చెయ్యాలి. కాని రాష్ట్రంలో అమలు చెయ్యడంలేదు. ప్రతి సంవత్సరం వేతనాలలో కనీసం 5 శాతం ఇంక్రిమెంట్ ఇస్తూ ప్రతీ 3 లేదా 5 సంవత్సరాలకు బేసిక్ వేతనాలను పెంచాలి. బోనస్‌లు, ఇన్‌సెంటివ్‌లు అమలు చెయ్యాలి. మెడికల్ ఇన్సూరెన్స్, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌లు వర్తింపచెయ్యాలి. కార్మిక చట్టాలు అమలు చెయ్యాలి. ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీని ఏర్పాటు చెయ్యాలి. కాని ఇవేవీ అమలు చెయ్యకుండా రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నది. అమానుషంగా వ్యవహరిస్తున్నది.



ఎ.వి. నాగేశ్వరరావు



సిఎఫ్‌డబ్ల్యు పరిధిలో ఉన్న రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే అన్ని రకాల సెలవులను ఎన్‌హెచ్‌ఎంలో కూడా అమలు చెయ్యాలి. కాని రాష్ట్రంలో అమలు చెయ్యడంలేదు. ప్రతి సంవత్సరం వేతనాలలో కనీసం 5 శాతం ఇంక్రిమెంట్ ఇస్తూ ప్రతీ 3 లేదా 5 సంవత్సరాలకు బేసిక్ వేతనాలను పెంచాలి. బోనస్‌లు, ఇన్‌సెంటివ్‌లు అమలు చెయ్యాలి. మెడికల్ ఇన్సూరెన్స్, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్‌లు వర్తింపచెయ్యాలి. కార్మిక చట్టాలు అమలు చెయ్యాలి. ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీని ఏర్పాటు చెయ్యాలి. కాని ఇవేవీ అమలు చెయ్యకుండా రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నది.

దేశ వ్యాప్తంగా నేషనల్ అర్బన్ హెల్త్ మిషన్‌లో దాదాపు 5 లక్షల మంది ఉద్యోగులు, మన రాష్ట్రంలో 22 వేల మంది పనిచేస్తున్నారు. వీరు లేకుండా రాష్ట్రంలో వైద్య ఆరోగ్య సేవలు పూర్తి స్థాయిలో అందే పరిస్థితి లేదు. కోవిడ్ కాలంలో కూడా వీరు సేవలందించారు. వేలాది మంది కోవిడ్ బారిన పడ్డారు. పదుల సంఖ్యలో చనిపోయారు. ఆంత్రాక్స్ వైరస్ నుండి కరోనా వైరస్ వరకు భయపడకుండా సేవలందించారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులకి మాత్రమే కోవిడ్ కాలంలో చనిపోయిన వారికి రూ. 10 నుండి రూ. 25 లక్షల వరకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించింది. కాని కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మాత్రం రూ. 2 లక్షలు ఇచ్చి చేతులు దులుపుకుంది. దుర్మార్గపు యజమానిగా వ్యవహరించింది. రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వీరు సేవలందిస్తున్నా వీరికి నామ మాత్రంగా వేతనాలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తున్నది. పి.ఎఫ్ మినహా ఎటువంటి సౌకర్యాలను వర్తింపచెయ్యటంలేదు. కనీసం వైద్య, ఆరోగ్య శాఖలో ఇతర కాంట్రాక్ట్ ఉద్యోగులకు వర్తింపచేస్తున్న మినిమమ్ టైమ్ స్కేల్‌ను కూడా అమలు చెయ్యకుండా రాష్ట్ర ప్రభుత్వం వివక్ష చూపుతున్నది. గత 4 సంవత్సరాలుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతీ సంవత్సరం పెంచాల్సిన 5 శాతం వేతనాలను పెంచకపోవడం వలన ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు 150 కోట్ల రూపాయలు నష్టపోయారు. ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చెయ్యకుండా తాత్సారం చేస్తున్నది.


నేషనల్ హెల్త్ మిషన్ లోని వివిధ విభాగాలైన అర్బన్ హెల్త్, ఆర్‌ఎన్‌టిసిపి, ఆర్‌బిఎస్‌కె, ఆర్‌బిఎస్‌యు, ఎన్‌ఆర్‌సి, ఎస్‌ఎన్‌సియు, ఎన్‌టిఎల్‌పి, ఎన్‌ఎంహెచ్‌పి, ఆర్‌కెఎస్‌కె, ఎంహెచ్‌పి, ట్రామా, బ్లడ్ బ్యాంకులు, ఆయూష్, అడాలసెంట్ హెల్త్ తదితర విభాగాలలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిన స్పెషలిస్టు డాక్టర్లు, డాక్టర్లు, స్టాఫ్ నర్సులు, ఎఎన్‌ఎంలు, ఫార్మాసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఫిజియో థెరపిస్టులు, సైకాలజిస్టులు, న్యూట్రీషియనిస్టులు, ఓటి, ఎక్స్‌రే టెక్నీషియన్లు, డెంటల్ హైజీనిస్టులు, ఎంఎన్‌ఓ, ఎఫ్‌ఎన్‌ఓ, డిఇఓ, కంటింజెంట్, సపోర్టింగ్ స్టాఫ్, ఆఫీసు సిబ్బంది, క్లాస్ 4 సిబ్బందికీ, డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం, స్టాటిస్టికల్ ఆఫీసర్లు, జిల్లా క్యాడర్లు, అనేక ఇతర క్యాడర్లు పనిచేస్తున్నారు. వీరిలో ఒకే క్యాడర్, ఒకే క్వాలిఫికేషన్లు ఉన్నప్పటికీ ఒక్కొక్క విభాగంలో ఒక్కో రకంగా వేతనాలు చెల్లిస్తున్న పరిస్థితి ఉంది. ఒకే క్యాడర్‌కు ఎన్‌హెచ్ఎం లోని ఒక్కో విభాగంలో ఒక్కోరకమైన వేతనాలు చెల్లిస్తున్నారు. ఆయూష్ డాక్టర్లు, ఫిజియో థెరపిస్టులు, న్యూట్రీషియనిస్టులు, సైకాలిజిస్టులు, స్టాఫ్‌నర్సులకు... తదితర క్యాడర్లకు వేరు వేరు వేతనాలు చెల్లిస్తున్నారు. ఆర్‌కెఎస్‌కె కన్సల్టెంట్లకు, ఆర్‌బిఎస్‌కె లోని డిఇఐసి మేనేజర్లకు, ఆయూష్ లోని కాంపౌండర్లకు అర్బన్ హెల్త్ లోని అన్ని క్యాడర్లకు ఉత్తర్వుల కన్నా తక్కువ వేతనాలు చెల్లిస్తున్నారు. అనేక సంవత్సరాలుగా ఉన్న ఈ లోపాలను సరిచెయ్యకపోగా అదే విధానాన్ని కొనసాగిస్తున్న దుస్థితి నేడు రాష్ట్రంలో ఉన్నది.

ఈ నేపథ్యంలో తమపై వివక్షను ఆపాలని, వైద్య, ఆరోగ్యశాఖ లోని ఇతర కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వలే మినిమమ్ టైమ్ స్కేల్ అమలు చెయ్యాలని, కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం హెచ్‌ఆర్ పాలసీని అమలు చెయ్యాలని, ఒకే విభాగంలో ఒకే క్యాడర్ మధ్య వేతన వ్యత్యాసాలను సరిచెయ్యాలని, వేర్వేరు విభాగాల లోని ఒకే క్యాడర్ మధ్య వ్యత్యాసాలను తొలగించాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా లీవ్‌లు, సౌకర్యాలు కల్పించాలని నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు కోరుతూ ఆందోళనలు చేస్తున్నారు. వైద్య ఆరోగ్య రంగాన్ని అభివృద్ధి చేస్తానని, ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని చెప్పుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం ఆ సేవలు అందించటంలో కీలక పాత్ర పోషించే ఈ ఉద్యోగుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.

(వ్యాసకర్త ఎ.పి సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు)

సెటైర్

ప్రశ్నా - పరాభవమా?



'**ప్ర**పంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో మైనార్టీలపై దాడులు జరుగుతున్నాయి. ఈ దాడులను ప్రశ్నించిన వారి నోళ్ళు నొక్కుతున్నారని హక్కుల సంఘాల వారు అంటున్నారు. దీనికి మీ సమాధానం ఎంత మరిచిపోదామన్నా, మరువడం కుదరడం లేదు. పగలైనా, రేయైనా, కలలో ఉన్నా, మెలకువలో ఉన్నా అదే చిత్రం విచిత్రంగా పదే పదే కళ్ళ ముందు త్రిడి ఎఫెక్టుతో తారట్లాడుచున్నదే.

అధినేతగా ఎక్కడా, ఏనాడూ పత్రికా సమావేశం పెట్టని మేము, ఇప్పుడు ఇలా కన్నంలో దొంగలా పట్టుబడవలసి వచ్చిందే.

మయసభ నందు భంగపడిన సుయోధనుని చూసి పాంచాలి పక్కున నవ్వినట్టు, అమెరికా జర్నలిస్టు సబ్రినా సిద్దీఖీ సంధించిన ప్రశ్న మా పతనానికి ఓ కారణం కాదు కదా? ఏమా విధి వైపరీత్యము?

అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ మా గౌరవార్థం ఇచ్చిన విందుకు మేమేల పోవలె. పోయితిమి పో. వారితో కలసి వైట్‌హౌస్ ఒత్తిడి మేరకు ఈ విలేకరుల సమావేశమునకు మొహమాటముతో ఏల అంగీకరించవలె. అంగీకరించితిని పో. ఆ సమావేశమునకు సదరు సబ్రినా సిద్దీఖీ ఏల రావలె? వచ్చినది పో. రాజకీయ వ్యవస్థకే ఆయువుపట్టు వంటి ఆ ప్రశ్ననే ఏల సంధించవలె.

ఊహించని ప్రశ్నకు మా నుండి లిప్తపాటున వచ్చిన సమాధానం.

'అలా అంటున్నారా. ఆశ్చర్యపోతున్నాను. ప్రజలు అడగరే. భారత్ ప్రజాస్వామ్య దేశం. భారత్ -అమెరికా డిఎన్ఎ లోనే ప్రజాస్వామ్యం ఉంది. ప్రజాస్వామిక విలువల్లో కుల మత వయోబేధపరంగా భారతదేశంలో వివక్షలేదు.'

మా హృదయమేగా ఆ మాటలు మాట్లాడింది. పైపై పెదాలు కాదుగా. అయినా ఆ క్షణాన మా ముఖమెందుకు అంతగా పాలిపోయింది. దర్పణంలేక పోయినా వివర్ణమైన మా మోము మాకు స్పష్టంగా గోచరించిందే. అవును మా అంతరంగానికి అందని పరిణామమేదో జరుగుతున్నది.

ఇంతకీ ఆమె ఎవరు? పాకిస్తాన్ మూలాలు ఉన్న అమెరికా వాసి. వాషింగ్టన్, గార్డియన్ పత్రికల్లో పనిచేసిన ఘన అనుభవమున్ననేమి? ఆమె స్త్రీయే. అవును స్త్రీయే. ఒక పక్క పాకిస్థానీ మూలాలు. మరో పక్క స్త్రీ. ఈ రెండు కారణాలు చాలు. మా అనుచరగణం వెంటబడి వేధించడానికి. హా..హా..హా...!

మా వారు ప్రభువును మించిన ప్రభు భక్తులని ఆమె ఎరుగరుగాక ఎరుగరు. వారి వికృత విశ్వరూపం చూసి ఎందరెందరో తోకముడిచి మా పంచకు చేరి మా భజన చేసినవారే.

మా భీకర సహచర గణం సాటిలేని అద్వితీయ బూతు పంచాంగంతో ట్రోలింగ్ చేస్తూ ఎవ్వరిపైనైనా ఇట్టే లంఘించగలదు. ఈ అంశంలో వారి సృజనశీలత అపారమైనది సుమా. మాపై విమర్శలు సంధించిన వారిని పుర్రెకు తోచినట్టు అనడం లేదా మేం వినడం లేదా.

కానీ ఇది ఏమి? ఎంతగా సమర్ధించు కుందామనుకున్నా కొంగున కట్టిన నిప్పువలె మమ్ములను ఈ అంశము వదలక లోలోన దహించుచున్నదేమి. ఆమెకే అంత కంతకు అంతటయూ మద్దతు లభిస్తున్నదేమి? కడకు వైట్‌హౌస్ ప్రతినిధి వర్గం కూడా ఈ ట్రోలింగ్‌లు తమకు 'అంగీకార యోగ్యం కాదని' ప్రకటించినదేమి? సిద్దీఖీ అడిగినట్లు ప్రశ్నించినవారి నోళ్ళు నొక్కేయడం ఆమెకే ఎదురైన అనుభవంగా లోకం గమనించు చున్నదా..? మా అనుచరగణం ట్రోలింగ్‌లు బూమరాంగ్ వలె మాపై విరుచుకు పడటం లేదుకదా..?!

- కె. శాంతారావు,
సెల్: 9959745723

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

గిరిజనులకు మినహాయింపు ఇవ్వాలి

- యూసిసిపై పార్లమెంటరీ కమిటీ ఛైర్మన్ సూచన
- చట్టంపై తొందర ఎందుకన్న ప్రతిపక్షాలు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపాదిత ఉమ్మడి పౌరస్మృతి (యూసిసి)పై ఎందుకు తొందరపడుతున్నారని ప్రతిపక్ష కాంగ్రెస్, డీఎంకే, బీఆర్ఎస్ పార్టీలు ప్రభుత్వాన్ని నిలదీశాయి. దీని వెనుక ఉన్న ఉద్దేశమేమిటని ప్రశ్నించాయి. యుసీసీపై అభిప్రాయాలు సేకరించేందుకు పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (లా అండ్ జస్టిస్) సోమవారం నాడు సమావేశాన్ని ఏర్పాటు చేసింది. దీనిలో పాల్గొన్న ప్రతిపక్ష పార్టీలు బిల్లును తీసుకురావడంలో తొందరపాటు దేనికని ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. ప్రస్తుతం యూసీసీ అవసరం లేదని, అది వాంఛనీయం కూడా కాదని 21వ లా కమిషన్ తన నివేదికలో అభిప్రాయపడిందని ఆ పార్టీలు తెలిపాయి. కాగా ఈశాన్య ప్రాంతంలోనూ, దేశంలోని ఇతర ప్రాంతాలలోనూ నివసిస్తున్న గిరిజనులను యూసీసీ పరిధి నుండి మినహాయించాలని కమిటీ ఛైర్మన్, బీజేపీ ఎంపీ సుశీల్ మోడీ సూచించారు. వారికి రాజ్యాంగంలోని ఆరో షెడ్యూలు రక్షణ కల్పిస్తోందని ఆయన గుర్తు చేశారు. తృణమూల్ కాంగ్రెస్, ఎన్సీపీ సభ్యులు ఈ సమావేశానికి రాలేదు. బీఎస్పీ, శివసేన (ఉద్ధవ్ ఠాక్రే) పార్టీలు యూసీసీని సమర్థించాయి.

ఖరీఫ్.. మందకొడి

- 3.15 శాతమే సాగు
- 5,770 ఎకరాల్లోనే విత్తనం
- అధికంగా 2,398 ఎకరాల్లో పత్తి

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లా వ్యవసాయ శాఖ 1.90 లక్షల ఎకరాల్లో సాగు ప్రణాళికను సిద్ధం చేసింది. జిల్లాలోని 36 మండలాల పరిధిలో 5,770 ఎకరాల్లోనే విత్తనం పడింది. 1.84 లక్షల ఎకరాల్లో విత్తనం పడాల్సి ఉంది. గతేడాది ఇదేసమయానికి సుమారు తొమ్మిది వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గతేడాది సాగుతో పోలిస్తే 50 శాతం కూడా సాగుకు నోచుకోకపోవడం గమనార్హం. త్వరలో కడప-కర్నూలు కాల్వకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో 92 వేల ఎకరాల్లో వరి సాగు ఊపందుకునే అవకాశం ఉందనే అంచనాలో వ్యవసాయశాఖ నిమగ్నమైంది. జిల్లా వ్యాప్తంగా వరి, ఇతర పంటల సాగు ఊపందుకునే అవకాశాలు ఉన్నాయనే అంచనా వేసుకుంటోం ది.

వర్షపాతం...ఆందోళనకరం

జిల్లాలో జూన్‌లో 68.2 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి నైరుతి తిరోగమనం కారణంగా 35.9 మి.మీ మాత్రమే వర్షపాతం నమోదు కావడం ఆందోళన కలిగించింది. సీజన్ ఆరంభంలో మంచి వర్షపాతం నమోదైతే విత్తనం వేయడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. ఫలితంగా ఖరీఫ్ సీజన్ ఊపందు కునే అవకాశం ఉంటుంది. నమోదు స్థాయికి సగం మాత్రమే వర్షపాతం నమోదు కావడంతో వ్యవసాయ బోర్ల కింద మాత్రమే పంటల సాగు నడుస్తోంది. మెట్టప్రాంతాల్లో విత్తనం విత్తడానికి అవకాశం లేకుండా పోయింది.

మేఘం కరుణించేనా!

జులైలో 96.7 మి.మీ, ఆగస్టులో 118.4. మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉంది. జులైలో 9.35 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావడంతో రైతాంగం సాగుకు సన్నద్ధమైంది. ప్రస్తుతం అల్పపీడన వాతావరణం కొనసాగుతున్న నేపథ్యంలో కురుస్తున్న అడపాదడపా వర్షాలకు రైతాంగం ఆశాభావంతో ముందుకు కదులుతోంది. జులైలో నైరుతి ఏమే రకు సహకరిస్తుందనే అంశంపై ఖరీఫ్ సాగు ఆధారపడి ఉందని చెప్పవచ్చు.

ఆశావహంగా పత్తి

ఖరీఫ్ సీజన్‌లో అత్యధికంగా పత్తి సాగవుతోంది. 2,398 ఎకరాల్లో విత్తనం పడింది. 2,092 ఎకరాల్లో మినుములు, 4,487 ఎకరాల్లో వేరుశనగ విత్తనం పడింది. జిల్లాలోని ప్రధాన ఆహార పంటల్లో మినుములు 837 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా, 2092 ఎకరాల్లో విత్తనం పడడం గమనార్హం.

53,268 ఎకరాల్లో పత్తి సాగు కావాల్సి ఉండగా 2,398 ఎకరాల్లోనే పడినట్లు తెలుస్తోంది. ఇతర పంటల సాగుదలను పరిశీలిస్తే మొక్కజొన్న 1407 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉండగా 61 ఎకరాల్లో సాగుకు నోచుకుంది. పప్పుదినుల సాగులో కందులు 8528 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 18 ఎకరాల్లో మాత్రమే సాగు కావడం గమనార్హం. ఆయిల్ సీడ్స్ వివరాలను పరిశీలిస్తే పొద్దుతిరుగుడు 2889 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 89 ఎకరాల్లో సాగు కావడం ఆందోళన కలిగిస్తోంది. సోయా బీన్ 2119 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 2.5 ఎకరాల్లో మాత్రమే విత్తనం పడడం వర్షాభావ తీవ్రతను తెలుపుతోంది. మిరప 3,198 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా 195 ఎకరాల్లోనే విత్తనం పడడం ఆందోళన కలిగిస్తోంది. ఉల్లి, ధనియాల పంటల సాగు ఆనవాలే కనిపించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. మరో వాణిజ్య పంట పసుపు 7,518 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా ఒక్క ఎక రమూ సాగుకు నోచుకోకపోవడం గమనార్హం. జిల్లాలోని ప్రధాన ఆహారపు పంట వరి 82,041 ఎకరాలకు గానూ 261 ఎకరాల్లోనే సాగు కావడం గమనార్హం.

లక్ష్యాన్ని అందుకుంటాం

ఖరీఫ్-2022 లక్ష్యాన్ని అందుకుంటాం. కెసి ప్రాంతాల్లో 92 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యే అవకాశం ఉంది. వరి గణనీయంగా సాగుకు అవకాశం ఉంది. 15,000 టన్నుల ఎరువులను సైతం అందుబాటులో ఉంచాం. జిల్లా ఖరీఫ్ లక్ష్యాన్ని అందుకునే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని చెప్పవచ్చు.

- నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, కడప.

ఆలయ భూముల ఆక్రమణలు అడ్డుకునేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీలు

- మంత్రి కె సత్యనారాయణ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దేవాదాయశాఖ ఆస్తుల పరిరక్షణ కోసం చట్ట సవరణ చేయాలని సిఎం జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయానికి రాష్ట్ర గవర్నరు ఆమోదం తెలుపుతూ ఆర్డినెన్స్ జారీ చేశారని దేవాదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సచివాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభ ఆమోదంతో త్వరలోనే ఆర్డినెన్స్ చట్టంగా మారుతుందన్నారు. దేవాదాయ చట్టం సెక్షన్ 83లో మార్పులు, చేర్పులతో ఆలయ ఆస్తుల పరిరక్షణ సాధ్యమైందన్నారు. ఆలయ భూముల ఆక్రమణలను అడ్డుకోవడానికి, ఆస్తుల పరిరక్షణకు సిసిఎల్ఎ అధ్యక్షతన రాష్ట్ర స్థాయి, కలెక్టర్ల అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. దేవాదాయశాఖకు చెందిన భూములు లీజు కాలపరిమితి పూర్తయినప్పటికీ రెన్యువల్ చేయించకోకపోవడం, డబ్బు చెల్లించకపోవడం వంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఈ చట్టసవరణ దోహదపడుతుందన్నారు. ఖాళీగా ఉన్న భూములు, స్థలాలను వేలం నిర్వహిస్తామని, దానిలో గతంలో బకాయిలున్న వారు పాల్గొనకూడదన్నారు. దేవాదాయశాఖకు చెందిన ఆస్తులు పరిరక్షణకు ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కమిటీలు, దేవాలయ భూములపై ప్రతినెలా సమీక్షించి నివేదిక ఇస్తాయని, దానిపై రాష్ట్ర స్థాయి కమిటీ చర్యలు తీసుకుంటుందన్నారు. భూముల ఆక్రమణలకు సంబంధించి ఎటువంటి లోసుగులు లేకుండా పారదర్శకంగా వేలం వేస్తామని మంత్రి తెలిపారు. దేవాదాయ భూముల్లో అగ్రికల్చర్, కమర్షియల్ మొత్తం కలిపి సుమారు 4,53,173 ఎకరాలు ఉన్నాయని తెలిపారు. విలువైన భూముల్లో తాత్కాలిక కట్టడాలకు అనుమతి ఇస్తామన్నారు. రూ.5 లక్షల లోపు ఆదాయం ఉన్న దేవాలయాలకు ట్రస్టీలను ఏర్పాటు చేయాలని ఆయా దేవాలయాలకు వంశపారంపర్య అర్చకులు, వ్యవస్థాపక కుటుంబ సభ్యులకు నిర్వహణను అప్పగిస్తామన్నారు. ఆయనతోపాటు దేవాదాయశాఖ కమిషనరు ఎస్ సత్యనారాయణ, అడిషనల్ కమిషనరు రామచంద్రమోహన్ ఉన్నారు.

కేంద్రం వెనక్కి తగ్గదు

- సిఎఎపై ఆర్‌ఎస్‌ఎస్ నేత హొసాబలే

అహ్మదాబాద్ : పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ)పై కేంద్ర ప్రభుత్వం వెనక్కి తగ్గబోదని ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన కార్యదర్శి దత్తాత్రేయ హొసాబలే చెప్పారు. అయితే చట్టం అమలులో ఎదురయ్యే అవరోధాలను తొలగించేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించాల్సిన అవసరం ఉన్నదని ఆయన అభిప్రాయపడ్డారు. పాకిస్తాన్ నుండి వలస వచ్చిన హిందువులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ సీఏఏకు వ్యతిరేకంగా జరుగుతున్న కుట్ర, దుష్ప్రచారంలో భాగంగానే ఆందోళనలు చేస్తున్నారని విమర్శించారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లలో ఇబ్బందులు పడుతున్న మైనారిటీలకు పౌరసత్వం జారీ చేసే ప్రక్రియను వేగవంతం చేసేందుకే సవరణ చట్టాన్ని తీసుకొస్తున్నామని ఆయన వివరించారు. దీని అమలుకు కేంద్రం కట్టుబడి ఉన్నదని చెప్పారు.

రీ అడ్మిషన్ల గందరగోళం

- పది, ఇంటర్ తప్పిన విద్యార్థులు మళ్లీ చదవాల్సిందే
- జిల్లా విద్యాశాఖ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నూతన విద్యావిధానమో లేక ప్రభుత్వ అనాలోచిత నిర్ణయమో కానీ ఇంటర్ సెకండ్ ఇయర్‌లో ఫెయిల్ అయిన విద్యార్థులు, అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షల్లో కూడా ఫెయిల్ అయిన వారికి రీ అడ్మిషన్ ఇచ్చి రెగ్యులర్‌గా పరిగణించి విద్యా బోధన చేయాలని ప్రభుత్వం ఆయా జిల్లాల విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇది ఇంటర్మీడియట్‌కే కాదు పదో తరగతి ఫెయిల్ అయిన వారికీ కూడా మళ్లీ పదో తరగతిలోనే రీ అడ్మిషన్ ఇవ్వాలని పాఠశాలల విద్యాశాఖ అధికారులకు కూడా ఆదేశాలు అందాయి. ఈ విషయాలను సోమవారం ఉన్నత విద్యా మండలి అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లా అధికారులకు సమాచారం అందించారు. అయితే ఒక్కటి, రెండు సబ్జెక్టులు ఫెయిల్ అయిన విద్యార్థులు వచ్చే పరీక్షల్లో ఫెయిల్ అయిన సబ్జెక్టులు మాత్రమే రాయాలా లేక అన్ని రాయాలా అనేది స్పష్టత ఇవ్వలేదు. ఫెయిల్ అయిన విద్యార్థులు మళ్లీ ఎందుకు రీ అడ్మిషన్ తీసుకోవాలంటే రాష్టంలో డ్రాప్ అవుట్స్ తగ్గించడం కోసం, బడి బయట ఎవరూ ఉండకూడదనే లక్ష్యంతోనే ఈ పద్ధతికి ప్రభుత్వం శ్రీకారం చుట్టినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. రీ అడ్మిషన్ పద్ధతి గందరగోళంగా ఉందనే అభిప్రాయం ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాల్లో వెల్లడవుతోంది. రీ అడ్మిషన్ తీసుకోవడం ద్వారా విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న జగనన్న విద్యా కానుక, జగనన్న విద్యా కిట్లు వంటి పథకాలు వర్తిస్తాయని చెబుతున్నారు. ఇప్పటికే ఫెయిల్ అయిన విద్యార్థుల లిస్ట్ ప్రతి సచివాలయంలో ఉంది. సచివాలయం ద్వారా ఈ ప్రక్రియను చేపట్టనున్నట్లు సమాచారం. మరి ప్రయివేట్ పాఠశాలల్లో, కళాశాలల్లో ఫెయిల్ అయిన విద్యార్థుల గురించి ఎలా..? వాళ్లు మళ్లీ రీ అడ్మిషన్ తీసుకోవాలంటే వేలకు, వేల రూపాయలు కట్టాల్సి ఉంటుంది. వారి పరిస్థితి ఏమిటన్నది స్పష్టత లేదు. ఈ విధానం వలన విద్యార్థులకు ఉపయోగం ఉందా అని విద్యాధికారులను అడిగితే డ్రాఫ్ అవుట్స్ తగ్గించాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని పేర్కొంటున్నారు. వంద శాతం విద్యాసంస్థల్లో ఎన్‌రోల్‌మెంట్ ఉండాలని ప్రభుత్వం చెపుతున్నా ఇది ఆచరణలో సాధ్యమేనా? అనే ప్రశ్నలు విద్యాశాఖలో ఉత్పన్నం అవుతున్నాయి. ఈ ఏడాది మార్చిలో జరిగిన పరీక్షల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొదటి సంవత్సరంలో 72 శాతం, ద్వితీయ సంవత్సరంలో 76 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫెయిల్ అయిన 28, 24 శాతం విద్యార్థులను రీ అడ్మిషన్ చేయించుకోవడం కోసం ఆయా కళాశాలల ప్రిన్సిపళ్లు, అధ్యాపకులు, పాఠశాలల ఉపాధ్యాయులు కుస్తీ పడుతున్నారు. ఎన్‌రోల్‌మెంటును ఎలాగైన పెంచాలనే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. ఇదిలా ఉండగా ఫెయిల్ అయిన వారికీ మళ్ళీ అడ్మిషన్ ఇవ్వడం ఏమిటని, జాతీయ విద్యావిధానంలో భాగమే ఫెయిల్ రీ అడ్మిషన్స్‌కు ప్రభుత్వం తెర లేపిందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఈసారి పది పరీక్షల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం బాగా పడిపోవడంతో ప్రయివేట్, కార్పొరేట్ కళాశాలల్లో అడ్మిషన్లు లేక వెలవెలబోతున్నాయని, వాటికి ఆదాయం చేకూర్చడం కోసమే రీ అడ్మిషన్‌కు ప్రభుత్వం తెర లేపిందని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి.

సెన్సెక్స్ పరుగుల హోరు

ముంబయి : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుస లాభాలతో నూతన రికార్డ్‌లను నమోదు చేస్తున్నాయి. మంగళవారం సెషన్‌లోనూ కొనుగోళ్ల మద్దతుతో సెన్సెక్స్ 274 పాయింట్లు లేదా 0.42 శాతం పెరిగి 65,479కి చేరింది. ఇంట్రాడేలో ఏకంగా 500 పాయింట్ల మేర పెరిగి 65,672 మార్క్‌ను తాకింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 66.45 పాయింట్లు లాభపడి 19,389 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, విదేశీ సంస్థాగత మదుపరుల కొనుగోళ్ల మద్దతు సూచీల లాభాలకు దోహదం చేశాయి. సెన్సెక్స్-30లో బజాజ్ ఫైనాన్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, టెక్ మహీంద్రా, సన్‌ఫార్మా, ఎన్‌టిపిసి షేర్లు అధికంగా లాభపడిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

హోటళ్ల ఆదాయంలో 20% వృద్ధి : ఓయో

న్యూఢిల్లీ : ప్రముఖ హాస్పిటాలిటీ అగ్రిగేటర్ ఓయో ప్రారంభించిన యాక్సిలరేటర్ ప్రోగ్రామ్‌లో చేరిన హోటల్ యాజమానుల ఆదాయంలో 20 శాతం వృద్ధి చోటు చేసుకుందని ఆ సంస్థ తెలిపింది. హోటళ్లను విస్తరించే ఉద్దేశ్యంతో ఏర్పాటు చేసిన ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా 100 కంటే ఎక్కువ మొదటి తరం హోటళ్లకు మద్దతుగా ఈ ఏడాది డిసెంబర్ ముగింపు నాటికి 1000 హెూటళ్లను జోడించనున్నన్నట్లు తెలిపింది. ఇందులో ఇప్పటికే ఓయో 30 హోటల్ యజమానులు కొత్తగా 250 హోటళ్లకు మద్దతును అందించారని పేర్కొంది. ఢిల్లీలో ఈ ప్రోగ్రామ్‌లో ఎక్కువ మంది హోటల్ యజమానులు భాగస్వామ్యం కాగా.. తర్వాత హైదరాబాద్, బెంగళూరు నిలిచాయని తెలిపింది.

ఇక్బాల్ అవుట్ .?

- హిందూపురం సమన్వయకర్తగా దీపికా




ప్రజాశక్తి - అనంతపురం ప్రతినిధి

హిందూపురం వైసిపి అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్‌ను ఆ పదవి నుంచి తప్పించారు. ఆ స్థానంలో దీపికారెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఆ పార్టీ ప్రకటన జారీ చేసింది. 2019 ఎన్నికల సమయంలో మహమ్మద్ ఇక్బాల్‌కు హిందూపురం ఎమ్మెల్యే టిక్కెట్టు ఇచ్చారు. టిడిపి కంచుకోట అయిన హిందూపురంలో ఆయన విజయం సాధ్యపడలేదు. అప్పటి నుంచి ఆయనే ఇన్‌ఛార్జిగా ఉంటూ వచ్చారు. ఈ ఎన్నికల్లో ఓటమి చెందినప్పటికీ ఇక్బాల్‌కు వెంటనే ఎమ్మెల్సీ పదవినిచ్చారు. అయితే ఇక్బాల్‌తో స్థానిక నాయకులకు పడటం లేదు. ఈ క్రమంలోనే రామకృష్ణారెడ్డి హత్య జరగడం నేరుగా ఇక్బాల్‌పైనే పెద్దఎత్తున ఆరోపణలొచ్చాయి. ఆయన ఈ ఆరోపణలను ఖండించారు. స్థానిక నాయకులు కొంత మంది అధిష్టానానికి, జిల్లా పార్టీ ఇన్‌ఛార్జిగానున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో ఆయన్ను తప్పిస్తారన్న ప్రచారం కొద్దిరోజులుగా సాగుతుంది.

ఇటీవల తిరుపతిలో జరిగిన సమావేశానికి ఇక్బాల్‌ను ఆహ్వానించకుండా దీపికారెడ్డిని ఆహ్వానించారు. అప్పుడే కొత్త పేరు తెరపైకి ఇచ్చింది. దీపికారెడ్డి పేరు అనుహ్యంగా తెరపైకి రావడం, తిరుపతి సమావేశానికి పిలవడం చర్చనీయాంశం అయ్యింది. ఈమె పేరు అనూహ్యంగా తెరపైకి రావడంతోపాటు, ఇప్పుడు హిందూపురం పార్టీ సమన్వయకర్తగానూ నియమించడంతో ఆమె ఎవరు.? ఏ రకంగా తెరపైకి వచ్చిందన్న చర్చ సాగుతోంది. భర్త రెడ్డి సామాజికవర్గానికి చెందిన వ్యక్తి అయినప్పటికీ ఆమె మాత్రం బిసి సామాజిక తరగతికి చెందినవారు. భర్త వ్యాపారవేత్త కాగా ఇన్‌ఛార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ద్వారా ఆమె తెరపైకి వచ్చినట్టు తెలుస్తోంది. ఇప్పుడు ఈమెకు స్థానికంగా ఏ మేరకు మద్దతు లభిస్తుందన్నది చూడాల్సి ఉంది.

ఎందుకంటే దీపికారెడ్డి కూడా ముందు నుంచి పార్టీలో చురుగ్గా పాల్గొన్న దాఖలాల్లేవు. బయట నుంచి ఉన్నఫలంగా రాజకీయ అరంగేట్రం చేయడంతో స్థానిక నాయకులను ఈమె ఏ మేరకు సమన్వయం చేసుకోగలరన్నది ప్రశ్నార్థకంగా మారింది. మైనార్టీలు అధికంగానున్న ఈ నియోజకవర్గంలో మైనార్టీ నాయకుడుగానున్న మహమ్మద్ ఇక్బాల్‌ను కాదని దీపికారెడ్డిని తీసుకొచ్చారు. మార్పు జరుగుతుందని తెలిసినప్పటి నుంచే మహమ్మద్ ఇక్బాల్‌కు వచ్చే ఎన్నికల్లో టిక్కెటు ఖరారు చేయాలని మైనార్టీ నాయకులు హిందూపురం పట్టణంలో ప్రదర్శనలు నిర్వహించి, మద్దతు తెలిపారు.

కౌలు రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - తాళ్లరేవు

వ్యవసాయం కలిసిరాక, అప్పుల బాధ తాళలేక కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం పటవల పంచాయతీ ఇబిసి కాలనీకి చెందిన కౌలురైతు బావిశెట్టి శ్రీనివాసరావు(43) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు శ్రీనివాసరావు ఐదేళ్లుగా మూడు ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. దీని కోసం పలుచోట్ల అప్పులు చేశారు. అప్పులు తీర్చేదారి లేక మదనపడ్డారు. అప్పుల నేపథ్యంలో కుటుంబ కలహాలు కూడా ఏర్పడ్డాయి. దీంతో శ్రీనివాసరావు తీవ్ర మనస్థాపానికి గురయ్యారు. ఆదివారం ఎప్పటిలానే పొలానికి వెళ్లారు. అక్కడ పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. తోటి రైతులు, కూలీలు ఆయన్ను కాకినాడ జిజిహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. ఆయనకు భార్య గంగాభవాని, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

320 ఏళ్ల ప్రయాణానికి ముగింపు

- ప్రచురణ ఆపివేయనున్న వియన్నా దిన పత్రిక

బెర్లిన్ : ప్రపంచంలోనే అత్యంత ప్రాచీన వార్తాపత్రికల్లో ఒకటైన, వియన్నా నుండి వెలువడే వియనర్ జీటుంగ్ దినపత్రిక మూడు శతాబ్దాలకు పైగా సాగిన ప్రయాణాన్ని ముగిస్తోంది. ఈ నెల 7వ తేదీ నుండి రోజువారీ ముద్రణను నిలిపివేస్తోంది. 1703 ఆగస్టు 8న మొదటిసారిగా ఈ పత్రిక వెలువడింది. వినెరిస్చెస్ డైరియం పేరుతో మొదటిసారిగా ఈ పత్రిక ప్రచురితమైంది. ఎలాంటి కవితాత్మక భాషను ఉపయోగించకుండానే సరళంగా వార్తలను ఇవ్వడం ఆరంభించింది. "320 ఏళ్లు, 12మంది అధ్యక్షులు, 10మంది చక్రవర్తులు, రెండు రిపబ్లిక్‌లు, ఒక వార్తాపత్రిక" అని తుది ప్రింట్ ఎడిషన్‌లోని మొదటి పేజీ పేర్కొంది. ఆస్ట్రియన్ ప్రభుత్వానికి చెందిన ఈ పత్రిక సంపాదకీయ బాధ్యతల పరంగా స్వతంత్రంగా వ్యవహరించేది. ప్రింట్ ఎడిషన్‌లో కమర్షియల్ రిజిస్ట్రీకి మార్పులను ప్రచురించేందుకు కంపెనీలు సొమ్ము చెల్లించాల్సిన అవసరాన్ని ఇటీవల ఒక చట్టంలో తొలగించారు. ఆ తర్వాత రెవిన్యూ బాగా తగ్గిపోవడంతో పత్రిక ఇబ్బందుల్లో పడింది. దేశీయ, విదేశీ, సాంస్కృతిక, వాణిజ్య వార్తలను ఇస్తూ, విస్తృతంగా వ్యాసాలు ప్రచురించే ఈ పత్రిక క్వాలిటీ బాగుంటుందనే పేరు వచ్చింది. నిధుల ఇబ్బందులతో 63 ఉద్యోగాల్లో కోత పెట్టింది. సంపాదక వర్గ సిబ్బందిని 20కి పరిమితం చేసింది. ఆన్‌లైన్‌లో పత్రిక కొనసాగుతుంది. నెలవారీ ప్రింట్ ఎడిషన్ తీసుకురావాలని భావిస్తోంది.

నీట్‌పై ఉచిత మెంటార్‌షిప్ టెస్ట్ సిరీస్

తెలంగాణ మంత్రి మల్లారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష (నీట్-2024)కు సిద్ధమవుతున్న రెండు తెలుగు రాష్ట్రాల్లోని బాలబాలికల కోసం ఉచిత మెంటార్‌షిప్ టెస్ట్ సిరీస్‌ను అందించనున్నట్లు మెటామైండ్ అకాడమి ప్రకటించింది. అందుకు సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ మంత్రి చామకూర మల్లారెడ్డి ఆవిష్కరించారు. జాతీయ స్థాయిలో జరిగే ఈ పరీక్షలో తెలుగు రాష్ట్రాల్లోని విద్యార్థులు అధిక సంఖ్యలో విజయం సాధించాలంటే లక్ష్యంతో మొదటిసారిగా మెంటార్‌షిప్ టెస్ట్ సిరీస్ విధానాన్ని ప్రవేశపెడుతున్నామని మెటామైండ్ అకాడమీ డైరెక్టర్ మనోజ్‌కుమార్ తెలిపారు. బైపిసి పూర్తి చేసిన విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. హైదరాబాద్‌లోని దోమల్‌గూడ వద్ద రామకృష్ణ మఠం పక్కన మెటామైండ్ అకాడమిలో ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

పొంగులేటితో రాజగోపాల్‌రెడ్డి భేటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపిలో మార్పులు, చేర్పుల నేపథ్యంలో ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్ నేత, మాజీ ఎంపి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో భేటీ అయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లోని పొంగులేటి నివాసంలో ఆయన్ను రాజగోపాల్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. తాజా రాజకీయపరిణామాలపై చర్చించారు. కాంగ్రెస్‌లో చేరికపై పొంగులేటితో రాజగోపాల్‌రెడ్డి సంప్రదింపులు జరిపారని సమాచారం. ఇప్పటికే రాజగోపాల్‌రెడ్డిని పిసిసి చీఫ్ రేవంత్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి ఆహ్వానించిన విషయం తెలిసిందే. దీంతో రాజగోపాల్ సొంతగూటికి చేరబోతున్నారా? అనే ఊహాగానాలు వెలువడుతున్నాయి. కమలం పార్టీలో చోటుచేసుకున్న పరిణామాలతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు.

సౌకర్యాల కల్పనకు కృషి

కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజీ

ప్రజాశక్తి- అరకులోయ రూరల్ (అల్లూరి సీతారామరాజు జిల్లా)

గిరిజన పివిటిజి కుటుంబాల స్థితిగతులు, జీవన విధానంపై కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజీ ఆరా తీశారు. మంగళవారం మండలంలోని బొండం పంచాయతీ రేగ గ్రామంలో పర్యటించి ప్రజలతో ముఖాముఖి నిర్వహించాఉ. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలు, కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలు, ప్రోత్సాహకాలు అందుతున్నాయా లేదా అని అడిగితెలుసుకున్నారు. రేగ గ్రామస్తులు మాట్లాడుతూ.రైల్వే ట్రాక్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామంలో రోడ్డు, మంచి నీరు లేక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. పిల్లులు స్కూల్ కి, గ్రామస్తులు వ్యవసాయం కోసం వెళ్ళాలన్నా రైల్వే ట్రాక్ దాటి వెళ్లాల్సి వస్తుందన్నారు. రైల్వే ట్రాక్ కింద నుండి రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు.రైతులు పండిచే ప్రతీ పంటను గిట్టుబాటు ధరలు కల్పించి ఐటీడీఏ పంటను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు.

ఈ సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ డిప్యూటీ కార్యదర్శి రాజీ మాట్లాడుతూ, గిరిజన పివిటిజి గ్రామాలకు రహదారి, రక్షిత మంచినీటి, రోడ్డు సౌకర్యాలు కల్పించేందుకు రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్తానని అన్నారు.అంగన్వాడి కేంద్రంలో పౌష్టికాహారం అందించాలని ఐసిడిఎస్ అధికారులను ఆదేశించారు. కాపీ, మిరియాలు ప్రభుత్వ ఐటిడిఎ కొనుగోలు చేస్తోందని చెప్పారు. గ్రామంలో నెలకొన్న సమస్యలు అతి త్వరలో పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చారు. ఐటీడీఏ ఏపీవో మాట్లాడుతూ, పిటిజి గ్రామాలకు అన్ని సదుపాయాలు కల్పించేందుకు వివరాలు సేకరించడం జరుగుతుందన్నారు. మంచినీరు, వ్యవసాయ పనిముట్లు, రుణ సహకారం సబ్సిడీతో పిటిజి కుటుంబాలకు త్వరలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గిరిజన డిప్యూటీ సెక్రెటరీ చంద్రిక, ఐటీడిఏ ఏపీఓ, తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో నగేష్, ట్రైబల్ వెల్ఫేర్ ఏఈ అభిషేక్, ఆర్‌డబ్ల్యు ఏఈ వినీల, సర్పంచ్ డి భాస్కరరావు, ఏటిడబ్ల్యూ మలికార్జున, సచివాలయం ఉద్యోగులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వాల్తేర్ డివిజన్‌లో సానుకూల వృద్ధి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ (విశాఖ)

ఈ ఆర్థిక సంవత్సరంలో వాల్తేరు డివిజన్ వివిధ రంగాలలో సానుకూల వృద్ధిని సాధిస్తోందని రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె త్రిపాఠి తెలిపారు. ఫ్రైట్ లోడింగ్‌లో జూన్ 2023లో డివిజన్ అత్యధికంగా 5.98 మిలియన్ టన్నుల లోడింగ్‌ను సాధించిందని పేర్కొన్నారు. ఇది గత ఏడాది జూన్ నెలలో చేసిన లోడింగ్‌ను అధిగమించిందని తెలిపారు. ఈ కాలంలో రూ.700.20 కోట్ల సరుకు రవాణా ఆదాయం సాధించిందని పేర్కొన్నారు. వాల్తేరు డివిజన్ జూన్ 2023లో అత్యుత్తమ ఐరన్ ఓర్ లోడింగ్ రేటును సాధించిందని తెలిపారు. రోజుకు 14.7 రేక్‌ల లోడింగ్ రేటుతో 1.90 మిలియన్ టన్నుల ఇనుప ఖనిజాన్ని లోడ్ చేసినట్లు వివరించారు. ఈ పనితీరుతో మునుపటి ఏడాది జూన్ నెల లోడింగ్ రేటును అధిగమించిందని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగుల కృషిని వాల్తేర్ డిఆర్ఎం అనుప్ సత్పతి ప్రశంసించారు.

నిర్వాసిత కార్మికుల పట్ల నిర్లక్ష్యం వీడాలి

గంగవరం పోర్టు కార్మికుల నిరవధిక నిరసన దీక్షల్లో నేతలు

ప్రజాశక్తి -గాజువాక (విశాఖ)

ఆదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల పట్ల యాజమాన్య వైఖరికి నిరసనగా పెదగంట్యాడ గాంధీజంక్షన్ వద్ద మంగళవారం కార్మికులు చేపట్టిన నిరవధిక నిరసన దీక్షలను స్థానిక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల వేతన పెంపుపై యాజమాన్యం మొండివైఖరి అవలంభించడం సరికాదన్నారు. ఈ ఏడాది ఇంక్రిమెంటు వేసేసామని, 2024లోనే వేతనాలను పెంచుతామని యాజమాన్యం దాటవేత ధోరణిలో చెప్పడం దుర్మార్గమన్నారు. దీనిపై వైసిపి ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్ వైవి. సుబ్బారెడ్డి, ఐటి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దృష్టికి, వారి ద్వారా సిఎం జగన్‌కు విన్నవించామన్నారు. గంగవరం పోర్టు యాజమా న్యంతో సంప్రదింపులు జరిపి, సమస్యను పరిష్క రించాలని కోరినట్లు వెల్లడించారు. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ నిర్వాసిత కార్మికుల పట్ల గంగవరం పోర్టు యాజమాన్యం వైఖరి మారాలన్నారు.

కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు మాట్లాడుతూ గతేడాది రూ.500 కోట్లకుపైగా నికర లాభాలు ఆర్జించిన గంగవరం పోర్టు యాజమాన్యం, కార్మికుల వేతనాల పట్ల మొండివైఖరి వీడాలన్నారు. సంప్రదింపుల ద్వారా సమస్యను పరిష్కరించకుంటే, గంగవరం పోర్టును స్తంభింపజేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంక టరామయ్య. కార్పొరేటర్లు పల్లా శ్రీనివాసరావు, నరసింహ పాత్రుడు, గంధం శ్రీనివాసరావు వైసిపి గాజువాక నియోజకవర్గం ఇన్‌ఛార్జి దేవన్‌రెడ్డి, జనసేన నేత తాతారావు, స్టీల్ ప్లాంట్ గుర్తింపు యూనియన్ నేత ఆదినారాయణ, కసిరెడ్డి సత్య నారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఐఎన్‌టియుసి నేత కొవిరి అవతారం పాల్గొని, కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. వైస్ ప్రెసిడెంట్ కొవిరి అప్పలరాజు అధ్యక్షత వహించిన నిరసన దీక్షల్లో నొలి తాతారావు, వాసుపిల్లి, గంటిపిల్లి అమ్మోరు, మాదా అప్పారావు పేర్ల నూక రాజు, నొల్లి స్వామి, కదిరి సత్యానందం, గంటిపిల్లి లక్ష్మయ్య పాల్గొన్నారు.

37వ సెయిలింగ్ పోటీలు షురూ

జెండా ఊపి ప్రారంభించిన లెఫ్టినెంట్ జనరల్ జెఎస్ సిడాన



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 37వ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు ప్రారంభమయ్యాయి. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ సెయిలింగ్‌క్లబ్‌లో ఈఎంఈ సెయిలింగ్ అసోషియేషన్(ఈఎంఈఎస్ఎ), లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీలను మంగళవారం లెఫ్టినెంట్ జనరల్, లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వైస్ ప్రెసిడెంట్ జేఎస్ సిడాన జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెయిలింగ్ పోటీలకు హైదరాబాద్ ముఖ్యకేంద్రంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో 89మంది అనుభవజ్ఞులైన సీనియర్ సెయిలర్స్ పాల్గొంటున్నారని, ఆ క్రమంలో కలర్‌ఫుల్ బోట్లతో హుస్సేన్‌సాగర్ కనువిందు చేయనుందన్నారు. ఈ పోటీలు ఈనెల 9 వరకు జరగనున్నాయని చెప్పారు. తెలంగాణ స్పోర్ట్స్ అసోసియేషన్ ఇలాంటి ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో పాల్గొనే విధంగా యువతను ప్రోత్సహిస్తున్నదని అన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలో పాల్గొనేందుకు హుస్సేన్‌సాగర్ సెయిలింగ్ క్లబ్ ఒక వేదిక అని అన్నారు. ఏసియన్ గేమ్స్‌కు నేషనల్ లేజర్ ఛాంపియన్‌షిప్ ఈవెంట్ ట్రయిల్ లాంటిదన్నారు. ఈ పోటీల్లో 11క్లబ్‌లకు సంబంధించిన సెయిలర్స్ తమ పేర్లను నమోదు చేసుకున్నారని, 11 మంది మహిళలు, 17 మంది తెలంగాణ సెయిలర్స్ ఉన్నారని తెలిపారు. 72ఏండ్ల సెయిలర్ మురళికానూరి కూడా పోటీల్లో పాల్గొన్నారని చెప్పారు. ఈ పోటీలకు యాచింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(వైఏఐ) గుర్తింపు కూడా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ సెయిలింగ్ క్లబ్ అధ్యక్షులు రఘురామ్‌రెడ్డి, మేజర్ జనరల్ అజయ్‌శర్మ, అధికారులు పాల్గొన్నారు.

టిఆర్‌టి నోటిఫికేషన్ ఇవ్వండి

- కెసిఆర్‌కు లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయ నియామక పరీక్ష (టిఆర్‌టి) నోటిఫికేషన్‌ను ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర డిఎడ్, బిఎడ్ అభ్యర్థుల సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు రావుల రామ్మోహన్‌రెడ్డి, నాయకులు శ్రీను నాయక్, నరేష్, హరీశ్, భాను, కోటేష్, ఇర్ఫాన్, చంద్రశేఖర్, శ్రీను, లక్ష్మణ్, స్వప్న, కవిత లేఖ రాశారు. టెట్ పరీక్ష నిర్వహించి ఏడాది పూర్తవుతున్నా ఇంత వరకు ఉపాధ్యాయ పోస్టులకు ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వకుండా పెండింగ్‌లో ఉంచిందని విమర్శించారు. దీంతో నాలుగు లక్షల మంది అభ్యర్థులు తీవ్ర ఆవేదనలో ఉన్నారని తెలిపారు. 80 వేల ఉద్యోగాల్లో అన్ని రకాల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు జారీ అవుతున్నాయని పేర్కొన్నారు. కానీ ఒక్క టీఆర్టీపై నిర్లక్ష్యం చేయడం సరైంది కాదని తెలిపారు. 12 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయంటూ గతేడాది అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ ఇంతవరకూ ఆర్థిక శాఖ అనుమతి ఇవ్వకుండా ఉండడం వల్ల లక్షలాది మంది అభ్యర్థులు తీవ్ర నిరాశలో ఉన్నారని పేర్కొన్నారు. త్వరలో ఎన్నికల కోడ్ రాబోతుందనీ, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు ముడిపెట్టకుండా వెంటనే ఆర్థిక శాఖ అనుమతి ఇచ్చి ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను జారీ చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి కెసిఆర్‌తోపాటు ఆర్థిక శాఖ మంత్రి టి హరీశ్‌రావుకు రెండు మూడురోజుల్లో లేఖలు రాస్తామని తెలిపారు.

వండర్‌లా టికెట్‌పై 25% డిస్కౌంట్

హైదరాబాద్ : అతిపెద్ద అమ్యూజ్మెంట్ పార్క్ చెయిన్ వండర్ లా హాలిడేస్ లిమిటెడ్ హైదరాబాద్‌లోని తమ పార్క్ ప్రవేశ టిక్కెట్లపై 25 శాతం ఆదా చేసుకునే అవకాశాన్ని కల్పిస్తోన్నట్లు తెలిపింది. ఈ ఆఫర్ ప్రతి బుధవారం ఒక్కో పార్క్‌కు మొదటి 1000 ఆన్‌లైన్ టిక్కెట్‌లపై మాత్రమే అందుబాటులో ఉంటుందని తెలిపింది. వండర్‌లా బెంగళూరు, హైదరాబాద్, కొచ్చిలోని పార్కులలో ఆన్‌లైన్ టిక్కెట్‌లకు మాత్రమే ఆఫర్ చెల్లుబాటు అవుతుందని పేర్కొంది.

నగరి కోర్టుకు హాజరైన నటి జీవిత

ఫైనాన్సియర్ హేమరాజు వేసిన చెక్‌బౌన్స్ కేసులో హాజరు



ప్రజాశక్తి- నగరి (చిత్తూరు)

ప్రముఖ నటి, దర్శకురాలు జీవిత రాజశేఖర్ మంగళవారం నగరి కోర్టుకు హాజరయ్యారు. గరుడవేగ చిత్ర నిర్మాణంనకు గాను జరిగిన ఆర్థిక లావాదేవీల్లో నటి జీవిత అందించిన చెక్కులు బౌన్స్ అయిందంటూ నగరి నియోజకవర్గం విజయపురం మండలం, మహారాజపురంలోని సాయిశక్తి ఇంజనీరింగ్ కళాశాల యజమాని కోటీశ్వర్‌రాజు భార్య హేమరాజు నగరి కోర్టులో కేసు వేసిన సంగతి విధితమే. ఈ కేసు 19 నెలలకు పైగా నగరి కోర్టులో నడుస్తోంది. ఇందులో భాగంగా కేసు మంగళవారం కోర్టులో హియరింగ్‌కు రాగా నటి జీవితా రాజశేఖర్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరయ్యారు. ఫైనాన్సియర్ హేమరాజు తరపున విచారించాల్సిన సాక్ష్యాలను విచారించారు. దీంతో ఆమె తరపు న్యాయవాదులు తమ వాదనను ముగించారు. తాను ఎలాంటి అప్పు తీసుకోలేదంటున్న నటి జీవిత రాజశేఖర్ తరపు సాక్ష్యాలను విచారించాల్సి ఉంది. కేసును జూనియర్ సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మ ఈ నెల 19వ తేదీకి వాయిదా వేశారు.

ఇంగ్లండ్ ఆటగాడు ఓలీ పోప్ యాషెస్ సిరీస్‌కు దూరం



లండన్: యాషెస్ సిరీస్‌లో వెనుకబడ్డ ఇంగ్లండ్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. వైస్ కెప్టెన్ ఓలీ పోప్ గాయం కారణంగా యాషెస్ సిరీస్‌లో మిగిలిన మూడు టెస్టులకు దూరమయ్యాడు. అతడి కుడి భుజానికి గాయం కావడమే ఇందుకు ప్రధాన కారణమని ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డు (ఇసిబి) మంగళవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఓలీ పోప్ త్వరలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకోనున్నాడని, అతడి స్థానంలో మరో ఆటగాడిని తీసుకోలేదని ఇసిబి ఆ ప్రకటనలో పేర్కొంది. ఓలీ పోప్ తొలి టెస్టులో మొదటి ఇన్నింగ్స్‌లో 31, రెండో ఇన్నింగ్స్‌లో 14 పరుగులు చేశాడు. రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 42 పరుగులు చేసి రెండో ఇన్నింగ్స్‌లో 3 పరుగులకే ఔటయ్యాడు. యాషెస్ సిరీస్ మూడోటెస్ట్ జులై 06నుంచి లీడ్స్ వేదికగా ప్రారంభం కానుంది.

సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా అజిత్ అగార్కర్



ముంబయి: టీమిండియా సీనియర్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా భారత జట్టు మాజీ ఆల్‌రౌండర్ అజిత్ అగార్కర్ ఎంపికయ్యాడు. అగార్కర్‌ను సీనియర్ పురుషుల సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా నియమిస్తున్నట్లు బిసిసిఐ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ స్థానానికి దరఖాస్తు చేసిన అభ్యర్థులను ముగ్గురు సభ్యులతో కూడిన క్రికెట్ అడ్వైజరీ కమిటీ(సిఏసి) ఇంటర్వ్యూ చేసింది. కమిటీ సభ్యులు అజిత్ అగార్కర్‌ను సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఏకగ్రీవంగా సిఫార్సు చేశారు. సిఏసి సూచన మేరకు అగార్కర్‌ను ఛైర్మన్‌గా నియమిస్తూ బిసిసిఐ నిర్ణయం తీసుకుంది. శివసుందర్ దాస్, సుబ్రతో బెనర్జీ, సలీల్ అంకోలా, శ్రీధరన్ శరత్ సెలక్షన్ కమిటీ సభ్యులుగా ఉంటారని బిసిసిఐ ఆ ప్రకటనలో పేర్కొంది.

టాప్-5లో చోటు కోల్పోయిన హర్మన్, మంధాన

ఐసిసి ర్యాంకింగ్స్ విడుదల

దుబాయ్: అంతర్జాతీయ క్రికెట్‌మండలి(ఐసిసి) విడుదల చేసిన తాజా వన్డే బ్యాటర్స్ ర్యాంకింగ్స్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్, స్మృతి మంధాన టాప్-5లో చోటు కోల్పోయారు. ఐసిసి మంగళవారం ప్రకటించిన వన్డే బ్యాటర్స్ జాబితాలో భారత మహిళలజట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 6వ, వైస్ కెప్టెన్ స్మృతి మంధాన 7వ స్థానంలో నిలిచారు. హర్మన్ ఖాతాలో 716పాయింట్లు, స్మృతి ఖాతాలో 714పాయింట్లు ఉన్నాయి. తాజా వన్డే బ్యాటర్స్ జాబితాలో శ్రీలంక కెప్టెన్ ఛమారి ఆటపట్టు(758పాయింట్లు) అగ్రస్థానంలో నిలిచింది. ఇక బౌలర్ల జాబితాలో ఎడమచేతి వాటం స్పిన్నర్ రాజేశ్వరి గైక్వాడ్ 617పాయింట్లతో 8వ, దీప్తి శర్మ 10వ స్థానంలో నిలిచారు. తాజా బౌలర్ల ర్యాంకింగ్స్‌లో ఇంగ్లండ్‌కు చెందిన సోఫీ ఎక్లేస్టోన్ 751పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఇక టి20 బ్యాటర్స్ జాబితాలో స్మృతి మంధాన 722పాయింట్లతో 3వ స్థానంలో నిలువగా.. దీప్తి శర్మ బౌలర్ల జాబితాలో 729పాయింట్లతో 4వ స్థానంలో, రేణుక సింగ్ 700పాయింట్లతో 9వ స్థానాల్లో నిలిచారు. ఇక ఆల్‌రౌండర్ల జాబితాలో దీప్తి శర్మ 393పాయింట్లతో మూడోస్థానంలో నిలిచింది. శ్రీలంకకు చెందిన ఆటపట్టు స్వదేశంలో న్యూజిలాండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో 2-1తో గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించడంతో ఆమె ర్యాంక్ మెరుగైంది.



అల్కరాజ్ అలవోకగా..

వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో టాప్‌సీడ్, స్పెయిన్ యువ సంచలనం కార్లోస్ అల్కరాజ్ తొలిరౌండ్‌లో సునాయాసంగా విజయం సాధించాడు. మంగళవారం జరిగిన తొలి రౌండ్ పోటీలో అల్కరాజ్ 6-0, 6-2, 7-5తో ఛార్డీ(ఫ్రాన్స్)ను చిత్తుచేశాడు. తొలి సెట్‌లో ఒక్క పాయింట్‌నూ ప్రత్యర్థికి కోల్పోకుండా మ్యాచ్‌ను గెలుపొందడం విశేషం. ఇతర పోటీల్లో 8వ జెన్నిక్ సిన్నర్(ఫ్రాన్స్) 6-2, 6-2, 6-2తో సెరెండులో(అర్జెంటీనా)పై, 4వ సీడ్ రూడ్(నార్వే) 6-1, 5-7, 6-4, 6-3తో లోకోలి(ఫ్రాన్స్)పై గెలిచాడు. మూడు గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత, అన్‌సీడెడ్ ఆటగాడు స్టాన్ వావ్రింకా 7-5, 7-5, 6-4తో రుసువోరి(ఫిన్లాండ్)పై గెలుపొందగా.. 24వ సీడ్ నిషియోకా(జపాన్) 4-6, 3-6, 3-6తో గలాన్(జర్మనీ) చేతిలో ఓడాడు.

కోకా గాఫ్ ఔట్..

మహిళల సింగిల్స్‌లో ఓ సంచలనం నమోదైంది. అమెరికాకు చెందిన 7వ సీడ్ కోకా గాఫ్ తొలిరౌండ్‌లోనే ఇంటిదారి పట్టింది. మంగళవారం జరిగిన తొలిరౌండ్ పోటీలో కోకా గాఫ్ 4-6, 6-4, 2-6తో తన దేశానికే చెందిన అన్‌సీడెడ్ క్రీడాకారిణి సోఫియా కెనిన్ చేతిలో ఓటమిపాలైంది. ఈ మ్యాచ్ సుమారు 2గంటల 3నిమిషాలసేపు సాగింది. మరో పోటీలో 3వ సీడ్ రైబకినా(కజకిస్తాన్) 4-6, 6-1, 6-2తో రోజర్స్(అమెరికా)పై చెమటోడ్చి నెగ్గింది.

సివిల్స్ కోచింగ్ ఎంపికకు 9న పరీక్ష

- నేటినుంచే హాల్‌టికెట్ల డౌన్‌లోడ్: డైరెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖకు చెందిన రాష్ట్ర స్టడీ సర్కిల్‌లో సివిల్స్ ప్రిలిమినరీ మెయిన్స్ (పది నెలల రెసిడెన్షియల్) కోచింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు బుధవారం నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశమున్నది. ఈ మేరకు స్టడీసర్కిల్ డైరెక్టర్ శ్రీధర్ ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి 3405 మంది అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. ఈనెల తొమ్మిదిన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు రాతపరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ సర్దార్‌పటేల్ రోడ్‌లోని యూనివర్సిటీ పీజీ కాలేజీ, దోమల్‌గూడలోని ఏవీ కాలేజి, నాంపల్లిలోని సరోజినీ నాయుడు వనితా మహావిద్యాలయ, కోఠీలోని మహిళా కాలేజీతోపాటు వరంగల్ సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, నిజామాబాద్‌లోని ప్రభుత్వ గిరిరాజ్ కాలేజీలో పరీక్ష ఉంటుందని వివరించారు. వంద ప్రశ్నలు కలిగిన జనరల్ స్టడీస్ పరీక్ష, 40 ప్రశ్నలు కలిగిన సీ-శాట్ పరీక్ష మొత్తం 140 ప్రశ్నలకు ఈ పరీక్షను మూడు గంటల సమయంలో నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి ఉదయం పది నుంచే అనుమతిస్తారని పేర్కొన్నారు. పరీక్ష మొదలైన తర్వాత 10.30 గంటలు దాటాక అనుమతించబోమని స్పష్టం చేశారు. ఓఎంఆర్ జవాబుపత్రాల గడులను నింపేందుకు బ్లాక్ బాల్ పాయింట్ పెన్నును అభ్యర్థులు తెచ్చుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు స్టడీసర్కిల్ వెబ్‌సైట్ www.tsstudycircle.co.in ను సంప్రదించాలని కోరారు.

'సాహితీ ఫార్మా' మృతులకు పోస్టుమార్టం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ

అచ్యుతాపురం ఎస్ఇజెడ్ సాహితీ ఫార్మా పరిశ్రమలో గత నెల 30న జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి సోమవారం మృతి చెందిన కార్మికులు బి.రామేశ్వర్, సమ్మెంగి అప్పారావు మృతదేహాలకు మంగళవారం కెజిహెచ్‌లో పోస్టుమార్టం నిర్వహించి, స్వగ్రామాలకు తరలించారు. తక్షణసాయంగా మృతుల కుటుంబాలకు రూ.లక్ష చొప్పున కంపెనీ యాజమాన్యం అందించింది. ఈ నెల 12వ తేదీలోపు మరో రూ.8 లక్షలు ఇవ్వడానికి, మిగిలిన మొత్తం రూ.25 లక్షలు ఆగస్టు 10వ తేదీ లోపు ఇచ్చేందుకు అంగీకరించారు. ఈ మేరకు పరిశ్రమ యాజమాన్యం కంపెనీ లెటర్ హెడ్ మీద రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము బాధిత కుటుంబ సభ్యులు తరపున బి.ప్రసాద్, కర్రి శంకర్, బి.మహేష్, కంపెనీ యాజమాన్యం తరపున హెచ్.ఆర్ సీతారాం, సూపర్‌వైజర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బెయిల్ కోసం 'సుప్రీం'కు వెళ్లండి : ఎన్ఐఎ కోర్టు

- 11 నుంచి జైల్లోనే దీక్ష : శ్రీనివాస్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రతిపక్షనేతగా ఉన్న సమయంలో విశాఖ ఎయిర్‌పోర్టులో కోడికత్తితో జరిగిన దాడికి సంబంధించిన కేసు విచారణ మంగళవారం విజయవాడ ఎన్ఐఎ కోర్టులో జరిగింది. విచారణ సందర్భంగా ఈ కేసులో నిందితునిగా ఉన్న శ్రీనివాస్ బెయిల్ ఇవ్వాలని కోర్టును అభ్యర్థించారు. బెయిల్ అంశం తమ పరిధిలో లేదని, బెయిల్ కోసం సుప్రీంకోర్టుకు వెళ్లాలని ఎన్ఐఎ కోర్టు స్పష్టం చేసింది. గతంలో శ్రీనివాస్‌కు ఎన్ఐఎ కోర్టు ఇచ్చిన బెయిల్‌ను హైకోర్టు కొట్టేసింది. మరో వైపు లిఖితపూర్వక వాదనలు దాఖలు చేయాలని సిఎం జగన్మోహన్‌రెడ్డి తరపున న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణ ఈ నెల 11కు వాయిదా వేసింది. కోర్టు నుంచి బయటకు వచ్చిన అనంతరం శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ.. కేసులో విచారణ జాప్యాన్ని నిరసిస్తూ ఈ నెల 11 నుంచి జైల్లోనే దీక్ష చేస్తానని తెలిపారు.

ఉత్తర కాశీలో మరో గ్రామంలో పగుళ్లు!

ఉత్తరకాశీ : జోషిమఠ్ తరువాత ఉత్తరకాశీలో మరొక గ్రామంలో విస్తృతంగా భూమి బీటలు వారడం ప్రజల్లో ఆందోళన కలిగిస్తోంది. మస్తారి గ్రామంలో రోడ్లకు, అనేక ఇళ్ల గోడలకు పగుళ్లు కనిపించడంతో ప్రజల్లో ఆందోళన నెలకుంది. ఈ ఏడాది ప్రారంభంలో ఉత్తరకాశీ జిల్లా జోషిమఠ్‌లో భూమి బీటలు వారడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. వేలాది మంది ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాల్సి వచ్చింది. ప్రస్తుతం అదే రీతిలో మస్తారి గ్రామంలో పరిస్థితులు నెలకొనడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో నిరంతరం కొండచరియలు విరిగిపడుతున్నా అధికారులు దృష్టి పెట్టడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1997లో మస్తారి గ్రామాన్ని సందర్శించిన భూగర్భ శాస్త్రజ్ఞులు గ్రామంలో సర్వే నిర్వహించి కొన్ని రక్షణ చర్యలను సూచించినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ నెల 1 రాత్రి కురిసిన భారీ వర్షానికి పగుళ్లు ఏర్పడ్డం ప్రారంభమైందని, అవి క్రమంగా పెద్దవవుతున్నాయని గ్రామస్తులు చెబుతున్నారు. ప్రభుత్వం తమను వెంటనే ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మహారాష్ట్రలో ఘోరం

- 10 మంది మృతి

ముంబయి : మహారాష్ట్రలోని ధులే జిల్లాలో మంగళవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వచ్చిన ట్రక్కు అదుపుతప్పి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పది మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ధులే జిల్లా పరిధిలో మంగళవారం ఉదయం 10:45 గంటల సమయంలో ముంబయి-ఆగ్రా హైవేపై వేగంగా దూసుకెళు_న్న ట్రక్కు.. అదుపుతప్పి ముందు వెళ్తున్న కారును ఢీకొట్టింది. దీంతో కారు రోడ్డుపక్కకు ఎగిరిపడింది. రోడ్డు పక్కన నిల్చున్న వారు కూడా గాల్లో ఎగిరిపడ్డారు. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు, గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ధులే, సిర్పూర్ ఆస్పత్రులకు తరలించారు. కొందరు బస్సు కోసం వెయిట్ చేస్తుండగా, కారు ట్రక్కు వారిపైకి దూసుకెళ్లినట్లు పోలీసులు నిర్ధారించారు.

రాహుల్ గాంధీపై బలవంతపు చర్యలొద్దు

రాంచీ : మోడీ ఇంటి పేరు కేసులో తదుపరి నోటీసులు ఇచ్చేవరకూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీపై ఎలాంటి బలవంతపు చర్యలూ తీసుకోవద్దని జార్ఖండ్ హైకోర్టు మంగళవారం ఆదేశించింది. తదుపరి విచారణను ఆగస్టు 16కి వాయిదా వేసింది. 2018లో ప్రధానమంత్రి మోడీ ఇంటిపేరుపై, అప్పటి బిజెపి అధ్యక్షుడిపై రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలపై రాంచీ సివిల్ కోర్టుతో సహా, జార్ఖండ్‌లోని వివిధ కోర్టుల్లో బిజెపి నాయకులు పిటీషన్లు వేశారు. వీటిపై జార్ఖండ్ హైకోర్టు విచారణ జరుపుతోంది. ఇందులో భాగంగానే జార్ఖండ్ హైకోర్టు మంగళవారం ఈ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.

పీడిత వర్గాల పక్షాన పోరాడాలి

- అల్లూరికి నిజమైన నివాళి
- మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయాలి
- అల్లూరి 125వ జయంతి ముగింపు వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



అల్లూరి 125వ జయంతి ముగింపు వేడుకల్లో మాట్లాడుతున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, వేదికపై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో
పీడిత వర్గాల హక్కుల కోసం వారి పక్షాన పోరాడడమే మన్నెం వీరుడు అల్లూరి సీతారామరాజుకు మనమిచ్చే నిజమైన నివాళి అని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన అల్లూరి సీతారామరాజు 125వ జయంత్యుత్సవ ముగింపు వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి, విశిష్ట అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్, తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రపతి మాట్లాడుతూ, అల్లూరి జీవితాన్ని ఒక జాతి, వర్గం ఆధారంగా పరిగణించలేమని, దేశం కోసం, ప్రజలందరి కోసం పోరాడిన ఆయనను దేశవాసులందరూ సొంతం చేసుకున్నారని తెలిపారు. ఆయన ప్రజల సుఖదు:ఖాలను తన సుఖదు:ఖాలుగా మార్చుకోవడం ద్వారా ఆదర్శప్రాయుడయ్యారని పేర్కొన్నారు. బ్రిటీష్ పాలకుల అన్యాయపూరితమైన శాసనాలకు, అధికారాలకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన అల్లూరి నిలబడి భావితరాలకు స్ఫూర్తి నింపారని తెలిపారు. బ్రిటీష్ వారు హింసించినా, ఒత్తిడి తెచ్చినా లొంగలేదని, ప్రజలపై దాడులకు వ్యతిరేకంగా నిలబడి ప్రాణాలను అర్పించారని గుర్తు చేశారు. అటువంటి మహనీయుల జీవిత చరిత్రలను భావితరాలకు అందజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆయన జీవితమే స్ఫూర్తిగా వచ్చిన ఒక తెలుగు సినిమాలో శ్రీశ్రీ రాసిన 'తెలుగువీర లేవరా.... దీక్షబూని సాగరా' అనే పాటలో పేర్కొన్నట్లు ప్రజలు మేల్కొని ముందుకుసాగాలని ఆమె పిలుపునిచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో ఏర్పాటు చేసిన అల్లూరి 30 అడుగుల కాంస్య విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన స్మృతి వనాన్ని ఇదే సభావేదిక నుంచి రాష్ట్రపతి వర్చువల్‌గా ప్రారంభించారు.

అల్లూరి గొప్పతనాన్ని, చరిత్రను ముందు తరాలకు తీసుకెళ్లాలి : కెసిఆర్

అల్లూరి గొప్పతనాన్ని, చరిత్రను ముందు తరాలకు తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి కెసిఆర్ అన్నారు. అల్లూరి జయంత్యుత్సవాలు కొత్త తరానికి ఆయన పోరాట స్ఫూర్తిని తెలియజేశాయన్నారు. మహాకవి శ్రీశ్రీ అల్లూరి గురించి రాసిన 'తెల్లవారి గుండెల్లో నిదురించిన వాడా... మాలో నిదురించిన పౌరుషాగ్ని రగిలించిన వాడా' అనే పాటను చాలా ఇష్టంగా వినేవాడినని తెలిపారు. భరతజాతి చెప్పుకొనే ఎంతోమంది అమరవీరుల సరసన మేము తక్కువ కాదని మన తెలుగుజాతిని నిలబెట్టిన గొప్ప మహనీయుడు అల్లూరి అని కొనియాడారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యచంద్రులు ఉన్నంత వరకూ విస్మరించలేని క్షత్రియ వీరుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. భీమవరంలో అల్లూరి 30 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ప్రముఖ పారిశ్రామికవేత్త అల్లూరి సీతారామరాజును అతిథులు సన్మానించారు.

కర్ణాటక, కేరళలో భారీ వర్షాలు

- కర్ణాటకలో స్కూళ్లు, కాలేజీలకు సెలవులు..
- కేరళలో 2 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ

బెంగళూరు, తిరువనంతపురం : కర్ణాటక, కేరళలను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. కర్ణాటకలో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో వరద ముంచెత్తుతుంది.. మరో ఐదు రోజుల పాటు కేరళ, కర్ణాటకలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో దక్షిణ కన్నడ ప్రాంతంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించినట్టు అధికారులు పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే బయటకు రావాలని ప్రజలకు సూచించారు.. మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు.

కేరళలోనూ..


నైరుతి రుతుపవనాల నేపథ్యంలో కేరళలోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని 2 జిల్లాలకు భారత వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. మరో 10 జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ చేసింది. కేరళలోని ఇడుక్కి, కన్నూర్ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. తిరువనంతపురం, కొల్లాం మినహా 10 జిల్లాల్లో ఆరెంజ్ అలర్ట్ ప్రకటించారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ అత్యవసర ఆపరేషన్ సేవలన్నీ తెరిచి ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఇడుక్కి, మలప్పురం, అలప్పుజా, వాయనాడ్, కోజికోడ్, త్రిసూర్, పతనంతిట్ట జిల్లాల్లో ఏడు ఎన్‌డిఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. సోమవారం కొట్టాయంలో 10 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదవగా, కొచ్చిలో 7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వర్షం కారణంగా కాసర్‌గోడ్ జిల్లాలో చెట్టు విరిగి పడడంతో 11 ఏళ్ల బాలిక మరణించింది.

రాజకీయ వేధింపులతోనే తేజస్విపై ఛార్జిషీట్ : జెడి(యు)

పాట్నా : కేంద్ర ప్రభుత్వ రాజకీయ వేధింపుల్లో భాగంగానే బీహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వీయాదవ్, ఇతరులపై సిబిఐ రెండో ఛార్జిషీట్ నమోదు చేసిందని జెడి(యు) మంగళవారం విమర్శించింది. 'ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండానే తేజస్వీయాదవ్‌పై సిబిఐ రెండో ఛార్జిషీట్ నమోదు చేసింది. ఆర్‌జెడి, జెడి(యు)లు కలిసి బీహార్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసినప్పటి నుంచి సిబిఐతో పాటు, ఇతర దర్యాప్తు సంస్థలను తేజస్వి యాదవ్‌పై ప్రయోగించడాన్ని కేంద్రం ప్రారంభించింది' అని జెడి(యు) జాతీయ అధ్యక్షులు రాజీవ్ రంజన్‌సింగ్ మంగళవారం ఒక వీడియో సందేశంలో పేర్కొన్నారు. ల్యాండ్ ఫర్ జాబ్స్ స్కాంలో తేజస్వి యాదవ్, ఆయన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్, తల్లి రబ్రీ దేవితోపాటు మరో 14 మంది పేర్లతో సిబిఐ సోమవారం ఛార్జిషీట్ దాఖలు చేసింది. ప్రాథమిక నివేదిక సమర్పించే సమయానికి నిందితుల పాత్రలపై విచారణ పూర్తి కానందున ఈ రెండో ఛార్జిషీట్‌ను దాఖలు చేసినట్లు సిబిఐ అధికారులు తెలిపారు.

ఉగ్రవాదం ప్రపంచ శాంతికే ముప్పు

- షాంఘై సదస్సు ప్రారంభిస్తూ ప్రధాని మోడీ
- ఐక్యత, సమన్వయంతో ముందుకు సాగాలి: జిన్‌పింగ్
- సంపన్న దేశాల బాధ్యతారహిత విధానాల వల్లే ఉద్రిక్తతలు: పుతిన్
- వాణిజ్యంలో స్థానిక కరెన్సీలను ప్రోత్సహించాలి: ఇరాన్ అధ్యక్షుడు



న్యూఢిల్లీ : సీమాంతర ఉగ్రవాదం ప్రాంతీయ, ప్రపంచ శాంతికి ముప్పుగా ప్రధాని నరేంద్ర మోడీ పేర్కొన్నారు. షాంఘై సహకార కూటమి(ఎస్‌సిఓ) అధ్యక్ష హోదాలో 23వ శిఖరాగ్ర సదస్సును ప్రధాని మోడీ మంగళవారం నాడు ప్రారంభించారు.వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన ఈ శిఖరాగ్ర సదస్సులో ఎస్‌సిఓ సభ్య దేశాల అధినేతలందరూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోడీ మాట్లాడుతూ, ఆర్థికాభివృద్ధి, కనెక్టివిటీ, ఐక్యత, సార్వభౌమాధికారం, ప్రాదేశిక సమగ్రతను గౌరవించడం, పర్యావరణ పరిరక్షణ వంటి వాటిపై దృష్టి సారించాలని అన్నారు. కూటమిలో తొమ్మిదో పూర్తి స్థాయి సభ్యదేశంగా ఇరాన్ చేరినందున ఆ దేశాధ్యక్షుడు ఇబ్రహీం రైసీని ఆయన అభినందించారు. అలాగే షాంఘై కూటమి కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొనేందుకు బెలారస్ ముందుకు రావడాన్ని ఆయన స్వాగతించారు. చైనా కేంద్రంగా 2001లో ఏర్పాటైన షాంఘై సహకార కూటమిలో చైనా, రష్యా, భారత్, పాకిస్తాన్, తజికిస్తాన్, కజకిస్తాన్, ఉజ్బెకిస్తాన్, కిర్గిజిస్తాన్, ఇరాన్ , బెలారస్ ఉన్నాయి.చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ మాట్లాడుతూ, షాంఘై కూటమి కాలానుగుణంగా ఎదగాలని దాని వ్యవస్థాపక లక్ష్యాన్ని గుర్తుంచుకుని మరింత నిశ్చయాత్మకంగా ముందుకు సాగాలని కోరారు. సభ్య దేశాలు సరైన పంథాలో నడుస్తూ, పరస్పర సంఘీభావాన్ని, విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని కోరారు. సభ్య దేశాల మధ్య వ్యూహాత్మక, కమ్యూనికేషన్, సమన్వయాన్ని పెంచుకోవాలన్నారు. పోటీ స్థానంలో సహకారం, అభివృద్ధి, పునరుజ్జీవం కోసం ఒకరి ప్రయత్నాలకు మరొకరు గట్టిగా మద్దతివ్వడం చాలా అవసరమన్నారు. షాంఘై కూటమి దేశాలు ఆచరణాత్మక సహకారంపై దృష్టి పెట్టాలని సూచించారు. కూటమిలోని దేశాల మధ్య వాణిజ్యంలో డాలర్ బదులు స్థానిక కరెన్సీని ప్రోత్సహించాలని ఆయన సూచించారు. అందరికీ సమాన హక్కులు, న్యాయమైన నియమాలు ఆధారిత ప్రపంచ వ్యవస్థను సాధించాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.

రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ మాట్లాడుతూ, సంపన్న దేశాల బాధ్యతారహిత ఆర్థిక విధానాలే ప్రపంచ ఉద్రిక్తతలకు మూలమని అన్నారు.

అడ్డు అదుపు లేకుండా పశ్చిమ దేశాల ప్రభుత్వాలు అప్పులు చేసి ప్రపంచ ఆర్థిక వ్యవస్థను సంక్షోభంలోకి నెట్టాయని ఆయన అన్నారు. ఈ విషయాన్ని ఐఎంఎఫ్ ఎగ్జిక్యూటివ్ డైరక్టరే గత నెలలో చెప్పారని ఆయన గుర్తు చేశారు.

షాంఘై సహకార కూటమిలో పూర్తి స్థాయి సభ్యదేశంగా చేరిన ఇరాన్ నేత ఇబ్రహీం రైసీ మాట్లాడుతూ, అంతర్జాతీయ వాణిజ్యంలో డాలర్ వినియోగానికి పూర్తిగా స్వస్తి పలకాలని, తద్వారా అమెరికా ఆర్థిక బలవంతపు చర్యలు, ఆంక్షలకు చెక్ పెట్టాలని పిలుపునిచ్చారు.

గతేడాది సెప్టెంబరు 16న సమర్‌ఖండ్ సదస్సులో ఎస్‌సిఓ అధ్యక్ష బాధ్యతలను భారత్ చేపట్టింది. ఎస్‌సిఓ సంస్థలైన సెక్రటేరియట్, ఎస్‌సిఓ రాట్స్ (ప్రాంతీయ తీవ్రవాద వ్యతిరేక వ్యవస్థ) ల అధినేతలు కూడా ఈ సమావేశానికి హాజరయ్యారు. 'భద్రత కలిగిన ఎస్‌సిఓ దిశగా' అన్న అంశం ఈ సదస్సు ప్రధానాంశంగా వుంది.

దక్షిణాఫ్రికాలోనూ పోలీసుల దుశ్చర్య

- కారు నుంచి లాగి మరీ పిడిగుద్దులు
- బయటకు వచ్చిన వీడియోపై ప్రజల ఆగ్రహం

కేప్‌టౌన్ : కారును ఆపనందుకు టీనేజర్‌ను కాల్చి చంపిన ఫ్రాన్స్ పోలీసుల దుశ్చర్యను, అక్కడి ప్రజల ఆగ్రహావేశాలను ఇంకా మరువక ముందే దక్షిణాఫ్రికాలో కూడా అటువంటి ఘటనే చోటు చేసుకుంది. సివిల్ దుస్తుల్లో వచ్చిన సాయుధులైన పోలీసు అధికారులు కారు నుంచి ఒక వ్యక్తిని బయటకు లాగి, ఆ వ్యక్తి తలపై, శరీరంపై పిడిగుద్దులు గుద్దుతున్న వీడియో ఒకటి బయటకు వచ్చింది. తన్నులు తిన్న ఆ వ్యక్తి వెల్లకిలా, చలనరహితంగా పడివున్నట్లు కనిపిస్తోంది. మరో వ్యక్తిపై కూడా పోలీసు అధికారులు చేయి చేసుకోవడం ఆ వీడియోలో కనిపిస్తోంది. పోలీసులు తంతుంటే తలపై చేతులు అడ్డుపెట్టుకుని కాపాడేందుకు ప్రయత్నిస్తున్న దృశ్యం కనిపిస్తోంది. ఈ వీడియో చూసిన దక్షిణాఫ్రికా ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసుల కిరాతకంపై ఆందోళన వ్యక్తం చేశారు. దక్షిణాఫ్రికా డిప్యూటీ అధ్యక్షుడు పాల్ మషటిలె భద్రతా బృందానికి చెందినవారే ఆ పోలీసు అధికారులని, ఈ ఘటన జోహాన్నెస్‌బర్గ్‌లో జరిగిందని ఆయన కార్యాలయం మంగళవారం తెలిపింది. దక్షిణాఫ్రికాలోని పోలీసు రక్షణ దళాన్ని 'బ్లూ లైట్ బ్రిగేడ్'గా పిలుస్తారు. అనవసరంగా బల ప్రయోగానికి దిగుతారనే అప్రతిష్ట వారిపై వుంది. అనవసర బల ప్రయోగాన్ని, ముఖ్యంగా నిరాయుధులైన పౌరులపై బల ప్రదర్శనను ఉపాధ్యక్షుడు తీవ్రంగా అసహ్యించుకుంటారని ఆయన కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సంఘటనకు సంబంధం లేని వ్యక్తి మరో కారులో నుంచి ఈ వీడియో తీసి ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. ఆ సంఘటన జరిగిన వెంటనే ఆ పోలీసు అధికారులు రెండు నల్ల కారుల్లో అక్కడ నుండి వెళ్లిపోయారు. ఆ పక్కనే రోడ్డుపై మరో వ్యక్తి పడివుండడం కూడా కనిపిస్తోంది. అతనిని కూడా కొట్టారా? లేదా అనేది తెలియడం లేదు. ఈ సంఘటనపై ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో జాతీయ పోలీసు ప్రతినిధి బ్రిగేడియర్ అత్లెండా మాథె ఒక ప్రకటన చేస్తూ, సంబంధిత పోలీసు అధికారులను గుర్తించి, వారిపై అంతర్గత విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సంఘటనలోని బాధితులను కూడా పోలీసులు గుర్తించారని చెప్పారు.

శాన్‌ఫ్రాన్సిస్కోలో భారత్ కాన్సులేట్‌పై దాడి

- ఖండించిన అమెరికా


మంటల్లో దగ్ధమౌతున్న భారత్ కాన్సులెట్ క్యారాలయం

న్యూయార్క్ : శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత కాన్సులేట్ కార్యాలయాన్ని ధ్వంసం చేయడాన్ని, పైగా ఆ కార్యాలయానికి నిప్పంటించడానికి జరిగిన ప్రయత్నాన్ని అమెరికా తీవ్రంగా ఖండించింది. అమెరికాలోని విదేశీ దౌత్యవేత్తలపై లేదా దౌత్య కార్యాలయాలపై విధ్వంసం లేదా హింసకు పాల్పడడమనేది క్రిమినల్ నేరమని విదేశాంగ శాఖ ప్రతినిధి మాథ్యూ మిల్లర్ 3వ తేదీన ట్వీట్ చేశారు. ఖలిస్తాన్ మద్దతుదారులు ఈ నెల 2వ తేదీన ట్విటర్‌లో ఈ వీడియో పోస్ట్ చేశారు. కెనడాలోని భారత దౌత్యవేత్తలను బెదిరిస్తూ ఖలిస్తాన్ పోస్టర్లు వెలియడంతో కెనడా హై కమిషనర్‌కు విదేశాంగ మంత్రిత్వ శాఖ సమన్లు పంపింది. "హింస హింసను పుట్టిస్తుంది అన్న మాటలతో వున్న ఆ వీడియోలో కెనడాకి చెందిన ఖలిస్తాన్ టైగర్ ఫోర్స్ (కెటిఎఫ్) చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజార్ మృతికి సంబంధించిన వ్యాసాలను కూడా ప్రదర్శించారు. గత నెల్లోనే కెనడాలో గురుద్వారా వెలుపల నిజార్‌ను కాల్చి చంపారు. ఆదివారం తెల్లవారుజామున 1.30-2.30 గంటల మధ్య భారత కాన్సులేట్ కార్యాలయానికి నిప్పంటించారని అమెరికాలో దక్షిణాసియా బ్రాడ్‌కాస్ట్ టివి నెట్‌వర్క్‌కి చెందిన దియా టివి పేర్కొంది. వెంటనే శాన్‌ఫ్రాన్సిస్కో అధికారులు మంటలను ఆర్పివేశారని, ఎవరూ గాయపడలేదని, నష్టం పరిమితంగానే వుందని తెలిపారు.

తమిళనాడులో వలస విషాదం

- ప్రహరీ కూలి విజయనగరం జిల్లాకు చెందిన ముగ్గురు దుర్మరణం


జగన్నాథం (ఫైల్) కన్నయ్య (ఫైల్) సత్యం (ఫైల్)

ప్రజాశక్తి- బాడంగి (విజయనగరం జిల్లా)
బతుకు తెరువు కోసం తమిళ నాడు వలస వెళ్లిన విజయనగరానికి చెందిన ముగ్గురు కార్మికులు అక్కడ జరిగిన ప్రమాదంలో దుర్మరణం చెందారు. మంగళవారం సాయంత్రం జరిగిన ఈ ఘటనకు సంబంధించి మృతుల కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... విజయనగరం జిల్లా బాడంగి మండలం వీరసాగరం గ్రామానికి చెందిన నక్కేల సత్యం (38), రాపాక కన్నయ్య (56), కొల్లి జగన్నాథం (53) తమ కుటుంబాలతో సహా ఉపాధి కోసం ఆరేళ్ల క్రితం తమిళనాడులోని కోయంబత్తూరుకు వలస వెళ్లారు. ఏటా సంక్రాంతి పండగకు స్వగ్రామం వచ్చి కొద్ది రోజులు ఉండి మళ్లీ వెళ్తుండేవారు. మంగళవారం ఉదయం తమ భార్యలతోసహా ప్రహరీ నిర్మాణ పనులకు వెళ్లారు. సాయంత్రం పని పూర్తయిన తరువాత మహిళలు ఇళ్లకు వెళ్లిపోగా వీరు ముగ్గురూ అదనపు పని చేసేందుకు ఉండిపోయారు. ఈ నేపథ్యంలో నిర్మాణంలో ఉన్న ప్రహరీ కూలిపోవడంతో వారు అక్కడికక్కడే మృతి చెందారు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. గ్రామంలో తీవ్ర విషాదం అలముకుంది. సత్యానికి ఇద్దరు కుమారులు, కన్నయ్యకు ముగ్గురు పిల్లలు, జగన్నాథానికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

మరో మూడు ఎన్‌జిఓల ఎఫ్‌సిఆర్ఎ లైసెన్సుల రద్దు

న్యూఢిల్లీ : తనకు గిట్టని ప్రభుత్వేతర సంస్థ (ఎన్‌జిఒ)లపై మోడీ ప్రభుత్వం ఈడి, ఐటిలతో దాడులు చేయించడంతోబాటు విదేశీ నిధుల (నియంత్రణ) చట్టం (ఎఫ్‌సిఆర్ఎ)ను కూడా ఒక సాధనంగా ప్రయోగిస్తున్నది. బిజెపి, ఆరెస్సెస్‌ల ఆదేశాలకు తలొగ్గని సంస్థలపై పగబట్టినట్టు వ్యవహరిస్తున్న మోడీ ప్రభుత్వం తాజాగా మరో మూడు ఎన్‌జిఒల ఎఫ్‌సిఆర్ఎ లైసెన్సులను రద్దు చేసింది. ఇడి, సిబిఐ, ఐటిల మాదిరిగానే ఎఫ్‌సిఆర్ఎను కూడా మోడీ ప్రభుత్వం పెద్దయెత్తున దుర్వినియోగపరుస్తున్నదని విమర్శలొస్తున్నాయి. ఎఫ్‌సిఆర్ఎ లైసెన్సులు రద్దయిన,లేదా లైసెన్సు పునరుద్ధరించని ఎన్‌జిఒల జాబితా భారీగా పెరుగుతోంది. మోడీ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన 2019 తరువాత నుంచి మూడేళ్లలో 1,811 సంస్థల లైసెన్సులు రద్దయ్యాయి. మొత్తంగా గత 10 ఏళ్లలో 20,600 ఎన్‌జిఒలు ఎఫ్‌సిఆర్ఎ లైసెన్సులను కోల్పోయాయి. ఢిల్లీలోని యంగ్ ఉమెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ (వైడబ్ల్యుసిఎ)తో పాటు ఇతర ప్రాంతాల్లో ఉన్న సిఎన్ఐ శిశు సంగోపన్ గృహ, ప్రోగ్రామ్ ఫర్ సోషల్ యాక్షన్ (పిఎస్ఎ) అనే మూడు ఎన్‌జిఒలు తమ ఎఫ్‌ఆర్‌సిఎ అనుమతులును కోల్పోయాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జూన్ చివరిలో జరిపిన సమీక్షలో వీటి అనుమతులను రద్దు చేసింది. ఈ ఎన్‌జిఒలు చిన్నారులు, మహిళలు సంక్షేమం కోసం పాటుపడడంతోబాటు, బాలికలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పోరాడుతున్నాయి. ఎఫ్‌సిఆర్ఎలోని సెక్షన్ 16(1), సెక్షన్ 12(4)(బి)లను సాకుగా చూపుతూ, వీటి అనుమతులు రద్దు చేశారు. నిజానికి ఈ సెక్షన్లు తీవ్రమైనవి కావు. అనుమతుల కోసం సకాలంలో దరఖాస్తు చేయాలని ఈ సెక్షన్లు చెబుతున్నాయి. వీటిని చూపి హోం శాఖ అనుమతులు రద్దు చేసింది. అయితే తాము సకాలంలోనే దరఖాస్తులు చేసామని మూడు సంస్థలు చెబుతున్నాయి.

షిండే అనర్హతపై స్పీకర్ జాప్యం సుప్రీంను ఆశ్రయించిన ఉద్ధవ్ థాకరే గ్రూపు

న్యూఢిల్లీ : మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేపై అనర్హత వేటు ప్రక్రియను అసెంబ్లీ స్పీకర్ రాహుల్ నార్వేకర్ జాప్యం చేస్తున్నారంటూ ఉద్ధవ్ థాకరే గ్రూపు మంగళవారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. రాష్ట్రంలో ప్రస్తుతం ఎన్‌సిపి రెండుగా చీలి అజిత్ పవార్ గ్రూపు షిండే ప్రభుత్వంలో చేరిన సమయంలో థాకరే గ్రూపు ఈ పిటిషన్ వేసింది. స్పీకర్ తన రాజకీయ సంబంధాలకు అతీతంగా వ్యవహరిస్తూ, తన విధులను నిర్వహించాల్సి వుందని, కానీ ఇక్కడ స్పీకర్ నార్వేకర్ ప్రవర్తన రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్ (ఫిరాయింపుల నిరోధక చట్టం)ను ఉల్లంఘిస్తోందని ఉద్ధవ్ థాకరే గ్రూపు తన పిటిషన్‌లో సుప్రీంకోర్టుకు తెలిపింది. 'నేరం చేసిన సభ్యులపై దాఖలు చేసిన అనర్హత పిటీషన్లను త్వరగా, గడువులోగా పరిష్కరించాలని స్పీకర్‌ను ఆదేశించాలని, లేదా ప్రత్యామ్నాయంగా అనర్హత పిటీషన్లపై సుప్రీంకోర్టే స్వయంగా నిర్ణయం తీసుకోవాలి' అని శివసేన (యుబిటి) నాయకులు సునీల్ ప్రభు దాఖలు చేసిన 406 పేజీల పిటీషన్‌లో కోరారు. ఈ సందర్భంగా 2020లో కౌషమ్ మేఘచంద్ర సింగ్ వర్సెస్ మణిపూర్ లెజిస్లేటివ్ అసెంబ్లీ కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉద్ధవ్ గ్రూపు తరపు న్యాయవాదులు గుర్తు చేశారు. అనర్హత పిటీషన్లను దాఖలు చేసిన తేదీ నుంచి మూడు నెలలలోపు నిర్ణయించాలని అప్పట్లో తీర్పు ఇచ్చింది. ఈ ఏడాది మే 11న థాకరే-షిండే వివాదం కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇస్తూ స్పీకర్ నార్వేకర్‌పై విశ్వాసం ఉంచిందని, అనర్హత పిటీషన్లపై స్పీకర్ సరైన నిర్ణయం తీసుకుంటారని తెలిపిందని థాకరే గ్రూపు గుర్తు చేసింది. ఈ తీర్పు ఇచ్చి మూడు నెలలు గడిచినా స్పీకర్ ఎలాంటి చర్యలూ తీసుకోలేదని, ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ఒక్క విచారణకు కూడా పిలవలేదని తెలిపింది.

ఢిల్లీ పోలీసుల నివేదికపై మీ స్పందనేంటి ?

- మైనర రెజ్లర్, ఫిర్యాదీదారుని కోరిన ఢిల్లీ కోర్టు

న్యూఢిల్లీ : మైనర్ రెజ్లర్‌ను లైంగికంగా వేధించారని ఆరోపణలు ఎదుర్కొంటున్న బిజెపి ఎంపి, డబ్ల్యుఎఫ్ఐ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై కేసును రద్దు చేయాలని కోరుతూ ఢిల్లీ పోలీసులు ఇచ్చిన తుది నివేదికపై బాధితురాలు, ఫిర్యాదుదారు నుంచి స్పందనను ఢిల్లీ కోర్టు కోరిందని ప్రాసిక్యూషన్ తరపు న్యాయవాది చెప్పారు. ఆగస్టు 1కల్లా తమ స్పందనను పోలీసులకు తెలియజేయాల్సిందిగా ఆదేశిస్తూ అదనపు సెషన్స్ న్యాయమూర్తి ఛావి కపూర్ ఇరువురికి నోటీసులు జారీ చేసి, విచారణను వాయిదా వేసినట్లు ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాస్తవ తెలిపారు. సింగ్‌పై పోస్కో అభియోగాలను ఉపసంహరించాల్సిందిగా గత నెల 15న ఢిల్లీ పోలీసులు సిఫార్సు చేశారు. ఆరుగురు మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించారంటూ ఆయనపై లైంగిక వేధింపుల అభియోగాలు నమోదు చేశారు. సింగ్‌పై ధృవీకరించే సాక్ష్యాధారాలు లేవంటూ ఆయనపై మైనర్ రెజ్లర్ పెట్టిన ఫిర్యాదును రద్దు చేసుకోవాల్సిందిగా పోలీసులు సిఫార్సు చేశారు. పోలీసుల నివేదికను ఆమోదించాలా లేక తదుపరి దర్యాప్తుకు ఆదేశించాలా అనేది కోర్టు నిర్ణయం తీసుకోనుంది. జూన్ 15కల్లా చార్జిషీట్ దాఖలవుతుందని ప్రభుత్వం గతంలో హామీ ఇచ్చింది. సింగ్‌ను అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు డిమాండ్ చేస్తున్నారు.

సెంథిల్ బాలాజీ అరెస్టు చట్టబద్ధతపై మద్రాస్ హైకోర్టు విభజన తీర్పు

- విచారించనున్న మూడో న్యాయమూర్తి

చెన్నై : మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ భార్య వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్ (హెచ్‌సిపి)పై మద్రాసు హైకోర్టు మంగళవారం విభజన తీర్పునిచ్చింది. గత నెల 14న ఇడి అధికారులు మంత్రిని అరెస్టు చేశారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీ కింద ఆయన ప్రైవేట్ ఆస్పత్రిలో వున్నారు. మంత్రి సతీమణి వేసిన పిటిషన్‌ను విచారణకు అనుమతించాలని న్యాయమూర్తుల్లో ఒకరైన జస్టిస్ జె.నిషా బాను పేర్కొన్నారు. మంత్రిని అరెస్టు చేయడానికి ముందు అనుసరించాల్సిన చట్టపరమైన పద్ధతులు అనుసరించడంలో ఇడి విఫలమైనందున వెంటనే ఆయనను విడుదల చేయాలని జూన్ 14నే సెషన్స్ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేసినా ఇప్పటివరకు జ్యుడీషియల్ రిమాండ్‌లోనే వుంచినందున ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టవచ్చని పేర్కొన్నారు. సెషన్ న్యాయమూర్తి ఆదేశాల కారణంగా మంత్రిని కస్టడీలో ఇంటరాగేట్ చేయడానికి ఇడికి అధికారం లేదని న్యాయమూర్తి బాను పేర్కొన్నారు. మరోవైపు జస్టిస్ డి.భారత చక్రవర్తి మాట్లాడుతూ, హెబియస్ కార్పస్ పిటిషన్‌తో విభేదించి తోసిపుచ్చారు. దీనిపై విచారణ చేపట్టలేమన్నారు. సంపూర్ణ చట్టవిరుద్ధమైన కేసుల్లో లేదా పూర్తిగా మనసు పెట్టకపోవడం లేదా వారి పరిధిలో లేకపోవడం లేదా ప్రాథమిక హక్కులు పూర్తిగా ఉల్లంఘించబడిన కేసుల్లో మినహా హెచ్‌సిపి విచారణయోగ్యం కాదని జస్టిస్ చక్రవర్తి పేర్కొన్నారు. ప్రస్తుత విషయంలో, అసాధారణ అధికారాలను వినియోగించడానికి గానూ పిటిషనర్ పైన పేర్కొన్నటువంటి ఏ ఒక్క కారణాన్ని కోర్టుకు విన్నవించలేదన్నారు. అందువల్ల ఈ పిటిషన్‌ను తోసిపుచ్చాలని పేర్కొన్నారు. పైగా మంత్రిని ఆ రాత్రి చేర్చిన తమిళనాడు ప్రభుత్వ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నుండి కావేరీ ఆస్పత్రికి తరలించాల్సిందిగా జూన్ 15న తాను, జస్టిస్ బాను ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు.



పాదయాత్రలో పాల్గొన్న యువతీ యువకులతో వామపక్ష, ప్రజా సంఘాల నేతలు



సింగ్‌నగర్ ప్లై ఓవర్‌పై సాగుతున్న మహాపాదయాత్రలో ఒక భాగం



బుడమేరు వంతెన వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న వి శ్రీనివాసరావు, లక్ష్మణరావు తదితరులు



గిరిజన సాంప్రదాయ తలపాగాతో రాఘవులు, శ్రీనివాసరావు, కె రామకృష్ణ



కొమ్ము తలపాగాతో శ్రీనివాసరావు, రాఘవులు తదితరులు




బి కిరణ్‌కు జ్ఞాపిక అందిస్తున్న రాఘవులు, వి శ్రీనివాసరావు



మొడియం నాగమణికి జ్ఞాపిక అందిస్తున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు



వేదికపై గేయాలు ఆలపిస్తున్న ప్రజా నాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ తదితరులు



త్వరలో 'బ్రో' మ్యూజిక్

హీరో పవన్ కళ్యాణ్ టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'బ్రో'. సముద్రఖని దర్శకత్వం వహిస్తున్నాడు. వినోదయ సీతమ్ రీమేక్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో సాయిధరమ్ తేజ్ మరో లీడ్ రోల్ పోషిస్తున్నాడు. ఈ చిత్రం జులై 28న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ పనులు ప్రారంభించారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ థమన్ బ్రో మ్యూజికల్ బ్లాస్ట్ త్వరలోనే షురూ కానుందని ట్వీట్ చేశారు. మొదటి పాటను ఈ వారంలోనే విడుదల చేయబోతున్నారని తెలుస్తోంది. చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తుండగా.. వివేక్ కూచిబొట్ల కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.


టైమ్స్ స్క్వేర్‌లో సితార



హీరో మహేష్ బాబు కూతురు సితారకు సోషల్ మీడియాలో మంచి క్రేజ్ ఉంది. ఈ నేపథ్యంలో ప్రముఖ బంగారు నగల తయారీ సంస్థ పిఎంజె జివెల్స్ ప్రత్యేకంగా సితార కలెక్షన్ పేరుతో ఓ స్పెషల్ బ్రాండ్‌ని రూపొందించింది. రీసెంట్‌గానే దీనికి సంబంధించిన యాడ్‌ను షూట్ చేశారు. కాగా.. ఇప్పుడు ఈ యాడ్‌కు సంబంధించిన ఫొటోలను ప్రెస్టీజియస్ న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో ప్రదర్శించారు. దీనికి సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇంత చిన్న వయసులోనే సితార ఇలాంటి ఘనత సాధించడంతో మహేష్ మురిసిపోయారు. సితారను చూస్తే గర్వంగా ఉందని ఈ ఫొటోలను అభిమానులతో పంచుకున్నాడు.

నేడు 'డెవిల్' గ్లింప్స్ వీడియో

కల్యాణ్‌రామ్ తాజా ప్రాజెక్టు 'డెవిల్'. నవీన్ మేడారం దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన కొత్త అప్‌డేట్ ఒకటి బయటకు వచ్చింది. పీరియాడిక్ స్పై థ్రిల్లర్ కథాంశంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం



నుంచి గ్లింప్స్ వీడియోను జులై 5న బుధవారం విడుదల చేస్తున్నట్టు మేకర్స్ ప్రకటించారు. ఇప్పటికే ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. దేవాన్ష్ నామా సమర్పణలో అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌పై అభిషేక్ నామా ఈ సినిమాని నిర్మిస్తున్నారు. శ్రీకాంత్ విస్సా కథ, స్క్రీన్ ప్లే, డైలాగ్స్ సమకూరుస్తున్నారు. హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందిస్తున్నారు. తమిళనాడులోని వివిధ లొకేషన్లతోపాటు పలు ప్రాంతాల్లో ఈ సినిమాని చిత్రీకరించారు. కల్యాణ్ రామ్ సరికొత్త అవతార్‌లో ఈ చిత్రంలో కనిపించబోతున్నారని తెలుస్తోంది.

ఉత్కంఠభరితంగా 'మంగళవారం'



'మంగళవారం' అనే థ్రిల్లర్ సినిమాతో నటుడు అజయ్ ఘోష్ వస్తున్నాడు. తాజాగా ఈ సినిమా టీజర్ రిలీజైంది. ఎటువంటి డైలాగ్ లేకుండా ఫస్ట్ నుంచి చివరి వరకు ఉత్కంఠ భరితంగా సాగింది. ఇద్దరి శవాలను చూపిస్తూ ఊర్లో ఏదో జరుగుతుందన్న భయంతో అందరూ భయపడుతూ పైకి చూడటం.. మెయిన్‌గా ప్రతి షాట్‌లో కళ్లనే హైలెట్ చేస్తూ చూపించడం కాస్త ఆసక్తిని రేకెత్తిస్తుంది. ఓ వ్యక్తి అమ్మవారి మాస్క్ పెట్టుకుని తిరుగుతున్నట్లు చూపించారు. అజనీష్ లోక్‌నాథ్ బ్యాక్‌గ్రౌండ్ సంగీతం బాగుంది. నందిత శ్వేత, కృష్ణ చైతన్య, అజయ్ ఘోష్ కీలకపాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా సౌత్‌లోని అన్ని భాషల్లో విడుదల కానుంది. ఇక అజయ్ ఈ సినిమాను ముద్ర మీడియా, ఏ క్రియేటీవ్ వర్క్స్‌తో కలిసి స్వీయ నిర్మాణంలో తెరకెక్కిస్తున్నాడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది.

'లియో'లో అనురాగ్ కశ్యప్



విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'లియో'. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో పాపులర్ డైరెక్టర్లు గౌతమ్ వాసు దేవ్‌మీనన్, మిస్కిన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారని ఇదివరకే ప్రకటించారు. తాజా సమాచారం ప్రకారం మరో ప్రముఖ దర్శకుడు కూడా ఈ చిత్రంలో భాగస్వామ్యం కాబోతున్నట్టు తెలుస్తోంది. బాలీవుడ్ దర్శక, నిర్మాత అనురాగ్ కశ్యప్ 'లియో'లో కీలకపాత్రలో నటిస్తున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. హీరోయిన్‌గా త్రిష నటిస్తున్నారు. ఇంకా సంజయ్‌దత్, అర్జున్, ప్రియా ఆనంద్, మలయాళ నటి శాంతి మాయాదేవి, మన్సూర్ అలీఖాన్, మాథ్యూ థామస్, సాండీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అక్టోబర్ 19న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది.

షారుక్‌కి గాయం..



అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో ఓ సినిమా చిత్రీకరణ జరుగుతుండగా బాలీవుడ్ నటుడు షారుక్‌ఖాన్ ప్రమాదానికి గురైనట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో ఆయన ముక్కుకు గాయమైందని వార్తలొస్తున్నాయి. మైనర్ సర్జరీ తరువాత షారుక్ ఇండియాకి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందని తెలుస్తోంది.

శాఫ్ టైటిల్ విజేత భారత్

ఫైనల్లో కువైట్‌పై షూటౌట్‌లో గెలుపు

9వ సారి టైటిల్‌ను ముద్దాడిన ఛెత్రీ సేన

బెంగళూరు: శాఫ్ ఛాంపియన్‌షిప్-2023 టైటిల్‌ను డిఫెండింగ్ ఛాంపియన్ భారతజట్టు రికార్డుస్థాయిలో 9వ సారి ముద్దాడింది. శ్రీ కంఠీరవ స్టేడియంలో మంగళవారం ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో ఛెత్రీ సేన పెనాల్టీ షూటౌట్‌లో 5-4గోల్స్ తేడాతో కువైట్‌పై విజయం సాధించింది. నిర్ణీత, అదనపు సమయం పూర్తయ్యే సరికి ఇరుజట్లు 1-1గోల్స్‌తో సమంగా నిలిచాయి. కువైట్ తరఫున గోల్‌ను షబీబ్ అల్-ఖల్దీ(14వ ని.)లో కొట్టాడు. భారత్ తరఫున గోల్‌ను ఛిహంగేల్(38వ ని.)లో చేశాడు. దీంతో ఇరుజట్లు తొలి అర్ధభాగంలోనే ఒక్కో గోల్ కొట్టాయి. రెండో అర్ధభాగంలో కువైట్ జట్టు బంతిని ఎక్కువ సమయం తమ ఆధీనంలోనే పెట్టుకొన్నా.. భారత రక్షణశ్రేణి సమర్ధవంతంగా నిలువరించింది. రెండు మూడుసార్లు కువైట్‌కు, ఒకటి, రెండుసార్లు భారత్‌కు గోల్‌కొట్టే సువర్ణావకాశాలు లభించినా ప్రయోజనం లేకపోయింది. ఇక అదనపు సమయంలో ఇరు జట్లు గోల్ చేసేందుకు పోటాపోటీగా తలపడ్డా గోల్ చేయలేక పోయాయి. దీంతో ఫలితం కోసం పెనాల్టీ షూటౌట్‌లను నిర్దేశించగా.. తొలి ఐదు గోల్స్ పూర్తయ్యేసరికి ఇరుజట్లు 4-4 గోల్స్‌తో సమంగా నిలిచాయి. ఆ తర్వాత నాకౌట్‌లో భారత్ తొలుత ఒక గోల్ చేయగా.. కువైట్ ఆటగాడు కొట్టి గోల్‌ను భారత గోల్ కీపర్ గుర్‌ప్రీత్ అద్భుతంగా నిలువరించి బంతిని గోల్‌పోస్ట్‌లోకి వెళ్లకుండా అడ్డుకున్నాడు. దీంతో భారత్ 5-4గోల్స్ తేడాతో గెలిచి టైటిల్‌ను మరోమారు ముద్దాడింది. సెమీఫైనల్లోనూ భారతజట్టు పెనాల్టీ షూటౌట్‌లో 4-2గోల్స్ తేడాతో పటిష్ట లెబనాన్‌ను, కువైట్ జట్టు 1-0తో బంగ్లాదేశ్‌ను ఓడించి ఫైనల్లోకి దూసుకొచ్చిన సంగతి తెలిసిందే. లీగ్ దశలో గ్రూప్-ఏలో భారత జట్టు నేపాల్, పాకిస్తాన్ పై గెలిచి, కువైట్‌తో మ్యాచ్‌ను డ్రా చేసుకొంది. ఫిఫా ర్యాంకింగ్స్‌లో భారతజట్టు 100, కువైట్141 ర్యాంక్‌లో ఉన్నాయి. గోల్డెన్ బూట్, గోల్డెన్ బాల్ భారత కెప్టెన్ సునీల్ ఛెత్రీకి లభించాయి. విజేతకు రూ.41లక్షలు(50వేల డాలర్లు), రన్నరప్ కువైట్ జట్టుకు రూ.20.50 లక్షలు(25వేల డాలర్లు) ప్రైజ్‌మనీ దక్కింది. ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు సుమారు 30వేల మంది ప్రేక్షకులు హాజరయ్యారు.

పెనాల్టీ షూటౌట్ ఇలా..

భారత్:	✓	✓	✓	✗	✓	✓
కువైట్:	✗	✓	✓	✓	✓	✗



శాఫ్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌లో భారత ఆటగాళ్లు

జింబాబ్వే కూడా ఇంటికే..

స్కాట్లాండ్ ఆశలు సజీవం ● ఐసిసి వన్డే ప్రపంచకప్ క్వాలిఫయర్స్



హరారే: ఐసిసి వన్డేప్రపంచకప్ 2023కు జింబాబ్వే కూడా అర్హత సాధించలేక పోయింది. మెగా టోర్నీకి అర్హత సాధించా లంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో జింబాబ్వే జట్టు స్కాట్లాండ్ చేతిలో 31పరుగుల తేడాతో ఓటమిపాలైంది. శ్రీలంక చేతిలో ఇప్పటికే ఓడిన జింబాబ్వే సూపర్-6లో ఓమన్‌జట్టుపై మాత్రమే గెలించింది. రెండుసార్లు ఛాంపియన్ వెస్టిండీస్ జట్టు ఈ ప్రపంచకప్‌కు దూరమైన సంగతి తెలిసిందే. స్కాట్లాండ్-నెదర్లాండ్స్ జట్ల మధ్య గురువారం(6న) జరిగే మ్యాచ్‌లో గెలిచిన జట్టు నేరుగా వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించనుంది. గ్రూప్ దశలో ఓటమి ఎరుగని జింబాబ్వే సూపర్-6కి ప్రవేశించిన జింబాబ్వేకు నిర్ణయాత్మక మ్యాచ్‌లో స్కాట్లాండ్ గండి కొట్టింది. మెగా టోర్నీకి అర్హత సాధించాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో జింబాబ్వే జట్టు స్కాట్లాండ్ చేతిలో 31పరుగుల తేడాతో ఓడి వన్డే ప్రపంచకప్‌కు అర్హత సాధించడంలో మరోసారి విఫలమైంది. మంగళవారం జరిగిన సూపర్-6 నిర్ణయాత్మక మ్యాచ్‌లో తొలిగా బ్యాటింగ్‌కు దిగిన స్కాట్లాండ్ జట్టు 50ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 234పరుగులు చేసింది. మిఛెల్ లిస్క్(48) టాప్ స్కోరర్. విలియమ్స్‌కు మూడు, ఛటారాకు రెండు వికెట్లు దక్కాయి. ఛేదనలో జింబాబ్వే జట్టు 13పరుగులకే రెండు, 37పరుగులకొచ్చేసరికి 4వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ దశలో రియాన్ బర్ల్(83), మధ్వెరా(40) స్ఫూర్తి దాయక ఇన్నింగ్స్ ఆడారు. వీరిద్దరూ ఔటయ్యాక లోయర్ ఆర్డర్ బ్యాటర్స్ ఘోరంగా నిరాశపరిచారు. దీంతో జింబాబ్వే జట్టు 41.1 ఓవర్లలో 203పరుగులకే కుప్పకూలింది. సోలేకు మూడు, ముల్లెన్, లిస్క్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సోలేకు లభించింది. శ్రీలంక జట్టు సూపర్-6లో మూడు వరుస విజయాలతో ఇప్పటికే అర్హత సాధించగా.. జింబాబ్వే జట్టు సూపర్-6లో నెదర్లాండ్స్‌పై గెలిచి శ్రీలంక, స్కాట్లాండ్ జట్ల చేతిలో ఓటమిపాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది.

రాష్ట్రస్థాయిలో క్రీడలకు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు

విశాఖ, విజయవాడ, మంగళగిరిలో క్రీడా అకాడమీలు : సిఎస్ జవహర్‌రెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలో క్రీడలకు సంబంధించి రాష్ట్ర స్థాయిలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కెఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. సచివాలయంలో మంగళవారం 2023-28 రాష్ట్ర క్రీడా విధానంపై క్రీడాశాఖాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించి కేంద్రానికి ప్రతిపాదనలు పంపామని, అది మంజూరైతే రాష్ట్రానికి క్రీడా పరంగా దేశంలోనే మరింత గుర్తింపు వస్తుందన్నారు. విశాఖ, విజయవాడ, మంగళగిరిలో మూడు క్రీడా అకాడమీలను ఏర్పాటు చేసేందుకు నూతన క్రీడా విధానంలో పొందుపరచాలన్నారు. జిల్లాల్లో 16 క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సిఎస్ పేర్కొన్నారు. ప్రతి క్రీడా పాఠశాలలో 100 మంది బాలురు, 120 మంది బాలికలకు 16 విభాగాలకు సంబంధించిన వివిధ క్రీడల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా వారిలో క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలని అధికారులకు సిఎస్ సూచించారు. వీటి ఏర్పాటుకు భూమి, నిధులు, ఇతర అవసరాలు కావాలనే దానిపై పూర్తి స్థాయిలో అంచనా వేసి నివేదిక సిద్ధం చేయాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో క్రీడాపరమైన మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు వీలుగా చర్యలు తీసుకోవాలన్నారు. 'ఆడుదాం ఆంధ్ర' పేరిట క్రీడా పోటీలకు సంబంధించి ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేసేందుకు పూర్తి స్థాయి కార్యాచరణతో సిద్ధం కావాలన్నారు. తొలుత రాష్ట్ర యువజన సర్వీసులు, క్రీడలశాఖ ముఖ్య కార్యదర్శి వాణీమోహన్ 2023-28 రాష్ట్ర క్రీడా విధానానికి సంబంధించి ముఖ్యాంశాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ఎమ్‌డి హర్షవర్ధన్, ఎఒ రామకృష్ణ పాల్గొన్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68